www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 259

శుక్రవారం | 3-1-2025 | పేజీలు: 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 11.40 తదుపరి పంచమి; నక్షత్రం: ధనిష్ఠ రా. 10.22 తదుపరి శతభిషం; వర్జ్యం: తె. 5.16-6.48; దుర్ముహూర్తం: ఉ. 9.01-9.45, మ. 12.41-1.25; అమృతఘడియలు: మ. 12.18-1.51; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 5.49

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలుగు మహోన్నతం



పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించి ఓ స్టాల్‌లో పుస్తకాలు చూస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

బడుల్లో పిల్లలకు తెలుగు వ్యాకరణం నేర్పించాలి

- సాహిత్యంతో మనస్సు, మేధస్సు వికసిస్తుంది
- మాతృభాష రక్షణకు పుస్తక ప్రదర్శనలు దోహదం
- సృజనాత్మకత పెంపునకు పుస్తక పఠనం ముఖ్యం
- రచయితల గుర్తులను పర్యాటకంగా మార్చాలి
- 'సూర్యరాయాంధ్ర' నిఘంటువు పునఃప్రచురణకు అయ్యే మొత్తం ఖర్చును నేనే భరిస్తా
- విజయవాడలో పుస్తక మహోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): "పిల్లలకు అన్ని పాఠశాలల్లో తెలుగు వ్యాకరణం నేర్పించాలి. దీనిపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. తెలుగు అధ్యాపకులకు సమాజంలో ఎక్కువ వేతనాలు ఉండాలి. మాతృభాషపై పూర్తిస్థాయిలో పట్టు సాధించినప్పుడు.. ఇంగ్లిష్ నేర్చుకోవడం సులభమవుతుంది. మాతృభాషలో నైపుణ్యం లేకుండా ఏ భాషలోనూ పట్టు సాధించలేం. సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి, కొత్త దృక్కోణాల ఆవిష్కరణలకు పుస్తక పఠనం చాలా అవసరం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన

మిగతా 14వ పేజీలో...



కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కొత్త సీఎస్ విజయానంద్

తల్లికే తొలి వందనం!

బడికెళ్లే పిల్లలందరికీ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

- ఆన్ గోయింగ్ పథకాలపై కేబినెట్‌లో చర్చ
- 'తల్లికి వందనం' ఇవ్వాలన్న మంత్రులు
- వేసవి సెలవుల అనంతరం హామీ అమలు
- త్వరలోనే రైతులకు 'అన్నదాత సుఖీభవ'
- కేంద్రం పెంచిన 10 వేలకు మరో పది వేలు కలిపి రూ.20 వేలు ఇద్దామన్న చంద్రబాబు
- నిధుల లభ్యతను బట్టి 'ఆడబిడ్డల నిధి' కూడా..
- మత్స్యకారులకు ఇరవై వేలు ఏప్రిల్‌లో చెల్లింపు
- ఎన్ని ఇబ్బందులు ఉన్నా వరుస క్రమంలో హామీలు అమలు చేద్దామన్న ముఖ్యమంత్రి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయంలో 'తల్లికి వందనం' అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. గురువారం కేబినెట్ సమావేశంలో దీనిపై కీలక చర్చ జరిగింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం .. ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఉన్నా ఇచ్చిన హామీలు ఇప్పటికే కొన్ని అమలు చేశామని, మిగతా హామీలనూ వరుస క్రమంలో అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బడికి వెళ్లే పిల్లలందరికీ 'తల్లికి వందనం' పేరుతో రూ.15వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రులు కోరారు. వేసవి సెలవుల తర్వాత

మిగతా 13వ పేజీలో...

పెండింగ్ బిల్లులు రూ. 1.30 లక్షల కోట్లు

- గత ప్రభుత్వం చెల్లించని బకాయిలు
- ఉద్యోగుల పాదుపు 20 వేల కోట్లూ వాడేశారు
- చివరకు కోర్టు పరిధిలోని డిపాజిట్లనూ వదల్లేదు
- మంత్రివర్గానికి నివేదించిన రాష్ట్ర ఆర్థిక శాఖ
- జూన్‌లోపు టీచర్ల నియామకాలకు సీఎం ఆదేశం
- లోకేశ్ విజ్ఞప్తితో కాలేజీల ఫీజు బకాయిల్లో కొంత విడుదలకు చంద్రబాబు అంగీకారం
- సమావేశంలో రెవెన్యూ శాఖకు సీఎం అక్షింతలు
- మీకన్నంత సహనం ప్రజలకు ఉండదని వ్యాఖ్య
- 'జల హారతి'పై కేబినెట్‌లో సవివర చర్చ

అమరావతిలో 2,723 కోట్ల పనులు

- పాత టెండర్లు రద్దు.. కొత్త వాటికి ఆమోదం
- 'చిత్తూరు'లో ఐఆర్ బెటాలియన్‌కు 40 ఎకరాలు
- వంద పడకలకు తిరుపతి ఈఎస్ఐ అప్‌గ్రేడ్
- రైల్వేజోన్‌కు 8న ప్రధాని శంకుస్థాపన: మంత్రి

13

భారీ పెట్టుబడులు సాకారం!

- పట్టాలెక్కనున్న బీపీసీఎల్, టీసీఎస్ ప్రాజెక్టులు.. రామాయపట్నంలో భారీ ఆయిల్ రిఫైనరీ
- విశాఖలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్యకలాపాలు.. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- టీసీఎస్ రాకతో తొలి దశలో 2 వేల ఉద్యోగాలు.. విస్తరణ తర్వాత 10 వేల మందికి ఉపాధి
- కనిగిరిలో కంప్రెస్డ్ బయో గ్యాస్ విద్యుత్ ప్లాంటు.. ఇందుకోసం రిలయన్స్‌కు 4 వేల ఎకరాలు
- కాకినాడ, నంద్యాల, కడప, పత్తికొండలో కొత్తగా రానున్న ఇంధన ఆధారిత ప్లాంట్లు



'కక్ష సాధింపులకు పాల్పడను'... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్న మాట ఇది! మంచిదే! పాలకుడంటే ఇలాగే ఉండాలి! రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. ఏం చేసినా చట్ట పరిధిలోనే చేయాలి! కానీ... తనను దూషించిన, తన విధానాలను కాసింత బహిరంగంగానే వ్యతిరేకించిన, వైసీపీతో బాగా అంటకాగిన అధికారికి పిలిచి 'మళ్లీ' పీఠం ఇవ్వడాన్ని ఏమంటారు? అది కూడా... చట్టం అనుమతించకపోయినా 'నువ్వే కావాలి' అంటూ సర్వీసు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఎలా చూడాలి? ఇది అతి మంచితనమా? అవగాహన లేకపోవడమా? ఎవరైనా తప్పుదారి పట్టించారా? ఐఏఎస్ అధికారి బుడితి రాజశేఖర్ సర్వీసును ఏడాది పాటు పొడిగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై అధికార వర్గాల్లో జరుగుతున్న చర్చ ఇది!

బాబును తిట్టు.. అయినా పోస్టు పట్టు!

- బుడితి రాజశేఖర్ సర్వీసు పొడిగింపుపై విస్మయం
- 2014-19లోనూ ఆయనకు చంద్రబాబు ప్రాధాన్యం
- అయినా సీఎం నిర్ణయాలకు వ్యతిరేకంగా గళం
- మీడియా సమక్షంలోనే సీఎంపై మండిపాటు
- జగన్ సీఎం అయ్యాక ఆయనకు వీరవిధేయుడు
- రిటైరయ్యాక మరో ఏడాది సర్వీసుకు నేడు చాన్స్
- డీవోపీటీ నిబంధనలకు విరుద్ధంగా అందలం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా రిటైరయిన బి.రాజశేఖర్‌కు ప్రభుత్వం మరో ఏడాది పాటు సర్వీసు పొడిగించిన సంగతి తెలిసిందే. గతంలో కూడా చంద్రబాబు ఆయనకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న రాజశేఖర్‌కు పదోన్నతి లేకుండానే ఆయన హోదాను స్పెషల్ చీఫ్ సెక్రటరీగా మార్చారు. ప్రతి విషయంలోనూ చంద్రబాబు

మిగతా 14వ పేజీలో...



బోరుగడ్డ అనిల్‌ను మరికొంతకాలం జైల్లో ఉండనీయండి

- అసభ్య పోస్టులు పెట్టడం తప్ప వేరే పనిలేదా?
- ఆ తరహా పదజాలాన్ని ఆమోదించలేం
- బోరుగడ్డ అనిల్ తీరుపై హైకోర్టు అసహనం
- ఇలాంటి వ్యక్తిపై కనికరం చూపలేమని వ్యాఖ్య
- బెయిల్ పిటిషన్ కొట్టివేత

12

బెకెమ్ మట్టి దందా

ఏలూరు జిల్లాలో అడ్డగోలుగా ఎర్రమట్టి దోపిడీ

- లీజు తీసుకుంది ఒకచోట.. తవ్వకాలు మరోచోట
- పర్మిట్లను దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ
- పాక్షిక నిజాలతోనే గనుల శాఖ డీడీ నివేదిక
- 36.68 కోట్ల జరిమానా.. మంత్రి కొల్లు వద్ద అప్పీల్
- తెర వెనుక సెటిల్‌మెంట్‌కు రంగంలోకి పెద్దలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగిపోయింది. ఇసుక నుంచి బెరైటీస్ వరకూ... క్వార్ట్జ్ నుంచి గ్రానైట్ వరకూ దేన్నీ వదలకుండా వైసీపీ నేతలు, వారికి కొమ్ముకాసే కంపెనీలు అడ్డగోలుగా దోచుకొని రూ.కోట్లు దండుకున్నారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాథపురం గ్రామాల్లో ఎర్రమట్టి దోపిడీ కలకలం రేగింది. జగన్ ప్రభుత్వంలో ఈ రెండు గ్రామాల్లోని భూముల్లో బెకెమ్ ఇన్‌ఫ్రా కంపెనీ ఎర్రమట్టి మైనింగ్ చేపట్టింది. గనులశాఖలోని కొందరు అధికారుల సహకారంతో కొండలు, చెట్లు, భూమి ఆనవాళ్లు కూడా కనిపించనంతగా

మిగతా 2వ పేజీలో...

'సజ్జల' సామ్రాజ్యంలో 42 కాదు.. 52 ఎకరాలు!

- అటవీ భూముల ఆక్రమణ
- పేదల చుక్కల భూములూ కబ్జా
- రామకృష్ణారెడ్డి సోదరుల దందా
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై డిప్యూటీ సీఎం పవన్ స్పందన.. విచారణకు ఆదేశం

2



విశాఖ ఉక్కుకు కొత్త ఊపిరి?

రూ. 17 వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ!

- నిధులుగా కాకుండా టెక్నాలజీ రూపంలో
- బ్లాస్ట్ ఫర్నేసుల స్థానంలో 3 'ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేసులు'
- వీటికి రూ.7,500 కోట్ల ఖర్చు
- ఈ ఫర్నేసుల ద్వారా నాణ్యమైన ఉక్కు ఉత్పత్తి
- దానిని విదేశాలకు ఎగుమతి చేసే యోచన
- టెక్నాలజీ అందించేందుకు జపాన్ సంస్థల ఆసక్తి
- మళ్లీ తెరపైకి 'పోస్కో' పేరు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును ఆర్థికంగా ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రూ.17 వేల కోట్లతో కొత్త రివైవల్ ప్యాకేజీ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నిధుల రూపంలో కాకుండా టెక్నాలజీ రూపంలో అందిస్తారని చెబుతున్నారు. ప్రస్తుతం విశాఖ ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా స్టీల్ తయారుచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ముడి పదార్థాలు సమకూర్చుకోలేక ప్రస్తుతం రెండు బ్లాస్ట్ ఫర్నేసులనే నడుపుతున్నారు. వీటి స్థానంలో కొత్తగా మూడు 'ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేసులు'

మిగతా 2వ పేజీలో...

2 వేల కోట్లతో రోడ్డు కమ్ మెట్రో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు

3

- మెట్రో సాకారం దిశగా అడుగులు.. కేంద్రం సాయంపై దృష్టి
- తొలి విడతలో బెజవాడలో 4.7 కి.మీ.. విశాఖలో 4 కి.మీ.

అమరావతి ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పు!

- ఫేజ్-2 డీపీఆర్ కన్సల్టెంట్ కోసం టెండర్లు
- ఐఆర్ఆర్ ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్‌కు ఆర్ఎఫ్‌పీ

14



11

పొలాలకు పీఎం కుసుమ్!

- 17 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు
- కేంద్ర పథకంలో చేరాలని రాష్ట్రం నిర్ణయం
- గ్రిడ్ అనుసంధానంతో రైతులు మిగులు కరెంట్ అమ్ముకొనే చాన్స్



సెకనులో 100 జీబీ డేటా!

2

6జీ రేసులో మస్క్ కంపెనీ స్టార్‌లింక్‌ను దాటేసిన చైనా జిలిన్ నుంచి గ్రౌండ్ స్టేషన్‌కు డేటా పంపిన చాంగ్‌గ్వాంగ్

తెలుగు తేజాలకు అర్జున

- స్ప్రింటర్ జ్యోతి, పారా రన్నర్ దీప్తికి పురస్కారాలు
- గుకేశ్, మను భాకర్‌లకు ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న
- హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్, పారాజంపర్ ప్రవీణ్‌కూ..
- జాతీయ క్రీడా పురస్కారాల్ని ప్రకటించిన కేంద్రం
- మొత్తం 32 మందికి అర్జున.. 17న ప్రదానం
- విజేతలకు చంద్రబాబు అభినందనలు



గుకేశ్



మను భాకర్

ఏపీ స్ప్రింటర్ జ్యోతి యర్రాజి, తెలంగాణ పారా రన్నర్ దీప్తి జీవాంజిలను దేశ రెండో అత్యుత్తమ క్రీడా పురస్కారం 'అర్జున' వరించింది. చెస్ కింగ్ గుకేశ్, పిస్టల్ రాణి మను భాకర్, హాకీ సారథి హర్మన్‌ప్రీత్ సింగ్, పారా హైజంపర్ ప్రవీణ్ కుమార్‌లను 'ఖేల్‌రత్న' అవార్డుకు కేంద్రం ఎంపిక చేసింది.



జ్యోతి



దీప్తి

10



దాడుల వెనక ఐఎస్?

- అమెరికా న్యూ ఆర్లిన్స్ ఘటన నిందితుడు జబ్బార్ కారులో ఇస్లామిక్ స్టేట్ జెండా
- నిర్ధారించిన అధ్యక్షుడు జోబైడెన్, ఎఫ్‌బీఐ
- ఘటనలో 15కు చేరిన మృతుల సంఖ్య
- లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ వద్ద కారు బాంబు పేలుడు, ఒకరి మృతి
- రెండు ఘటనలకు సంబంధం!: మస్క్

2

న్యూయార్క్‌లో కాల్పులు.. 11 మందికి గాయాలు



మేనేజ్ చేసి మేనేజర్ పైకి నెట్టి

- బియ్యం కేసులో అమాయకుడిని బలి చేసే వ్యూహం
- చేసిన తప్పును గోడౌన్ మేనేజర్‌పై నెట్టేసే ప్రయత్నం
- 6 నెలల క్రితమే మేనేజర్‌కు బాధ్యతలంటూ పోలీసు విచారణలో పేర్ని భార్య బుకాయింపు
- 2023 నుంచి మేనేజర్‌గా పనిచేస్తున్న మానస్ తేజ్
- ఏడాదిలో అతని ఖాతాలో రూ.22.39 లక్షలు జమ
- బియ్యం విక్రయం ద్వారానే వచ్చి చేరిన నగదు
- ఆ డబ్బంతా పేర్ని కుటుంబానికే అందజేత
- విచారణలో గుర్తించిన పోలీసులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

పేదల బియ్యాన్ని స్వాహా చేసి అడ్డంగా దొరికి పోయిన మాజీ మంత్రి పేర్ని నాని తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఓ అమాయకుడిని బలి చేసేందుకు సిద్ధమయ్యారు. దీనికోసం ఆయన కుటుంబం బుకాయించేందుకు వెనుకాడలేదు. తమ గోదాములో బియ్యం మాయమైన కేసులో బుధవారం పోలీసు విచారణకు

మిగతా 11వ పేజీలో...



క్రూరత్వంతో చితక్కొట్టి.. ఆపై ఉరివేసి

- నడిరోడ్డుపై భర్తను హత్య చేసిన భార్య
- మద్యానికి బానిసై వేధిస్తున్న భర్తకు 'మరణ శిక్ష'
- బాపట్ల జిల్లాలో ఘటన
- వీడియో వైరల్‌తో తీవ్ర సంచలనం



12

సెకనులో 100 జీబీ డేటా!

6జీ రేసులో మస్క్ కంపెనీ స్టార్‌లింక్‌ను దాటేసిన చైనా

- జిలిన్ శాటిలైట్ నుంచి గ్రౌండ్ స్టేషన్‌కు డేటా ట్రాన్స్‌మిట్ చేసిన 'చాంగ్ గ్వాంగ్' సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 2: అత్యంత వేగంగా డేటాను సరఫరా(ట్రాన్స్‌మిట్) చేయడంలో చైనా కీలక ముందడుగు వేసింది. ఈ విషయంలో స్పేస్ ఎక్స్‌కు చెందిన స్టార్‌లింక్‌ను అధిగమించినట్లు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' తెలిపింది. చైనాకు చెందిన చాంగ్ గ్వాంగ్ శాటిలైట్ టెక్నాలజీ సెకనుకు 100 గిగాబైట్ల డేటాను ట్రాన్స్‌మిట్ చేసేలా అత్యాధునిక హైరిజల్యూషన్ స్పేస్ టు గ్రౌండ్ లేజర్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ ప్రయోగంలో భాగంగా జిలిన్-1 ఉపగ్రహం నుంచి ట్రక్‌పై అమర్చిన గ్రౌండ్ స్టేషన్‌కు ఈ డేటాను సెకనులోనే పంపించింది. ఇది గత రికార్డు కంటే దాదాపు 10 రెట్ల వేగంతో ప్రయాణించింది. చాంగ్ గ్వాంగ్ సంస్థ లేజర్ గ్రౌండ్ కమ్యూనికేషన్ల అధిపతి వాంగ్ హాంగ్‌హాంగ్ మాట్లాడుతూ.. స్టార్‌లింక్ 6జీ టెక్నాలజీని అభివృద్ధి చేస్తోందన్నది అధికారిక సమాచారం కాదని చెప్పారు. ఈ విషయంలో తమ టెక్నాలజీ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీని అధిగమించేసిందన్నారు. "మస్క్‌కు చెందిన స్టార్‌లింక్.. లేజర్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఆవిష్కరించింది. కానీ, దాన్ని శాటిలైట్ టు గ్రౌండ్ కమ్యూనికేషన్‌కు ఇప్పటి వరకు వాడలేదు. వారి వద్ద ఈ టెక్నాలజీ ఉండొచ్చు. కానీ, మేం ఇప్పటికే భారీ స్థాయిలో వినియోగించడం మొదలుపెట్టాం" అని వెల్లడించారు. ఈ కంపెనీ జిలిన్-1 శ్రేణిలోని ఉపగ్రహాలను 2027 నాటికి పూర్తిగా కక్ష్యలోకి చేర్చనుంది. 100 జీబీపీఎస్ డేటా అంటే.. 10 పూర్తిస్థాయి సినిమాల పరిమాణంలో ఉంటుంది. దీన్ని చైనా సంస్థ ఒక్క సెకన్‌లో సరఫరా చేయగలిగింది. గతంలో అమెరికాకు చెందిన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నాసాకు చెందిన టెరాబైట్ ఇన్‌ఫ్రారెడ్ డెలివరీ సిస్టమ్స్ సంస్థ కూడా 100 జీబీపీఎస్ ట్రాన్స్‌మిట్ చేసింది. అయితే తమ సంస్థ పేలోడ్ చాలా పెద్దదని చాంగ్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 5జీ కమ్యూనికేషన్ వాడుకలో ఉంది. దీనికి ఆధునిక వెర్షన్ 6జీ. దీన్ని అత్యధిక ఫ్రీక్వెన్సీ బ్యాండ్ల వద్ద వినియోగిస్తారు. తాజాగా చైనా 5జీ ఆధారిత అత్యాధునిక మొబైల్ స్టేషన్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రకటించింది. ఇది యుద్ధ వాతావరణంలో కూడా మూడు కిలోమీటర్ల పరిధిలో 10,000 మంది వరకు అత్యంత సురక్షితంగా, వేగంగా డేటాను పంపిస్తుంది. దీన్ని చైనా మొబైల్ కమ్యూనికేషన్స్ గ్రూప్, ఆ దేశ ఆర్మీ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.





చెదురుతున్న అమెరికా కలలు!

- 97వేల మంది భారతీయ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకం
- హెచ్-1బీ వీసాకు కీలకమైన ఓపీటీపై అమెరికన్ల నిరసనలు

న్యూఢిల్లీ, జనవరి 2: అమెరికా చదువులు ఉద్యోగ భరోసాకు, శాశ్వత నివాసానికి బాటలు వేస్తాయన్న ధీమా క్రమంగా బలహీనపడుతోంది. హెచ్-1బీ వీసా జారీకి కీలకమైన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగామ్‌పై అమెరికన్లలో పెరుగుతున్న వ్యతిరేకత విదేశీ విద్యార్థులపై ప్రత్యేకించి భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఓపీటీని రద్దు చేయాలని 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' మద్దతుదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమం అమెరికన్ల ఉద్యోగాలను విదేశీ విద్యార్థులు పొందడానికి అనుమతించే లొసుగని మండిపడుతున్నారు. ఓపీటీ రద్దుపై రాబోయే ట్రంప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అమెరికాలో చదువుతున్న 97వేల మందికి పైగా భారతీయ విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎఫ్-1 వీసాలపై ఉన్న విదేశీ విద్యార్థులు తమ చదువుకు సంబంధించిన రంగాల్లో 12 నెలల వరకూ పని చేయడానికి ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. స్టెమ్ (ఎస్‌టీఈఎం) గ్రాడ్యుయేట్లు ఈ వ్యవధిని అదనంగా మరో 24 నెలలు పొడిగించుకోవడం ద్వారా మూడేళ్ల వరకూ అమెరికాలో ఉండి పని అనుభవం పొందే అవకాశం ఉంది. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ పని అనుభవం వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. నైపుణ్యం కలిగిన విదేశీయులు మరో ఆరేళ్ల పాటు అమెరికాలో ఉండటానికి ఈ వీసా అనుమతిస్తుంది.

కర్ణాటక ఆర్టీసీకి 'ఉచితం' దెబ్బ?

- బస్సు చార్జీలు 15 శాతం పెంపు
- కర్ణాటక మంత్రివర్గం ఆమోదం

బెంగళూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 'శక్తి' గ్యారెంటీ ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌలభ్యాన్ని కల్పిస్తున్న కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం... ఇతర ప్రయాణికులపై భారం మోపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని నాలుగు ఆర్టీసీ కార్పొరేషన్‌లు చార్జీల పెంపునకు చేసిన ప్రతిపాదనలను గురువారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఏకంగా 15 శాతం చార్జీలను పెంచేందుకు అనుమతించింది. ఈ నెల 5వ తేదీ నుంచి కొత్త చార్జీలు అమలులోకి రానున్నాయి. 2016తో పోల్చితే ఆర్టీసీపై రోజువారీ డీజిల్ భారం రూ.9.16 కోట్ల నుంచి రూ.13.2 కోట్లకు పెరిగిందని... చార్జీల పెంపుతో ఆర్టీసీ కార్పొరేషన్లకు నెలకు రూ.74.85 కోట్ల ఆదాయం అదనంగా వస్తుందని ప్రభుత్వం తెలిపింది. కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం 'శక్తి' కోసం కర్ణాటక ప్రభుత్వం ప్రతి నెలా రూ.417 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ పథకం యథాతథంగా కొనసాగిస్తామని మంత్రి హెచ్‌కే పాటిల్ పేర్కొన్నారు. అయితే... తాజా పెంపుపై విపక్షాలు మండిపడుతున్నాయి. 'ఒకే కుటుంబంలో భార్యకు ఉచిత ప్రయాణం! భర్తపై అదనపు భారం. ఇదేనా మీ పథకం' అని విమర్శిస్తున్నాయి.

విశాఖ ఉక్కుకు కొత్త ఊపిరి?

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తారని అంటున్నారు. ఈ కొత్త ఫర్నేసులకు ఒక్కొక్క దానికి రూ.2,500 కోట్ల నుంచి రూ.3 వేల కోట్లు ఖర్చవుతుంది. మూడింటికీ రూ.7,500 కోట్లు అవసరమని అంచనా. వీటి ద్వారా నాణ్యమైన ఉక్కు ఉత్పత్తి చేస్తారు. లాంగ్ ప్రొడక్టులు, భవన నిర్మాణాలు, మౌలిక వసతుల రంగంలో అధికంగా ఉపయోగించే స్టీల్‌ను తయారుచేసి విదేశాలకు ఎగుమతి చేయాలనేది ప్రణాళిక. ఈ ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్‌లకు అవసరమైన టెక్నాలజీని అందించేందుకు జపాన్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఇందులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు 'పోస్కో'. ఈ సంస్థ నాలుగేళ్ల క్రితమే విశాఖ ఉక్కుతో జాయింట్ వెంచర్ కోసం ఆసక్తి చూపిన సంగతి తెలిసిందే. ప్లాంటులో 1,500 ఎకరాలు కేటాయిస్తే స్టీల్ ఉత్పత్తి చేసి, లాభాల్లో వాటా ఇస్తామని అప్పట్లో ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదనను కార్మిక వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. విశాఖ స్టీల్‌ను ప్రైవేటుపరం చేయడానికి కుట్ర చేస్తున్నారంటూ ఆందోళనలు చేపట్టాయి. దాంతో ఆ ఆలోచన పక్కనపెట్టారు. ఇప్పుడు కేంద్రం విశాఖ ఉక్కులో ప్రైవేటు భాగస్వామ్యం పెంచి, పనితీరు మెరుగుపరచాలని.. నష్టాలు తగ్గించి, లాభాల బాటలో నడపాలని యోచిస్తోంది. దీనికి కొత్త టెక్నాలజీ ఉపయోగించాలని భావిస్తోంది.

ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేసులతో లాభం ఏమిటి?

ప్రస్తుతం కోకింగ్ కోల్, ముడి ఇనుము ఉపయోగించి బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా స్టీల్ తయారు చేస్తున్నారు. ఆర్క్ ఫర్నేస్‌లకైతే పిగ్ ఐరన్, ఇనుము తుక్కు ఉపయోగిస్తారు. కొత్త టెక్నాలజీ వల్ల కార్బన్ వ్యర్థాలు తక్కువగా వస్తాయి. పర్యావరణ హితంగా ఉంటాయి. విశాఖ ప్లాంటులో రెండు ఆర్క్ ఫర్నేస్‌లు ఇప్పటికే ఉన్నాయి. కాకపోతే వాటి సామర్థ్యం చాలా తక్కువ. ప్లాంటు అప్పులు తీర్చి, కొత్త రుణాలు తీసుకోవడానికి సుమారు రూ.20 వేల కోట్లు అవసరం. కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టకుండా.. కొత్త టెక్నాలజీ, పర్యావరణ హితమంటూ చేస్తున్న ప్రతిపాదనలను ఉద్యోగ, కార్మిక వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రివైవల్ ప్యాకేజీ పేరిట పోస్కోను తీసుకొచ్చి తమ నెత్తిన రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైన నిర్ణయం కాదని ముక్తకంఠంతో చెబుతున్నాయి.

అమెరికాలో దాడుల వెనక ఐఎస్?

న్యూ ఆర్లిన్స్ ఘటన నిందితుడి కారులో ఇస్లామిక్ స్టేట్ జెండా.. నిర్ధారించిన అమెరికా అధ్యక్షుడు బైడెన్

- 15కు చేరిన మృతుల సంఖ్య
- దుండగుడు జబ్బార్ మాజీ సైనికుడే
- లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ వద్ద.. కారు బాంబు పేలుడు, ఒకరి దుర్మరణం



నిందితుడు షంషుద్దీన్ జబ్బార్; దాడికి ఉపయోగించిన ట్రక్కు

న్యూయార్క్, జనవరి 2: ట్రంప్ సర్కారు కొలువుదీరే వేళ.. ప్రజలంతా కొత్త సంవత్సరం వేడుకల్లో మునిగి ఉండగా.. అమెరికాలో ఉగ్రవాద ఘటనలు కలకలం రేపుతున్నాయి. వరుస ఘటనలతో అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున న్యూ ఆర్లిన్స్‌లో.. ఐఎస్ ఉగ్రవాద సంస్థ నుంచి ప్రేరణ పొందిన మాజీ సైనికుడు షంషుద్దీన్ జబ్బార్ ట్రక్కుతో దాడి చేసి 15 మందిని పొట్టనబెట్టుకోగా.. లాస్ వెగాస్‌లోని ట్రంప్ హోటల్ సమీపంలో కారు బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. న్యూయార్క్ క్వీన్స్‌కౌంటీలో.. అమజురా నైట్‌క్లబ్‌లో కాల్పుల ఘటన నమోదైంది. ఇక్కడ 11 మందికి గాయాలయ్యాయి.

మాజీ సైనికుడే ఉగ్రవాది!

న్యూ ఆర్లిన్స్ ఘటనలో నిందితుడిని షంషుద్దీన్ జబ్బార్(42)గా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) అధికారులు గుర్తించారు. అతణ్ని పోలీసులు కాల్చి చంపగా.. ఘటనకు ఉపయోగించిన కారులో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) జెండా, పేలుడు పదార్థాలున్నట్లు నిర్ధారించారు. అతను ఒంటరి తోడేలు(లోన్ వోల్ఫ్) దాడి చేసి ఉంటాడని భావిస్తున్నారు. టెక్సాస్‌కు చెందిన జబ్బార్ అమెరికా పౌరుడు కాగా.. అతను యుక్తవయసులోనే ఇస్లాం మతాన్ని స్వీకరించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. 2005-15 మధ్య కాలంలో అమెరికా సైన్యంలో మానవ వనరులు-సమాచార విభాగంలో మేనేజర్‌గా పనిచేశాడు. 2009లో ఆఫ్ఘానిస్థాన్‌లో కూడా విధులు నిర్వర్తించాడు. 2015-20 మధ్యకాలంలో ఆర్మీ రిజర్వ్‌లో ఐటీ నిపుణుడిగా సేవలందించాడు. గత ఏడాది నౌకాదళంలో చేరేందుకు జబ్బార్ పేరు ఖరారైనా.. బూట్ క్యాంప్ వెళ్లకపోవడంతో తొలగించారు. 2021 నుంచి అతను డెలాయిట్ ఆడిటింగ్ సంస్థలో ఏటా 1.2 లక్షల డాలర్ల వేతనంతో సీనియర్ సొల్యూషన్ స్పెషలిస్ట్‌గా పనిచేశాడు. జబ్బార్‌కు గత నేర చరిత్ర కూడా పెద్దగా లేదని.. 2014లో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన రికార్డు మాత్రం ఉందని.. 2002లో హారిస్‌కౌంటీలో ఓ చిల్లర దొంగతనం కేసులో 9 నెలలపాటు కమ్యూనిటీ సూపర్‌విజన్ శిక్షను అనుభవించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. అతనికి రెండు పెళ్లిళ్లవ్వగా.. విడాకులు తీసుకున్నాడని, రెండో భార్య కేసులో తాను పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినట్లు, తన రియల్‌ఎస్టేట్ కంపెనీ కూడా నష్టాల్లో ఉందని లాయర్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ వైపు ఆకర్షితుడై 'చంపడం' అనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు ఎఫ్‌బీఐ గుర్తించిందని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మీడియాకు చెప్పారు. ఘటనకు ముందు అతను సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియోను పోస్టు చేశాడని, ఎఫ్‌బీఐ కూడా దాడిపై తనకు ముందుగానే సమాచారం ఇచ్చిందని వివరించారు. 'టూరో' అనే యాప్ సాయంతో ఫోర్డ్ ఎఫ్-150లైటెనింగ్ అనే భారీ ఎలక్ట్రిక్ పికప్ ట్రక్కును అద్దెకు తీసుకున్నాడని, ఆ వాహనంతోనే న్యూ ఆర్లిన్స్‌లో దారుణానికి ఒడిగట్టాడని గుర్తించామన్నారు. ఈ ఘటనలో బుధవారం 10 మంది చనిపోగా.. గురువారానికి మృతుల సంఖ్య 15కు పెరిగినట్లు తెలిపారు. మరోవైపు.. లాస్ వెగాస్‌లోని డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన ఇంటర్నేషనల్ హోటల్ వెలుపల టెస్లా సైబర్ ట్రక్ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు చనిపోగా.. ఏడుగురు గాయపడ్డారు. కారులో ఉన్న పేలుడు పదార్థాల కారణంగా ఈ ఘటన జరిగిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. అయితే.. న్యూ ఆర్లిన్స్, లాస్ వెగాస్ సంఘటనలకు సంబంధం ఉండి ఉంటుందని స్పేస్ ఎక్స్ చీఫ్ ఈలాన్ మస్క్ అనుమానం వ్యక్తం చేశారు. ఈ రెండు ఘటనల్లోనూ దుండగులు 'టూరో' నుంచి వాహనాలను అద్దెకు తీసుకున్నట్లు గుర్తుచేశారు. కాగా, లాస్ వెగాస్ ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే.. ఫ్రిమాంట్ స్ట్రీట్‌లో ఓ దుండగుడు హల్‌చల్ చేశాడు. ఓ బస్సులో తనను తాను బంధించుకున్న దుండగుడి వద్ద పేలుడు పదార్థాలున్నట్లు పోలీసులు అనుమానించారు. న్యూ ఆర్లిన్స్ తరహాలో దాడికి దుండగుడు కుట్రపని ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా, న్యూయార్క్‌లో మరోమారు కాల్పుల కలకలం నెలకొంది. గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బుధవారం రాత్రి క్వీన్స్‌కౌంటీలోని అమజురా నైట్‌క్లబ్‌లో కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 11 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

దాడిని ఖండించిన ప్రధాని మోదీ

అమెరికాలోని న్యూ ఆర్లిన్స్‌లో జరిగిన ఉగ్రదాడిని భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేశారు.

క్యాన్సర్‌కు హైడ్రోజెల్ చికిత్స

- ఐఐటీ గువాహటి పరిశోధకుల ఆవిష్కరణ
- ఎలుకల్లో ప్రయోగం విజయవంతం

న్యూఢిల్లీ, జనవరి 2: ఐఐటీ గువాహటికి చెందిన పరిశోధకులు క్యాన్సర్‌కు ఓ వినూత్న చికిత్సను అభివృద్ధిపరిచారు. క్యాన్సర్ సోకిన భాగంలోకి ఒక హైడ్రోజెల్‌ను పంపించటం ద్వారా ఈ చికిత్స అందిస్తారు. దీనివల్ల ప్రస్తుతం కీమోథెరపీ వంటి క్యాన్సర్ చికిత్సల కారణంగా తలెత్తే దుష్పరిణామాలు ఉండవని, ఇది సురక్షితమైనదని పరిశోధకులు వెల్లడించారు. కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన ఈ పరిశోధన తాలూకు వివరాలు.. రాయల్ సొసైటీ కెమిస్ట్రీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఐఐటీ గువాహటి రసాయనశాస్త్రం విభాగానికి చెందిన ప్రొఫెసర్ దేబప్రతిమ్‌దాస్ ఈ పరిశోధన గురించి వెల్లడిస్తూ.. 'అంతర్గత అవయవాలకు క్యాన్సర్ వచ్చినప్పుడు ఆ అవయవాలను శస్త్రచికిత్స చేసి తొలగించటం కుదరదు. అలాగే, కీమోథెరపీ వల్ల క్యాన్సర్ కణాలతోపాటు ఆరోగ్య కణాలు కూడా దెబ్బతింటాయి. వీటికి పరిష్కారంగా.. క్యాన్సర్ ఉన్న భాగంలోకి మాత్రమే ఔషధాన్ని తీసుకెళ్లే విధంగా హైడ్రోజెల్‌ను రూపొందించాం. క్యాన్సర్ కణితి ఉన్న ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా హైడ్రోజెల్ నియంత్రిత విధానంలో ఔషధాన్ని విడుదల చేస్తుంది. అల్ట్రాషార్ట్ పెప్టైడ్స్‌తో రూపొందే హైడ్రోజెల్ జీవద్రవ్యాల్లో కరిగిపోకుండా స్థిరంగా నిలిచి ఉంటుంది కాబట్టి ఔషధాన్ని అందించటంలో ఎటువంటి అంతరాయం ఉండదు' అని తెలిపారు. ప్రీ క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా ఎలుకల్లో రొమ్ము క్యాన్సర్‌కు ఈ చికిత్సను పరీక్షించగా.. 18 రోజుల్లోనే కణితి సైజు 75% మేర తగ్గిపోయిందని దాస్ వెల్లడించారు. ఇతర రకాల క్యాన్సర్లలో కూడా ఈ చికిత్సను ఉపయోగించటంపై అధ్యయనం జరుపుతున్నామని, దాని తర్వాత క్లినికల్ ట్రయల్స్‌కు దరఖాస్తు చేసుకుంటామని ఆయన తెలిపారు.

బాబాయ్,అబ్బాయ్ మధ్య సయోధ్య!

- పవార్‌లు కలవాలని కోరుతున్న అజిత్ తల్లి
- శరద్ పవార్ మాకు దేవుడు: ప్రఫుల్ పటేల్




ముంబై, జనవరి 3: మహారాష్ట్ర ఎన్‌సీపీలోని వైరివర్గాలు ఒక్కటి కాబోతున్నాయా? కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు బాబాయి శరద్ పవార్, అబ్బాయి అజిత్ పవార్ విభేదాలు మరచి రాజీపడబోతున్నారా..? అజిత్ తల్లి ఆశా తాయి, ఆయన వర్గం ఎన్‌సీపీ అగ్రనేత ప్రఫుల్ పటేల్ వ్యాఖ్యలు ఈ సంకేతాలే ఇస్తున్నాయి. ఆశా తాయి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం పండరీపురంలో పాండురంగ విఠలుడి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. బాబాయి, అబ్బాయి తిరిగి కలవాలని, కుటుంబంలో సమస్యలన్నీ తీరిపోవాలని పాండురంగడిని వేడుకున్నానని తెలిపారు. ఆ దేవుడు తన కోరికలు నెరవేరుస్తాడని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ప్రఫుల్ పటేల్ గడ్చిరోలిలో విలేకరులతో మాట్లాడారు. 'ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ మాకు దేవుడిలాంటివారు. మా అందరికీ తండ్రిలాంటివారు. గత నెలలో ఆయన జన్మదినం సందర్భంగా మేం ఆయన్ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాం కూడా. అయితే అది రాజకీయ భేటీ కాదు. మేం భిన్న రాజకీయ వైఖరి తీసుకున్నప్పటికీ శరద్ పవార్‌పై అత్యున్నత గౌరవం ఉంది. పవార్ కుటుంబం ఒక్కటైతే మేమంతా సంతోషిస్తాం. నన్ను నేను వారి కుటుంబ సభ్యుడిగానే భావిస్తున్నాను. ఇద్దరూ తిరిగి కలిస్తే ఎవరూ అగౌరవంగా భావించాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. 2023 జూలైలో ఎన్‌సీపీని చీల్చి అజిత్ పవార్ 40 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ-శిండే శివసేన కూటమి ప్రభుత్వంలో చేరి ఉపముఖ్యమంత్రి అయిన సంగతి తెలిసిందే. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పార్టీ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది. కానీ ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శిండే శివసేన-అజిత్ ఎన్‌సీపీతో కూడిన మహాయుతి కూటమి భారీ విజయం సాధించింది. పవార్, అజిత్ కలిసిపోతే ఎన్‌సీపీ కార్యకర్తలు ఎంతో లాభపడతారని ఎన్‌సీపీ నేత, రాష్ట్ర మంత్రి నరహరి జిర్వాల్ అన్నారు.

దీక్ష విరమణ ఇష్టం లేదా?

దల్లేవాల్‌ను ఆస్పత్రికి ఎందుకు తరలించలేదు?.. నచ్చజెప్పడంలో పంజాబ్ ప్రభుత్వం విఫలం

- సుప్రీంకోర్టు అసంతృప్తి
- చికిత్స పొందుతూ నిరసన కొనసాగించవచ్చని స్పష్టీకరణ


మోదీని కలిసిన గాయకుడు దిల్జిత్ దొసాంజ్

న్యూఢిల్లీ, జనవరి 2: నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగజీత్ సింగ్ దల్లేవాల్‌ను ఆస్పత్రికి తరలించనందుకు సుప్రీంకోర్టు గురువారం పంజాబ్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజీ పడొద్దన్నట్టుగా ప్రభుత్వ వైఖరి ఉంద ని వ్యాఖ్యానించింది. పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దల్లేవాల్ గత ఏడాది నవంబరు 26 నుంచి పంజాబ్-హరియాణా సరిహద్దులోని కౌనడీ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను మంగళవారం (డిసెంబరు 31)లోగా ఆస్పత్రికి తరలించాలని గత నెల 20న సుప్రీంకోర్టు ఆదేశించింది. అవసరమైతే శిబిరం సమీపంలో తాత్కాలిక ఆస్పత్రి ఏర్పాటు చేయవచ్చని, కావాలనుకుంటే అక్కడ దీక్ష కొనసాగించుకోవచ్చని తెలిపింది. ఈ ఆదేశాలు అమలు కాకపోవడంతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయన్‌ల ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే దీక్ష కొనసాగించుకోవచ్చన్న విషయాన్ని దల్లేవాల్‌కు అర్థమయ్యేలా నచ్చజెప్పడంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని వ్యాఖ్యానించింది. పైగా సుప్రీంకోర్టే నిరాహార దీక్ష ఆపాలని ఆదేశాలు ఇచ్చిందంటూ కొందరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రైతు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించింది. దీనిపై పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ సమాధానం ఇస్తూ చికిత్సలు చేసుకోవాల్సిందిగా దల్లేవాల్‌ను మధ్యవర్తులు నచ్చజెప్పుతున్నారని తెలిపారు. చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తేనే వైద్య సేవలు పొందుతానని దల్లేవాల్ అంటున్నారని తెలిపారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి మేం కమిటీ వేసిన విషయాన్నయినా చెప్పారా?" అని అడిగారు. ఏజీ బదులిస్తూ ఆ కమిటీ శుక్రవారం రైతులతో చర్చలు జరుపుతుందని తెలిపారు. తదుపరి విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది. కాగా, రైతుల ఆందోళనపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మీడియా ప్రశ్నించినప్పుడు.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్చలు జరుపుతామని తెలిపారు.

మోదీని కలిసిన గాయకుడు దిల్జిత్

ప్రధాని మోదీని పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాంజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మోదీ, దిల్జిత్ భేటీకి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ సందర్భంగా గాయకుడు దిల్జీత్‌పై మోదీ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. అతడు ప్రజల హృదయాలను గెలిచాడని, దిల్జిత్ అనే పేరును సార్థకం చేసుకున్నాడని ప్రశంసించారు. మరోపక్క ప్రధాని నుంచి తాను ఎంతగానో స్ఫూర్తి పొందానని గాయకుడు దిల్జిత్ కొనియాడారు. అయితే ప్రధాని మోదీతో దిల్జిత్ భేటీ కావడంపై రైతు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'బెకెమ్' మట్టి దందా!

(మొదటి పేజీ తరువాయి)

తవ్వకాలు చేసింది. లీజులు తీసుకున్నచోటే కాకుండా, అసైన్డ్ సాగు భూముల పరిధిలోనూ ఈ కంపెనీ తవ్వకాలు చేసిందని అనేక ఫిర్యాదులు వచ్చాయి. అయినా గత ప్రభుత్వంలో ఆ కంపెనీవైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మట్టి అక్రమ తవ్వకాలపై ఆధారాలతో సహా స్థానిక రైతులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో గత నవంబరు 8న ఆయన ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురంలోని మైనింగ్ ప్రాంతాలను సందర్శించారు. అక్కడ అడ్డగోలుగా జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలను చూసి విస్మయానికి గురయ్యారు. వెంటనే మైనింగ్ దందాపై విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత అక్రమాలు గుర్తించడానికి జరిగిన విచారణ అష్టవంకరలు తిరిగింది. ఎర్రమట్టి తవ్వకాల్లో అక్రమాలపై బెకెమ్ ఇన్‌ఫ్రాకు గనులశాఖ డీడీ నోటీసులు ఇచ్చారు. పర్మిట్లు దుర్వినియోగం చేశారని, పరిమితికి మించిన తవ్వకాలు చేశారన్న అభియోగాలపై సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే తాము అక్రమ మైనింగ్ చేయలేదని, లీజు ప్రాంతంలోనే తవ్వకాలు చేశానని సంస్థ బదులిచ్చింది. ఈ వాదన సంతృప్తికరంగా లేదని, అక్రమాలు జరిగాయని డీడీ నిర్ధారించారు. "20.95 ఎకరాల పరిధిలో 6,15,683 క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టిని అక్రమంగా తవ్వి తీసుకెళ్లారు. ఇందుకు రూ.34.13 కోట్ల పెనాల్టీ విధిస్తున్నాం. 1.48 ఎకరాల పరిధిలో పర్మిట్లను దుర్వినియోగం చేసి 2,470 క్యూబిక్ మీటర్ల మేర అక్రమంగా మట్టి తవ్వకాలు చేసినందుకు రూ.8.13లక్షల జరిమానా విధిస్తున్నాం. మరో 6.18ఎకరాల్లో ట్రాన్సిట్ పర్మిట్లు దుర్వినియోగం చేసి 74,875 క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి తవ్వకాలు జరిగాయి. ఇందుకు రూ.2.46 కోట్ల పెనాల్టీ విధిస్తున్నాం. మొత్తం 28.61 ఎకరాల పరిధిలో 6,93,028 క్యూబిక్ మీటర్ల మేర ఎర్రమట్టి తవ్వితీశారు. కాబట్టి మొత్తంగా రూ.36.68 కోట్ల పెనాల్టీని 15 రోజుల్లో చెల్లించాలి' అని గత నవంబరు 22న బెకెమ్ ఇన్‌ఫ్రాకు డిమాండ్ నోటీసు జారీ చేశారు.

గనుల మంత్రి వద్ద అప్పీల్

డిమాండ్ నోటీసులనూ బెకెమ్ గనుల శాఖ మంత్రి వద్ద ఉండే ప్రత్యేక అధికారాల కోర్టులో అప్పీల్ చేసింది. నోటీసు కాలపరిమితి తీరిపోయినా ఈ కేసుపై మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు ఇవ్వలేదు. కేసును కంపెనీకి అనుకూలంగానే సెటిల్ చేయాలన్న ఒత్తిళ్లు ఆయనపై చాలా బలంగా ఉన్నట్లు తెలిసింది. గత రెండు నెలలుగా మంత్రి స్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారని నిగ్గుతేల్చినా చర్యలు తీసుకోకపోవడంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంలో మంత్రి ఏ నిర్ణయం తీసుకుంటారన్న చర్చ జోరుగా సాగుతోంది.

గనుల అధికారి విన్యాసాలు

'ఐఎస్ జగన్నాథపురంలోని రెవెన్యూ సర్వే నం.425లో ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టేందుకు బెకెమ్ ఇన్‌ఫ్రా అనుమతులు తీసుకుంది. కానీ లీజు పొందిన చోట కాకుండా, అదే సర్వే నం. పరిధిలో ఉన్న మరో భూమిలో తవ్వకాలు చేపట్టింది. అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా 20.95 ఎకరాల్లో 6.15 లక్షల క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టిని తవ్వి తీసుకెళ్లింది. దీనికి ఎలాంటి అనుమతులు లేవు' అని ఏలూరు కలెక్టర్ ప్రాథమిక విచారణ నివేదికను సమర్పించారు. సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను పవన్ ఆదేశించారు. అయితే తీవ్రమైన రాజకీయ ఒత్తిళ్లు, పెద్దల సిఫారసులతో ఆయన వాస్తవాలను తొక్కిపెట్టి పరిమిత నిజాలతోనే నివేదిక ఇచ్చారు. తొలుత చిన్నచిన్న తప్పులు జరిగాయని, పెద్దగా అక్రమాలే లేవన్నట్లుగా నివేదిక ఇచ్చారని తెలిసింది. తర్వాత ఆ రిపోర్టును మరోసారి తిరగరాశారు. ఇక ముచ్చటగా మూడోసారి ఇచ్చిన నివేదికలో తప్పనిసరి పరిస్థితుల్లో కళ్లముందు కనిపించే కొన్ని నిజాలు, మైనింగ్ దోపిడీ గురించి కొన్ని అంకెలను పొందుపరిచారు. అయితే, మైనింగ్ అనుమతులు ఎక్కడ తీసుకున్నారు? ఎక్కడ తవ్వారన్న విషయంలో నిర్దిష్టమైన వివరాలు మాత్రం ఇవ్వలేదు. ఇక ఐఎస్ జగన్నాథపురంలో తవ్వకాల ప్రస్తావనే లేదు. కేవలం ఐఎస్ రాఘవాపురంలోని సర్వే నం.425 చుట్టూ నివేదికను తిప్పారు. ఇదంతా ఆ కంపెనీకి పరోక్షంగా మేలుచేసేలా ఉందన్న విమర్శలున్నాయి.

'సజ్జల' కబ్జాలో 42 కాదు.. 52 ఎకరాలు!

అమరావతి/కడప, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ గొంతు, ముక్కులాంటి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుల అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చాయి. కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ భూముల్లో ఏకంగా 52 ఎకరాలు ఆక్రమించారు. అంతేగాక పేదల చుక్కల భూములనూ కబ్జా చేసి ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రిజర్వు ఫారెస్టులో 'సజ్జల' సామ్రాజ్యం' కథనం కడప జిల్లా వైసీపీలో కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం మేరకు... సీకేదిన్నె రెవెన్యూ పొలం సర్వే నెంబరు 1629లో 11,129.33 ఎకరాల అటవీ భూముల్లో వారు ఆక్రమించింది 42.20 ఎకరాలు కాదని, 52.20 ఎకరాలని తెలుస్తోంది. సజ్జల సోదరుడి కుమారుడి పేరుతో కడప నగర శివారులో కడప-కర్నూలు జాతీయ రహదారికి ఆనుకుని పట్టా భూములు ఉన్నాయి. వీటిలో కొన్ని డీకేటీ భూములు, ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఇడుపులపాయలో జగన్ కుటుంబానికి ఉన్న ఎస్టేట్ మాదిరిగానే ఇక్కడ కూడా తయారు చేశారని చెబుతున్నారు. ఎస్టేట్ ప్రధాన గేట్ ఎదురుగా సర్వే నెంబర్ 1612లో 5.18 ఎకరాల చుక్కల భూమి ఉంది. ఇందులో రాజానాయక్ భార్య బుక్కేదేవి పేరిట 34 సెంట్లు, బుక్కే ముత్యాలమ్మ పేరిట 1.30 ఎకరాలను 1993లో ప్రభుత్వం ఇచ్చింది. రాజానాయక్ భూములను కబ్జా చేసి సజ్జల ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తే... 'ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ బెదిరించారు. రాజానాయక్ ఇటీవల సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం సంచలనం రేపింది. పలువురు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేయాల్సి ఉంది. కేంద్రమంత్రి జితేంద్రసింగ్ కడప కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష, సీకేదిన్నె మండలంలో పర్యటన ఉండడంతో జిల్లా యంత్రాంగం అంతా ఆయన వెంటే ఉన్నారు. సీకేదిన్నె మండలంలో మంత్రి పర్యటన ముగిశాక రెవెన్యూ, అటవీ అధికారులు వెళ్లి సర్వే చేపట్టారు. మీడియా ప్రతినిధులు అక్కడకు వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడి సిబ్బంది గేట్లు వేసి అడ్డుకున్నారు.

విచారణకు పవన్ ఆదేశం

కడప జిల్లా సీకే దిన్నె మండల పరిధిలో సజ్జల కుటుంబం ఆక్రమణలో రిజర్వ్ ఫారెస్ట్ భూములు ఉన్నాయని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, అటవీశాఖ అధికారులను ఆదేశించారుఏ మేరకు అటవీ భూములు అన్యాక్రాంతమయ్యాయి? ఎవరు స్వాధీనం చేసుకున్నారు? అక్కడ వన్యప్రాణులకు హాని కలిగిందా? వంటి వివరాలతో నివేదిక ఇవ్వాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు. అటవీ భూముల అన్యాక్రాంతంపై విచారణ చేయాలని కడప జిల్లా కలెక్టర్‌కు దిశానిర్దేశం చేశారు.



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ఉప ముఖ్యమంత్రితో

నూతన సీఎస్ భేటీ

- విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన పవన్

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో మంత్రివర్గ సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. నూతన సీఎస్ కె.విజయానంద్ కూడా మంత్రివర్గ సమావేశం ముగించుకుని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయానంద్‌కు పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రాభివృద్ధి, విద్యుత్ సంస్కరణలు వంటి అంశాలపై కాసేపు ముచ్చటించారు. అనంతరం మాజీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ కూడా డిప్యూటీ సీఎంను కలిశారు.

‘అనంత’లో దివాకర్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

- షార్ట్ సర్క్యూట్ అంటున్న పోలీసులు
- బీజేపీ ప్రభుత్వమే తగులబెట్టించింది: జేసీ ప్రభాకర్ రెడ్డి
- సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్



అనంతపురంలో దగ్ధమవుతున్న దివాకర్ ట్రావెల్స్ బస్సు

అనంతపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జేసీ ట్రావెల్స్ కార్యాలయం వద్ద పార్కింగ్ చేసిన బస్సుల్లో ఒకటి గురువారం తెల్లవారుజామున దగ్ధమైంది. మరొకటి పాక్షికంగా కాలిపోయింది. పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడటంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఆ శాఖ అధికారులు, సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఒక బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమీపంలో ఉన్న మరికొన్ని బస్సులకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారు. ఈ ప్రమాదంలో రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆర్ఎఫ్ఓ భూపాల్‌రెడ్డి తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో ఆకతాయిలు రాత్రిళ్లు మద్యం సేవిస్తుంటారని, తాగి పడేసిన బీడీలు, సిగరెట్ల కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని కూడా భావిస్తున్నారు. త్రీటౌన్ ఎస్ఐ గోపాలుడు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కాగా.. అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి బస్సు దగ్ధం ఘటనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ‘జగనే మేలు.. నా బస్సులను నిలబెట్టించాడు. ఈ బీజేపీ ప్రభుత్వం ఏకంగా బస్సులను తగలబెట్టించింది. మా బస్సులు కాలిపోయినా మాకు కేసు వద్దు. ఏం సుమోటో కేసు పెట్టుకోలేరా..? పెట్టకూడదా..?’ అని పోలీసులను ప్రశ్నించారు.

రజకుల అభివృద్ధి సీఎం లక్ష్యం

- జగన్ హయాంలో ఉద్యోగులకు వేధింపులు: మంత్రి సవిత

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి గురువారం సచివాలయంలో మంత్రి సవితను మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... టీడీపీతోనే రజకులకు మేలు జరుగుతోందన్నారు. సీఎం చంద్రబాబు రజకుల ఉన్నతికి పలు పథకాలు అమలు చేశారని, స్వయం ఉపాధి కోసం ఆదరణ పేరుతో అవసరమైన పనిముట్లు అందజేశారని చెప్పారు. జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం అన్ని కులాల మాదిరిగానే రజకులకూ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మరోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రజకులకు మంచి రోజులొచ్చాయన్నారు. చంద్రబాబు అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రజక కార్పొరేషన్‌కు మంత్రి దిశా నిర్దేశం చేశారు. కాగా, నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ఉద్యోగ సంఘ నేతలు మంత్రి సవితను కలిశారు. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులు తీవ్ర వేధింపులకు గురయ్యారని, ఇలాంటి నేపథ్యంలో కూటమికి ఉద్యోగులు అండగా నిలిచారని మంత్రి చెప్పారు.

రజక కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సావిత్రి



రజక సంక్షేమ, అభివృద్ధి డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న చైర్‌పర్సన్ సావిత్రి, వేదికపై ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు

విజయవాడ(వన్‌టౌన్), జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రజకులకు అన్నివిధాలుగా అండగా ఉంటూ అభివృద్ధి బాటలో పయనించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.సావిత్రి అన్నారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమెతో పాటు డైరెక్టర్లు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు రజకులకు చేరేలా కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, గత ప్రభుత్వం కార్పొరేషన్‌లకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందన్నారు.

ఇది కదా... నూతన సంవత్సర కానుక!

- 25ఏళ్ల క్రితం తప్పిపోయి కుటుంబానికి చేరువైన పెద్దిరాజు
- వివరాలు సేకరించి అప్పగించిన చెన్నై ఉడవుం కరంగల్ స్వచ్ఛంద సంస్థ



పెద్దిరాజును అతని కుమారులకు అప్పగిస్తున్న విద్యాకర్

యలమంచిలి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తం నూతన సంవత్సర వేడుకలు జరుపుకొంటున్న వేళ, రోడ్డు పక్కన నివసించే వారిని సంతోషంగా ఉంచేందుకు తమిళనాడుకు చెందిన ఉడవుం కరంగల్ సామాజిక కార్యకర్తలు చెన్నై నగరంలో స్వీట్లు, ఆహార ప్యాకెట్లను అందజేస్తున్నారు. ఈ క్రమంలో సామాజిక కార్యకర్తలు జాకబ్, షావనాజ్ చెన్నై రెడ్‌హిల్స్ రోడ్‌లో చినిగిన దుస్తులు ధరించి ఆకలితో ఉన్న ఒక వృద్ధుడిని చూశారు. అతని వద్దకు వెళ్లి బన, ఆహారం అందిస్తాం, ఉడవుం కరంగల్‌కు వస్తావా అని అడగ్గా అతను అంగీకరించడంతో తిరువెర్కాడులోని శాంతి వనానికి తీసుకువెళ్లారు. వృద్ధుడికి స్నానం చేయించి వస్త్రాలు ఇచ్చి, భోజనం అందించారు. ఉడవుం కరంగల్ సామాజిక కార్యకర్త శ్రీనివాసరావు వృద్ధుడికి కౌన్సెలింగ్ చేసి కుటుంబ వివరాలు సేకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి సమీపంలోని యలమంచిలిలంక గ్రామానికి చెందినవాడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 2వ తేదీన ఉడవుం కరంగల్ వ్యవస్థాపకుడు విద్యాకర్ పెద్దిరాజును అతని ఇద్దరు కుమారులు గంగాసురేష్, రమేష్‌బాబుకు అప్పగించారు.

మెట్రో సాకారం దిశగా అడుగులు

- 2 వేల కోట్లతో రోడ్డు కమ్ మెట్రో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు
- తొలి విడతలో విజయవాడలో 4.7 కి.మీ.. విశాఖలో 4 కి.మీ.
- విశాఖ, విజయవాడ మెట్రోలకు కేంద్రం సాయం!
- కోల్‌కతా తరహాలో ఏపీలోనూ చేపట్టేలా చర్చిద్దాం
- నాలుగేళ్లలో సేవలు అందుబాటులోకి వచ్చేలా లక్ష్యం
- మెట్రో రైలుపై సమీక్షలో సీఎం చంద్రబాబు



విజయవాడ, విశాఖపట్నం మెట్రో ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి నారాయణ

అమరావతి, విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టుల్లో రూ.2 వేల కోట్ల వ్యయంతో రోడ్డు కమ్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. విజయవాడలో 66 కి.మీ మేర, విశాఖపట్నంలో 76.90 కి.మీ మేర చేపట్టబోయే మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు ఆమోదించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల అంశంపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ స్థితిగతులను వివరించారు. 2017లో వచ్చిన కొత్త మెట్రో పాలసీ ప్రకారం రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టులకు ఫండింగ్ అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. 2017 వరకు నూరు శాతం నిధులు కేంద్రం భరించే విధానం లేదు. అయితే 2017 పాలసీ ప్రకారం వంద శాతం ఈక్విటీ కేంద్రమే చెల్లిస్తూ కోల్‌కతాలో రూ.8,565 కోట్లతో 16 కి.మీ మేర మెట్రో ప్రాజెక్టు చేపట్టింది. ఈ తరహాలో ఏపీలో కూడా మెట్రో ప్రాజెక్టులు చేపట్టే అంశంపై కేంద్రంతో చర్చించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఏపీ పునర్విభజన చట్టంలో కూడా రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు ఉందని అన్నారు. ఈ చట్ట ప్రకారం.. లేదంటే 2017 మెట్రో పాలసీ ద్వారానైనా కేంద్రం సాయం చేయాలన్నారు. ఈ రెండింటిలో ఏదో ఒకదాని ప్రకారం పూర్తి ఖర్చు కేంద్రం భరించేలా సంప్రదింపులు జరుపుతామని చెప్పారు.

రెండు చోట్ల డబుల్ డెక్కర్...

మెట్రో ప్రాజెక్టులో భాగంగా విజయవాడలో ఎన్‌హెచ్-16పై నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు 4.7 కి.మీ., విశాఖపట్నంలో గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు 4 కి.మీ. మేర రోడ్డు కమ్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ విధానంలో రోడ్డు ఫ్లైఓవర్ మీద మెట్రో ఎలివేటెడ్ కారిడార్ ఉంటుంది. ఈ రెండింటినీ కలిపి డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ అంటారు. ఎన్‌హెచ్-16పై నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు 7 కి.మీ. ఆరు వరసల ఫ్లైఓవర్ మంజూరైంది. ఈ మార్గంలో మొదటి మెట్రో కారిడార్ గన్నవరం బస్‌స్టేషన్ నుంచి రామవరప్పాడు రింగ్ మీదుగా ఏలూరు రోడ్డు నుంచి రైల్వేస్టేషన్, పీఎన్‌బీఎస్ వరకు వెళుతుంది. ఈ మార్గంలో నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 4.7 కి.మీ. మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.1100 కోట్ల మేర ఖర్చవుతుందని ఇటీవల మెట్రో అధికారులు అంచనాలు రూపొందించారు. అదే విధంగా గాజువాక నుంచి స్టీల్ ప్లాంట్ వరకు కూడా ఇదే విధంగా రూ.900 కోట్లు వ్యయం అవుతుందని నిర్ణయించారు. ఇప్పటికే ఈ తరహా మోడళ్లు పలు నగరాల్లో అందుబాటులో ఉన్నాయి. కేంద్రంతో త్వరితగతిన చర్చించి మెట్రో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. నాలుగేళ్లలో రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలో అపశ్రుతి

- పరుగు పందెంలో యువకుడు మృతి



ధరావత్ చంద్రశేఖర్

మచిలీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలో అపశ్రుతి చోటుచేసుకుంది. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం పరుగుపందెంలో పాల్గొన్న యువకుడు పరిగెడుతూనే కుప్పకూలిపోయాడు. పోలీసుల కథనం మేరకు.. మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఫిజికల్ ఎఫిసియెన్సీ టెస్ట్(పీఈటీ)లో భాగంగా 1600 మీటర్ల పరుగు పోటీలు గురువారం ఉదయం 8.15 గంటలకు ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు గ్రామానికి చెందిన ధరావత్ చంద్రశేఖరరావు(25) ఇందులో పాల్గొన్నాడు. నాలుగో రౌండ్ పూర్తికావడానికి 70 మీటర్ల దూరంలో ఉండగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న వైద్యసిబ్బంది అతన్ని హుటాహుటిన అంబులెన్స్‌లో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్డియాక్ అరెస్ట్ కారణంగా చంద్రశేఖరరావు మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చంద్రశేఖరరావు డబ్ల్యూబీసీ కౌంట్ 30వేలకు చేరిందని, దీంతోపాటు గత ఐదు రోజులుగా అతను తీవ్రజ్వరంతో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలలో పాల్గొనే అభ్యర్థుల్లో ఆరోగ్యం బాగోలేని వారికి ఈ నెల 20వ తేదీన పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

ముండ్లమూరులో మళ్లీ భూప్రకంపనలు

ముండ్లమూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో గురువారం మధ్యాహ్నం 1:43 సమయంలో సెకన్ పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరు, సింగనపాలెం, వేంపాడు, నాయుడుపాలెం, తమ్మలూరు గ్రామాల్లో భూమి కంపించింది. గత నెలలోనూ నాలుగుసార్లు భూమి కంపించింది.

టీడీపీకి ఓటేశారని వెలేశారు

- ఉప్పుమిల్లిలో వైసీపీ పెద్దల అరాజకీయం
- బహిష్కరణపై కలెక్టర్‌కు బాధితుని ఫిర్యాదు
- ఇరుపక్షాలతో అధికారుల చర్చలు.. కుదిరిన సయోధ్య..!



కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో ఇరువర్గాలతో చర్చలు జరుపుతున్న అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 2(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ఎవరికి వేయాలో కుల పెద్దలు నిర్ణయించారు. వారి నిర్ణయానికి వ్యతిరేకంగా తమ అభీష్టానికి అనుగుణంగా, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించిన ఏడు కుటుంబాలపై గ్రామ పెద్దలు కన్నెర్ర చేశారు. అంతే వారిని వెలివేస్తూ గ్రామ పెద్దలు తీర్మానించారు. సభ్య సమాజం నివ్వెరబోయే ఈ ఘటన కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఉప్పుమిల్లిలో ఏడు కుటుంబాలు తెలుగుదేశం పార్టీకి ఓటు వేశాయి. అలా వేయడాన్ని గ్రామ, కుల పెద్దలుగా వ్యవహరిస్తున్న వైసీపీకి చెందిన వారు తీవ్రంగా పరిగణించారు. అదే సమయంలో ధాన్యం పాట సొమ్ములు వద్ద ఇరు పక్షాల మధ్య వివాదం తలెత్తింది. అది పెద్దదిగా మారింది. అంతే వెలి తీర్మానం జరిగిపోయింది. వెలివేసిన కుటుంబంలోని వారితో ఎవరైనా మాట్లాడితే రూ.5,000 జరిమానా చెల్లించాలని తీర్మానించారు. అలాగే వివాహాది శుభ కార్యక్రమాలకు పిలవకూడదని, పనులకు పిలవకూడదని కట్టడి చేశారు. విషయంపై బాధితుడు తుట్టా దుర్గాప్రసాద్ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కాజులూరు తహసీల్దారు శివకుమార్, గొల్లపాలెం ఎస్ఐ మోహన్ కుమార్ గురువారం ఉప్పుమిల్లి గ్రామానికి వెళ్లారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సమక్షంలో ఇరువర్గాలతో చర్చించారు. తహసీల్దారు శివకుమార్ మాట్లాడుతూ, ‘వెలి చట్ట వ్యతిరేకం. సభ్య సమాజంలో ఉంటూ ఇతరులను వెలి వేసే హక్కు ఎవరికీ లేదు. కాదని ఎవరైనా గ్రామంలో వెలివేసి వివక్ష చూపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం’ అని హెచ్చరించారు. గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ, ‘గ్రామంలో ఏడు కుటుంబాలను ఎలాంటి శుభ కార్యక్రమాలకు పిలవకుండా వెలివేసే అధికారం ఎవ్వరికీ లేదు. ఇది చట్టరీత్యా నేరం. ఏదైనా సమస్య ఉంటే అందరూ కూర్చుని మాట్లాడుకోవాలి. అంతేగానీ వివక్ష చూపే అధికారం లేదు’ అని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామంలో శాంతి కమిటీ ఏర్పాటు చేసి ఇరువర్గాలతో చర్చించి సయోధ్య కుదిర్చామని ఎస్ఐ తెలిపారు. భవిష్యత్తులో ఈ గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. వెలికి గురైన ఏడు కుటుంబాలు గ్రామంలో ధైర్యంగా బతికేలా రక్షణ కల్పిస్తామన్నారు. ఇక మీదట గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు జరగకుండా చూసుకుంటామని సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు హామీ ఇచ్చారన్నారు.

ఎస్సీ ఉపకులాల ఆర్థిక స్థితిగతులపై..

ప్రభుత్వం వద్ద వివరాల్లేవని మీరెలా చెబుతారు?

- అపరిపక్వ దశలో కోర్టును ఆశ్రయించారు
- వేటి ఆధారంగా కమిషన్ నివేదిక ఇస్తుందో ముందే నిర్ణయానికి రావడం సరికాదు
- పిటిషనర్‌నుద్దేశించి హైకోర్టు స్పష్టీకరణ
- పూర్తి వివరాలు తమ ముందుంచాలని ప్రభుత్వానికి ఆదేశం
- విచారణ 8వ తేదీకి వాయిదా

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనానికి విధివిధానాలు ఖరారు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యం విషయంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని హైకోర్టు సర్కారును ఆదేశించింది. ఉపకులాల స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు ఏకసభ్య కమిషన్ ఏ వివరాలు పరిగణనలోకి తీసుకుంటుందో ఇప్పుడే ఓ నిర్ణయానికి రావడం సరికాదని పిటిషనర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. కమిషన్ ఉపకులాల స్థితిగతులపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక అందజేయకుంటే అప్పుడు కోర్టును ఆశ్రయించాలని, అపరిపక్వ దశలోనే పిటిషన్ వేశారని ఆక్షేపించింది. ఉపకులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం వద్ద వివరాలు లేవని పిటిషనర్ ఎలా చెబుతారని ప్రశ్నించింది. సాంఘిక సంక్షేమశాఖ జారీ చేసిన ఉత్తర్వులపై పూర్తి వివరాలను తన ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను 8వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అధ్యయనానికి విధివిధానాలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 20న జారీ చేసిన జీవో 91ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన పరసా సురేశ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విచారణకు రాగా ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. ఏకసభ్య కమిషన్ నియామకాన్ని సవాల్ చేస్తూ ఇప్పటికే వ్యాజ్యాలు దాఖలయ్యాయన్నారు. ప్రస్తుత పిటిషన్ కూడా ఇదే వ్యవహారంతో ముడిపడి ఉందని.. మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఏకసభ్య కమిషన్ నియామకాన్ని తాము సవాల్ చేయడం లేదన్నారు. ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఇప్పటివరకు సమగ్ర అధ్యయనం జరగలేదని, ప్రభుత్వం వద్ద ఎలాంటి వివరాలూ లేవని తెలిపారు. ఉపకులాల స్థితిగతులపై అధ్యయనం జరిపిన తర్వాతే వర్గీకరణ విషయంలో ముందుకెళ్లాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా 2024లో కులాల సమాచారం సేకరించారని, అందులో ఉపకులాల సమాచారం లేదని తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా సేకరించిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని జీవో 91లో పేర్కొన్నారని, వారి ద్వారా సేకరించిన సమాచారం చెల్లుబాటు కాదన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. ప్రభుత్వం వద్ద వివరాలు లేవని మీరెలా చెబుతారని ప్రశ్నించారు. అపరిపక్వ దశలో పిటిషన్ దాఖలు చేశారని.. ఏకసభ్య కమిషన్ ఉపకులాల స్థితిగతులపై సమగ్రంగా అధ్యయనం చేయకుంటే కోర్టును ఆశ్రయించాలని, కమిషన్ ఏ వివరాలు పరిగణనలోకి తీసుకుంటుందో ఇప్పుడే ఓ నిర్ణయానికి రావడం సరికాదని పేర్కొన్నారు.

ఉచితంగా వద్దు!

- టీటీడీ డైరీలు, క్యాలెండర్లను తిరస్కరించిన చైర్మన్

తిరుమల, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏటా టీటీడీ గౌరవప్రదంగా అందజేసే నూతన ఏడాది డైరీ, క్యాలెండర్లను ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు సున్నితంగా తిరస్కరించారు. సాధారణంగా చైర్మన్‌కు టీటీడీ ఉచితంగా 75 డైరీలు, 75 క్యాలెండర్లు ఇస్తుంది. వీటిని తిరస్కరించిన ఆయన కొన్ని డైరీలను, క్యాలెండర్లను సొంత నగదుతోనే కొనుగోలు చేసి సన్నిహితులకు అందజేశారు.

మేయర్ సీటు వదులుకోలేను: గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మేయర్‌గా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేయర్ సీటును వదులుకునే పరిస్థితి లేదన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No.: 45/2024-25/SE (W-V)/EE-VIII/DB/GVMC, Dt: 02.01.2025
Number of Works : 01, Value of Works : Rs.102.12 Crores
Tender Opening Dt: 02.01.2025, Closing Date : 17.01.2025
Note : Further details at http://www.tender.apeprocurement.gov.in O/o the EE - VIII Cell No.: 9966333342.
Note : For any other details required in respect of above Tender Notice, Please contact E.E - VIII.
For Commissioner

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని @SCRailwayindia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.

ఇ-వేలం ప్రకటన నం BZA-16-2024-25
తేది: 02.01.2025

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు విజయవాడ డివిజన్‌లో ఇతర ఎన్ఎఫ్ఆర్ & పార్కింగ్ కాంట్రాక్టులు అందజేయుటకు IREPS ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ www.ireps.gov.in ద్వారా ఇ-వేలం కొరకు పద్దెనిమిది సంవత్సరాలు వయస్సు పైబడిన భారతీయులు మరియు కంపెనీలు/సంస్థలను ఆహ్వానిస్తున్నారు. ఇ-వేలం షెడ్యూలు దిగువ వివరించబడినది:

కాంట్రాక్టు రకం	వేలంలో ఆఫర్ చేయబడుతున్న లాట్ల సంఖ్య	వేలం షెడ్యూలు తేది మరియు తెరచు సమయం
ఇతర NFR	భీమవరం టౌన్, భీమవరం, పాలకొల్లు, నర్సాపూర్ ఆకువీడు, తణుకు, గుడివాడ, మచిలీపట్నం, కైకలూరు, పెడన, కాల్దారి, అత్తిలి, అరవెల్లి, పెనాడ అగ్రహారం, వీరవాసరం, రామవరప్పాడు, మందపలి, గుణదల్లేరు & చిలకలపూడి రైల్వే స్టేషన్ల వద్ద ప్యాకేజ్ G క్రింద బ్రాంచ్ లైన్ సెక్షన్‌లో స్టేషన్ ఆవరణ లోపల కేటాయించబడినట్టి ఏరియాలు/ప్రదేశాల వద్ద ప్రకటనల (నాన్ డిజిటల్) ప్రదర్శన కొరకు ప్రకటన హక్కులు.	13.01.2025న 11.00 గం.లకు.
	ప్యాకేజ్ H క్రింద విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైల్వే స్టేషన్ భవనానికి లోపల కేటాయించబడినట్టి లొకేషన్లు /ఏరియాల వద్ద ప్రకటనల (రైల్ డిస్‌ప్లే నెట్‌వర్క్) ప్రదర్శన కొరకు ప్రకటన హక్కులు.	

పైన తెలిపిన ఇ-వేలం తేదీలపై టైమ్ స్లాట్లు IREPS అప్లికేషన్ ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ (www.ireps.gov.in)లో లభించును. ఆ ప్రకారంగా వేలంలో పాల్గొనవలసిందిగా గమనించగలరు.

A0010 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

NOTICE

TDR Scrutiny Committee meeting have been convened headed by Commissioner, Vijayawada Municipal Corporation in chamber of Commissioner the Following application are placed before the committee.

Municipal Corporation, Vijayawada
Agenda for the TDR Scrutiny Committee Meeting scheduled on 31-12-2024

Sl No	Name of the site owner	Extent (in Sq. Yds)	Location	RDP Number	Document No
Circle - 2					
1	1) Smt. Ambati Mridula W/o. Krishnasetty Varun Teja 2) Smt. Ambati Aishwarya, W/o. Mantri Ayyappa	123.00	RS No : 4/2, Nandamuri Nagar, Muthyalampadu, Andhraprabha Colony Road, Vijayawada.	---	Doc No. 14510 /2024, Dt. 3-5-24 Link Doc No. 1523/2005, Dt : 15-2-2005
2	1) Sri Ponnam Venkata Satyanarayana Prasad & 2) Sri Ponnam Sriram prasad S/o. (Late) Veera Raghavaiah	80.10	Ward No.9, Block No. 29, NTR Nos. 1959 & 1962, Dornakal Road, Vijayawada.	11/2024/ Circle-2/VIJ	Doc No. 2774 /2013, Dt.30-3-13 Link Doc Nos. 681/2005, Dt : 25-2-2005 880/1997, Dt. 29-3-1997 & 3623/1940, Dt. 12-12-1940
3	Smt. Kamala Bai Patel W/o. Kanti Lal Patel Divani	60.00	Ward No.14, Block No. 43, NTS No : 43 Karl Marx (Eluru Road) Seetharampuram Vijayawada	No. 01/2002 V.G.T.M. UDA, File No. C2/ 1721/2001.	Doc No. 792/1986 Dt.14-8-1986 & Doc No. 793/ 1986, Dt. 14-8-1986 Link : 9342/1982 Dt. 19-8-1982 & Link : 9385/ 1982 Dt : 21-8-1982

Hence any Suggestions / Objections for the issue of TDR Bonds for the above said Applications to this office i.e. Circle - II, VMC main office within 15 days if not received further action will be continued for the issue of TDR Bonds.

Sd/- FOR COMMISSIONER

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'బ్రహ్మ' ప్రళయం..!

ఏ సమెత్తు ప్రమాదం లేదని చైనా దబాయిస్తోంది కానీ, టిబెట్‌లోని యార్లుంగ్ జాంగ్‌బో (బ్రహ్మపుత్ర)నదిమీద అది నిర్మించబోయే భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు మన పర్యావరణాన్ని, నీటినీ, ఇంధన అవసరాలను తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయం. దిగువ పరీవాహక దేశాలైన భారత్‌తో పాటు బంగ్లాదేశ్‌ను కూడా అమితంగా నష్టపరిచే నిర్మాణం ఇది. డ్యామ్ నిర్మాణానికి చైనా 137 బిలియన్ డాలర్లు ఖర్చుచేయబోతోంది. బ్రహ్మపుత్ర నది అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే చోట ఈ ప్రాజెక్టు నిర్మిస్తారని, హిమాలయాల్లోని ఒక భారీ అగాధాన్ని చైనా ఇందుకు ఎంచుకుందని వార్తలు వస్తున్నాయి. త్రీ గోర్జెస్ డ్యామ్‌ను కూడా వెలవెలబోయేట్టు చేసే ఈ ప్రాజెక్టు సాయంతో జలప్రవాహాన్ని చైనా నియంత్రించడమే కాదు, భారీస్థాయిలో వరదనీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం కూడా సృష్టించగలుగుతుందని కొందరి వాదన.

ఈ ప్రాజెక్టు భారత్–చైనా సరిహద్దుకు ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉంది. బ్రహ్మపుత్ర నీటి ప్రవాహం చైనా నియంత్రణలోకిపోతుంది కనుక, ఎండాకాలంలో ప్రధానంగా అసోం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి రావచ్చు. వర్షాకాలంలో పూర్తిభిన్నమైన స్థితి. బ్రహ్మపుత్రకు భారీ వరదలు వస్తాయి కనుక, ఒక్కసారిగా నీరు విడుదలైతే దిగువ ప్రాంతాలు మునిగిపోతాయి. చైనాతో గతంలో ఉన్న ఆ కాస్త సయోధ్య కూడా ఇటీవలి కాలంలో అడుగంటిపోయింది. అమెరికాతో మన ఆత్మీయత ఆలింగనాల స్థాయికి చేరిపోవడంతో, ఒక్క బుల్లెట్ కూడా పేలని సరిహద్దు కాస్తా కుమ్ములాటలకూ, ఉద్రిక్తతలకు నిలయమైంది. దశాబ్దాలుగా రెండుదేశాల సరిహద్దుల్లోనూ నెలకొని ఉన్న శాంతి నశించి, పరస్పర అపనమ్మకంతో మెలగవలసిన దుస్థితి ఏర్పడింది. సరిహద్దుల్లో ప్రస్తుతానికి ఉభయ దేశాల బలగాలూ వెనకడుగువేసి ఉండవచ్చు. కానీ, అమెరికా పక్షాన చైనాను హద్దుల్లో ఉంచే బాధ్యత మనం నిర్వర్తిస్తున్నంతకాలం ఆ వేడి కొనసాగుతూనే ఉంటుంది. బ్రహ్మపుత్ర జలాలపై 2002లో తొలిసారిగా ఇరుదేశాల మధ్యా అవగాహన కుదిరింది. ఆ తరువాత మూడుసార్లు అప్పటిపరిస్థితులకు అనుగుణంగా మార్పుచేర్పులు జరిగాయి. చివరి ఒప్పందం 2023లో ముగిసిందనీ, ఆ తరువాత ఆ ఊసే లేకపోయిందని అంటారు. ప్రాజెక్టు నిర్మాణానికి మన అభిప్రాయాన్ని కూడా తీసుకొనేంత సయోధ్య రెండుదేశాల మధ్యా ఎలాగూ లేదు.

ఈ జలవిద్యుత్ ప్రాజెక్టు అరుణాచల్‌ప్రదేశ్‌కు 22కిలోమీటర్ల దూరంలో ఉన్నందున రక్షణపరంగా మనకు పక్కలో బల్లెమే. డ్యామ్ నిర్మాణంలో భాగంగా జరిగే పర్యావరణ విధ్వంసం, భూకంపాలకు అధిక అవకాశం ఉన్న ప్రాంతంలో దీనిని నిర్మించబోవడం ఆందోళన కలిగిస్తున్న అంశాలు. నీటి సహజ ప్రవాహ వేగంలోనూ, దిశలోనూ మార్పుచేర్పులు జరగడం అత్యంత అరుదైన జీవజాలాన్ని ప్రభావితం చేస్తుంది. బ్రహ్మపుత్ర ఆధారంగా భారత్, బంగ్లాదేశ్‌లో సాగే వ్యవసాయం కూడా ప్రభావితం అవుతుంది. తాగునీటి సమస్య కూడా తలెత్తవచ్చును. అరుణాచల్ ప్రదేశ్‌లో తలపెట్టిన జలవిద్యుత్ ప్రాజెక్టులను కూడా పునరాలోచించుకోవాల్సి వస్తుంది.

ఈ భారీప్రాజెక్టుతో దిగువ ప్రాంతాలకు ఎలాంటి సమస్యలు రానివ్వబోనని, అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తానని చైనా హామీ ఇస్తోంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో కూడా మనకు నదీజలాల వివాదాలున్నాయి కానీ, నిర్దిష్టమైన ఒప్పందాలు, కార్యాచరణ విధానాలు కూడా ఉన్నందున సమస్య ఉత్పన్నమైనప్పుడు పరిష్కరించుకోగలిగే అవకాశాలు అధికం. కానీ, చైనాతో బ్రహ్మపుత్ర విషయంలో మనకు ఉన్నది ఐదేళ్ళకోమారు సవరించుకోగలిగే ఎంవోయూ మాత్రమే. చైనా దీనిని కాదుపొమ్మంటే మనం చేయగలిగేది కూడా ఉండదు. ఈ ప్రాజెక్టు విషయంలో చైనా వెనకడుగువేసే అవకాశాలు లేవు కనుక, దానికి మనం సంసిద్ధం కావడం ఉత్తమం. అధికసంఖ్యలో టెలీమెట్రీ స్టేషన్లను నెలకొల్పుకొని బ్రహ్మపుత్ర నీటి స్థితిగతులను నిత్యం గమనించుకోవచ్చు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి పరిస్థితులు మారిపోవచ్చును కనుక, ప్రస్తుతానికి ఉభయదేశాల మధ్యా ఉన్న ఆ కాస్తంత సయోధ్యను ఉపయోగించుకొని ఇప్పుడే కొన్ని అవగాహనలకు, ఒప్పందాలకు మార్గం సుగమం చేసుకోవడం ఉత్తమం. భారతదేశం మీద కత్తికట్టినట్టుగా వ్యవహరిస్తున్న బంగ్లాదేశ్ తనకు ఈ చైనా ప్రాజెక్టువల్ల అధిక ప్రమాదం ఉన్నదని గ్రహించి మనతో కలిసిరావాలి.

ప్రగతికీ జమిలికీ కుదరని బంధం!



ప్రయోజనాలను ఆశించని ఆదర్శాలను ఊహించలేం. రాజకీయాల్లో ఇది మరింత నిజం. ఆదర్శాల కోసమే రాజకీయాలు నడుపుతున్నామని చెప్పే వారి మాటలను పట్టిపట్టి చూడకపోతే అసలు సంగతులు అర్థంకావు. ప్రయోజనం ఆశించినంత మాత్రాన అన్ని ఆదర్శాలకూ స్వలాభమే పరమార్థమనీ చెప్పలేం! ప్రతి ఆదర్శం వెనకనున్న ప్రయోజనాన్ని నిర్దిష్టంగా చూస్తేనే దాని అసలు స్వభావం బయటపడుతుంది. అందుకే ఫలానా ఆదర్శం ఎవరికోసం? సమాజాన్ని అది ముందుకు నడిపిస్తుందా? వెనక్కి నడిపిస్తుందా? ప్రజల హక్కులను బలోపేతం చేస్తుందా? బలహీనం చేస్తుందా? అన్న ప్రశ్నలే ఏ ఆదర్శం విశ్లేషణలోనైనా కీలకపాత్రను పోషిస్తాయి. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయనున్న జమిలి ఎన్నికల ఆదర్శాన్ని ఈ కోణం నుంచి చూస్తే మంచీచెడూ అర్థమవుతుంది. ప్రతిపార్టీకి రాజకీయ ప్రయోజనాలు ఉంటాయి. కానీ ఏ భారీ సంస్కరణనూ ఆ దృష్టితో ప్రతిపాదిస్తున్నట్లు చెప్పదు. దేశ ప్రయోజనం కోసమే దాన్ని తెస్తున్నట్లుగా ప్రజల ముందుకు తెస్తుంది. జమిలి ఎన్నికలనూ అలాగే ప్రచారంలో పెట్టారు.

ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించటం వల్ల స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) 1.5 శాతం పెరుగుతుందనీ దీంతో ప్రజల జీవనప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయనీ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్వర్యంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ తేల్చిచెప్పింది. జమిలి ఎన్నికలను ఎక్కువమంది ప్రజలు కోరుకున్నారని కూడా కోవింద్ కమిటీ తెలిపింది. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ (ద్రవ్యోల్బణాన్ని మినహాయించకుండా చూస్తే) 370 లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఇందులో 1.5 శాతమంటే రూ.5.5 లక్షల కోట్లు. అంటే ఇంత మొత్తం మన జీడీపీకి అదనంగా తోడవుతుందన్నమాట! కోవింద్ కమిటీ తీసుకున్న జీడీపీ అంచనాలు కాస్త పాతవి. వాటి ప్రకారం జమిలి ఎన్నికలతో రూ.4.5 లక్షల కోట్లు అదనంగా జీడీపీకి తోడవుతాయి. అదనంగా పెరిగే 1.5 శాతం జీడీపీ అయిదు సంవత్సరాల కాలంలో మొత్తంగా పెరిగేదా? లేక ఎన్నికలు ఏటా ఎక్కడో ఒకచోట జరుగుతాయి కాబట్టి అది వార్షిక అదనపు వృద్ధిరేటా? అన్నదానిపై స్పష్టత లేదు. మన ఆర్థికాభివృద్ధిని తొలి ఎన్నికల (1952) నాటి నుంచి విశ్లేషించి చేసిన నిర్ధారణగా దాన్ని చెప్పలేం. జమిలికి సమర్థన కోసం వేసిన అంచనాగా మాత్రమే దాన్ని భావించగలం! జమిలి ప్రక్రియ 2029లో మొదలైతే ఆనాటికి జీడీపీ మరింత పెరుగుతుంది. రూ.700 లక్షల కోట్లకు అది చేరుకునే అవకాశం ఉంది. అంటే జమిలి వల్ల రూ.10 లక్షల కోట్లు అదనపు ప్రయోజనం కలుగుతుంది! అంకెల పరంగా గొప్పగానే ఉంది. ఇక ఆర్థికాభివృద్ధితో పాటు ద్రవ్యోల్బణం తగ్గుదల, పెట్టుబడుల పెంపు, వ్యయంలో గుణాత్మక మార్పు లాంటి ప్రయోజనాలు కూడా జమిలి ఎన్నికల వల్ల కలుగుతాయని కూడా కోవింద్ కమిటీ పేర్కొంది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే అనేక ఆర్థిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది!

మన ఆర్థిక వ్యవస్థపై ఎన్నో ప్రామాణిక పరిశోధనలు జరిగాయి. 2014 తర్వాత ప్రభుత్వ గణాంకాల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తినప్పటికీ ఆర్థిక వ్యవస్థకూ రాజకీయాలకూ ఉన్న సంబంధాల గురించి విలువైన విశ్లేషణలు మాత్రం తగ్గలేదు. జమిలి ఎన్నికలు పట్టాలు తప్పటం 1967 తర్వాత మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి నాలుగో సార్వత్రిక ఎన్నికల నాటి (1967) నుంచి ఎదురుదెబ్బలు ఎదురయ్యాయి. 1962 నాటి ఎన్నికలతో పోల్చితే 78 సీట్లు తగ్గిపోయాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 261 సీట్లు కావాల్సివస్తే కాంగ్రెస్ 283 సీట్లనే గెలుచుకుంది. తొమ్మిది రాష్ట్రాల్లో అధికారాన్నీ కోల్పోయింది. ఆ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన పార్టీలు ఎక్కువకాలం అధికారంలో ఉండలేకపోయాయి. ఒకటిరెండు చోట్ల మినహా కాంగ్రెసే ఏదోవిధంగా తిరిగి అధికారాన్ని పొందింది. కొన్నిచోట్ల అసెంబ్లీలు రద్దు అయ్యి మళ్లీ ఎన్నికలూ జరిగాయి. అప్పటి నుంచి ఏకకాలంలో ఎన్నికలు అసాధ్యమయ్యాయి. 1971లో లోక్‌సభకు కూడా మధ్యంతర ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత 1980, 1991, 1998, 1999ల్లోనూ లోక్‌సభకు ముందుగానే ఎన్నికలు జరపాల్సిన పరిస్థితులు వచ్చాయి. రాజకీయ అస్థిరత వల్ల సకాలంలో విధాన నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితులు ఎదురయ్యాయనటంలో సందేహం లేదు. కానీ అవి దేశ జీడీపీని గణనీయంగా ప్రభావితంచేసే స్థాయికి ఎప్పుడూ వెళ్లలేదు. పూర్తిమెజారిటీ ఉన్న ప్రభుత్వాలు సరైన విధానాలు చేపట్టకపోవటంతో ఆర్థిక వ్యవస్థ అనుకున్నంతగా పరుగులు తీయలేదు. యుద్ధాలు, అనావృష్టి కూడా ఆర్థిక మందగమనానికి తోడ్పడ్డాయి. ఎన్నో విప్లవాత్మక విధానాలను తీసుకువచ్చి ఆచరణలో నీరుకార్చారు. సుస్థిర ప్రభుత్వాల హయాంలోనే ఇవన్నీ జరిగాయి. కానీ జమిలి ఎన్నికలు లేకపోవటంతో ఆర్థిక ప్రగతికి అడ్డంకులు ఏర్పడ్డాయని చెప్పేందుకు సాధికారిక సమాచారం లేదు.

> ఏటా ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి విధానాల అమలుకు ఇబ్బందిగా ఉందనే వాదనను రాజకీయ దృష్టితో చేయొచ్చు. విధానాలను చేపట్టలేని అశక్తత నుంచి జమిలి ఎన్నికల ప్రతిపాదన ఉత్పన్నం కాలేదు. మొత్తం ఎన్నికల ప్రచారమంతా ఒకరిద్దరి నాయకుల చుట్టూ తిప్పే స్థాయికి రాజకీయాలు దిగజారిపోవటంతోనే అసలు సమస్య మొదలైంది. రాజకీయ అనిశ్చితిని, సంక్షోభాన్ని జమిలి ఎన్నికలు ఏ రకంగానూ ఆపలేవు. రెండేళ్లలో ప్రభుత్వం పడిపోతే మిగిలిన కాలానికి ఎన్నికలు జరపకా తప్పదు. ఖర్చూ తప్పదు. సభాకాలం తగ్గుతుంది తప్ప ఒరిగేదేమీ ఉండదు.

ఇక ఏకకాలంలో ఎన్నికలు జరిగినప్పుడు మన ఆర్థిక ప్రగతి అద్భుతమని చెప్పలేం. 1967 వరకూ మన తలసరి జాతీయ ఆదాయం పెరుగుదల రెండు సందర్భాల్లోనే 5 శాతం దాటింది. మూడు సందర్భాల్లో మైనస్‌లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాతా మైనస్‌లోకి వెళ్లిన ఏడాదులూ ఉన్నాయి. 2003–04 నుంచే అది 6 శాతం దాటటం మొదలైంది. జీడీపీలో కాస్త గణనీయ పెరుగుదల 1980ల నుంచి ఆరంభమైంది. అంతకుముందు 30 సంవత్సరాల సగటు అభివృద్ధి రేటు 3.5 శాతానికి కాస్త అటూఇటూగానే ఉండిపోయింది. 1980–81 నుంచి 1991–92 వరకూ సగటు వృద్ధి రేటు 5.3 శాతం నమోదైతే ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన తర్వాత అంటే 1992–93 నుంచి 2003–04 వరకూ 5.9 శాతానికి పెరిగింది.

తరచూ ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందనీ భావించలేం. హరియాణానే తీసుకుందాం. అక్కడ 1968 నుంచి 2000 సంవత్సరాల మధ్యలో అయిదుసార్లు అసెంబ్లీలకు ముందుగా ఎన్నికలు జరగటంతో పాటు ముఖ్యమంత్రులూ అయిదేళ్లు కొనసాగని సందర్భాలు ఉన్నాయి. అవేమీ హరియాణా అభివృద్ధిపై తీవ్ర ప్రభావాన్ని చూపలేదు. ఇప్పటికీ తలసరి ఆదాయపరంగా మొదటి మూడు రాష్ట్రాల్లో హరియాణా ఉంది. కేరళలో 1960 నుంచి 1991 వరకూ ఆరుసార్లు ముందస్తు ఎన్నికలు వచ్చాయి. అయినా అక్కడ అభివృద్ధి కుంటుపడలేదు. మానవాభివృద్ధిలో ఆ రాష్ట్రమే ముందుంది. తమిళనాడులో మూడుసార్లు, కర్ణాటకలో రెండుసార్లు ముందస్తు ఎన్నికలు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో ఆరుసార్లు ముందస్తు ఎన్నికలు జరిగితే గుజరాత్, బిహార్, పశ్చిమ బెంగాల్‌ల్లో మూడుసార్లు జరిగాయి. ప్రధాన రాష్ట్రాల్లో కనీసం ఒక్కసారైనా ముందస్తు ఎన్నికలకు వెళ్లని పరిస్థితి లేదు. ఎక్కువసార్లు ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో తక్కువ అభివృద్ధి.. తక్కువసార్లు జరిగిన చోట ఎక్కువ అభివృద్ధి ఉన్నట్లు చెప్పటానికి ఆధారాల్లేవు. చేపట్టిన విధానాల్లోని మంచిచెడ్డలే ఆర్థికాభివృద్ధిని ప్రభావితం చేశాయి. ఉదాహరణకు అనేక పార్టీల సమాహారమైన యునైటెడ్ ఫ్రంట్ అధికారంలో ఉన్న 1996–97, 1997–98ల్లో కూడా జీడీపీ మామూలుగా పెరిగింది. రాజకీయ అనిశ్చితి ప్రభావం కన్పించలేదు. 1996–97లో జీడీపీ విలువ రూ.13,94,816 కోట్లు ఉంటే మరుసటి ఏడాది అది రూ. 15,45,294 కోట్లకు పెరిగింది. 1998–99లో రూ.17,72,297 కోట్లకు, 1999–2000 రూ.19,88,262 కోట్లకు చేరుకుంది. నిజానికి ఈ సంవత్సరాలన్నీ రాజకీయంగా తీవ్ర అనిశ్చితితో కొట్టుమిట్టాడాయి. నాలుగేళ్లల్లో మూడు సార్లు లోక్‌సభకు ఎన్నికలు వచ్చాయి.

అవినీతి, పదవీకాంక్ష, తాయిలాల సంస్కృతి బాగా పెరుగుతున్నా పెద్ద రాష్ట్రాల్లో గత 25 ఏళ్లల్లో అనిశ్చితితో అసెంబ్లీలు రద్దుకాలేదు. గుజరాత్‌లో మాత్రం 2002లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 1980ల్లో ఖలిస్థాన్ హింసతో అట్టుడికిన పంజాబ్‌లో కూడా 1992 నుంచి సుస్థిరతే నెలకొంది. తరచూ ప్రభుత్వాలు పడిపోయి, సకాలంలో విధానాలు చేపట్టలేని దుస్థితి వస్తే జమిలి గురించి ఆలోచించినా అర్థం ఉంటుంది. నిజానికి ఈ 25 ఏళ్లలోనే రాష్ట్రాలు బలాన్ని సంపాదించుకున్నాయి. సొంత అభివృద్ధి నమూనాలను చేపట్టగలిగాయి. మరోవైపు దేశవ్యాప్తంగా కిందికులాలు రాజకీయ అధికారం కోసం పెద్దఎత్తున ప్రయత్నించటం ఆరంభమైంది. ఈ వర్గాలను ఆకట్టుకోటానికే జనాకర్షణ విధానాలు మొదలయ్యాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు వివిధ పథకాలు ప్రకటించి ఎరలు చూపటంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినతరం చేయాల్సి వచ్చింది.



■ రాహుల్ కుమార్

ఏటా ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి విధానాల అమలుకు ఇబ్బందిగా ఉందనే వాదనను రాజకీయ దృష్టితో చేయొచ్చు. విధానాలను చేపట్టలేని అశక్తత నుంచి జమిలి ఎన్నికల ప్రతిపాదన ఉత్పన్నం కాలేదు. మొత్తం ఎన్నికల ప్రచారమంతా ఒకరిద్దరి నాయకుల చుట్టూ తిప్పే స్థాయికి రాజకీయాలు దిగజారిపోవటంతోనే అసలు సమస్య మొదలైంది. రాష్ట్రస్థాయి నాయకులను కాకుండా ప్రధానమంత్రో, మరో కీలక నాయకుడో ప్రచారం చేస్తే తప్ప గత్యంతరంలేని పరిస్థితికి స్థానిక నాయకత్వాలను నిర్వీర్యం చేశారు. ఇందిరాగాంధీ హయాంలో మొదలైన ఈ సంస్కృతి బీజేపీలో ఇంకా వ్యవస్థీకృతం అయిపోయింది. మితిమీరిన అగ్రనాయక పూజతో వివిధ స్థాయిల్లోని నాయకులు జీరోలుగా మారారు. సర్వంసహా చక్రవర్తులుగా మారిన అగ్రనాయకులకు వస్తున్న ఇబ్బందితోనే జమిలి ఎన్నికల రాగం ఊపందుకుంది. రాజకీయ అనిశ్చితిని, సంక్షోభాన్ని జమిలి ఎన్నికలు ఏ రకంగానూ ఆపలేవు. రెండేళ్లలో ప్రభుత్వం పడిపోతే మిగిలిన కాలానికి ఎన్నికలు జరపకా తప్పదు. ఖర్చూ తప్పదు. సభాకాలం తగ్గుతుంది తప్ప ఒరిగేదేమీ ఉండదు. అయిదేళ్లపాటు విధానసభలు ఉండేలా ఎన్నుకునే స్వేచ్ఛను ఓటర్లకు లేకుండా జమిలి ఎన్నికలు చేస్తాయి.

> 10 శాతంగా ఉన్న ధనిక వర్గాల నుంచే ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్నారు. డబ్బు పంపకం (కిందటి ఎన్నికల్లో అధికార, అనధికార ఖర్చు అంచనా 1.35 లక్షల కోట్లు), తాయిలాలతో ఎన్నికలను భ్రష్టుపట్టిస్తున్న ఈ వర్గాలకు జమిలి ఎన్నికలతో లాభం ఉంటుంది.

ప్రజాస్వామ్య దేశాల్లో మనంత వైవిధ్యం ఉన్న దేశం ఎక్కడా లేదు. భాషలు, ప్రాంతీయ అస్తిత్వాలు ఆధారంగా బలంగా పాదుకున్న రాష్ట్రాలు భారత్‌లోనే ఉన్నాయి. వీటిని పట్టించుకోని జమిలి ఎన్నికలతో అదనంగా చేకూరే ప్రయోజనం ఏమీ ఉండదు. 10 శాతంగా ఉన్న ధనిక వర్గాల నుంచే ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్నారు. డబ్బు పంపకం (కిందటి ఎన్నికల్లో అధికార, అనధికార ఖర్చు అంచనా 1.35 లక్షల కోట్లు), తాయిలాలతో ఎన్నికలను భ్రష్టుపట్టిస్తున్న ఈ వర్గాలకు జమిలి ఎన్నికలతో లాభం ఉంటుంది. విడివిడిగా జరిగే ఎన్నికలతో ఈ వర్గాలకే ఖర్చు పెరుగుతుంది. ప్రజల హక్కుల కోణం నుంచి చూస్తే మాత్రం జరిగేది లాభమని చెప్పలేం.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

త్రిరత్న శిఖరం

అణగారిన బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే. మహాత్మ జ్యోతిరావు ఫూలే సహచరిగా ఆమె కృషిని కుదించడం క్షమించరాని నేరం. ఆమె భారతదేశపు చదువుల తల్లి. బ్రిటీష్ పాలిత భారతంలో సావిత్రి బాయి జీవితం, ఆమె చేసిన సేవ ఒక సువర్ణ అధ్యాయం. "విద్య లేక వివేకం లేదు. వివేకం లేక నీతి లేదు. నీతి లేక పురోగతి లేదు. పురోగతి లేక విత్తము లేదు. విత్తము లేకనే శూద్రులు అధోగతి పాలయ్యారు" అన్న మహాత్మా జ్యోతిరావు ఫూలే మాటలకు ఒక ఆచరణ రూపం వస్తే సావిత్రిబాయిలాగే ఉంటుంది. భారతదేశ విద్యా వ్యవస్థను ఒక మలుపు తిప్పిన ఈ దంపతుల సేవ, అంకితభావం అజరామరమైంది. తాము పుట్టిన శూద్ర జాతికే కాదు, ఊరవతల ఉండే పంచములకు, వెలివాడలకు సైతం అక్షరాలు అందించాలని ఫూలే దంపతులు తపించారు.

సావిత్రిబాయి జీవితాన్ని, ఆమె నిర్వహించిన పాత్రను సరిగా సమీక్షిస్తే ఆమె పేరును ఉన్నత శిఖరాల మీద నిలుపవలసి ఉంటుంది. ఒకవైపు కులవ్యవస్థ, మరోవైపు దాని ప్రతిఫలంగా కొనసాగిన పితృస్వామ్య వ్యవస్థ కింది కులాలను, స్త్రీలను కనీసం మనుషులుగా గుర్తించ నిరాకరించాయి. తత్ఫలితంగా చదువు, సంపద వంటి సమస్త హక్కులను వారికి దక్కకుండా చేశాయి. దీనికి తోడు విపరీతమైన అమానవీయ విలువలతో కూడిన మూఢాచారాలు ఆనాటి సమాజాన్ని పట్టి పీడించాయి. ఆ తిరోగమన విలువలపై కొరడా ఝుళిపించింది సావిత్రిబాయి. చదువు ప్రాముఖ్యతను గుర్తించి అక్షరాలను అందించి సమాజాన్ని విముక్తి చేయడం కోసం తన వంతు పాత్రను పోషించింది.



> సాంఘిక విప్లవకారిణిగా సావిత్రిబాయి వేసిన ప్రభావం విలువైనది. ఇవాళ లక్షలాది మంది అమ్మాయిలు చదువు ద్వారా తమ జీవితాలను మార్చుకుంటున్నారంటే అందుకు కారణం సావిత్రిబాయి నాడు ప్రారంభించిన విద్యా ఉద్యమమే. చదువు, సేవ, సాహిత్యమనే మూడు రత్నాలను అధిరోహించిన సాహసి సావిత్రిబాయి. ఆ మహాతల్లిని భారత రత్నతో సత్కరించుకోవాలి.

వేదాలు వింటే చెవుల్లో సీసం పోసిన వ్యవస్థ. వేదాలు చదివితే నాలుకలు తెగ్గోసిన చరిత్ర. ఇలాంటి మనువాద సమాజంలో తొమ్మిదేళ్ల సావిత్రిబాయికి, పన్నెండేళ్ళ జ్యోతిరావు ఫూలేతో వివాహం అయ్యింది. స్త్రీవిద్య ద్వారా తన కుటుంబమే కాదు, ఈ సమాజానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని గ్రహించాడు ఆ మహనీయుడు. అట్లా సావిత్రిబాయిని వివాహ అనంతరం చదివించాడు. చదువు విలువను కనుగొన్న సావిత్రిబాయి దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా ఎదిగింది. బాలికల కోసం తొలి పాఠశాలను 1848లో నెలకొల్పారు. ఫలితంగా ఫూలే దంపతులను ఈ సమాజం వెలేసింది. అయినా సరే పట్టువిడువకుండా విద్యావ్యాప్తికి కృషి చేసి కేవలం నాలుగేండ్లలోనే ఇరవై పాఠశాలలు నెలకొల్పారు. అట్లా అప్పటి దాకా విద్యకు దూరం చేయబడిన దళితులు, శూద్రులు, మహిళలకు విద్యను నేర్పడంకోసం వారి జీవితకాలంలో 52 పాఠశాలలు నెలకొల్పి సరికొత్త చరిత్రను సృష్టించారు సావిత్రిబాయి.

విద్య ద్వారా అందివచ్చిన చైతన్యంతో సావిత్రిబాయి అప్పటి సమాజంలోని దురాచారాల మీద యుద్ధం ప్రకటించింది. వితంతువులకు శిరోముండనాలు చేయొద్దని పోరాటం చేసింది. అలాగే 1873లో ఫూలే స్థాపించిన 'సత్య శోధక్ సమాజ్' ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించి సమాజాన్ని ఆలోచింపజేశారు. భర్త చనిపోతే భార్యను సైతం కాష్టంలో వేసి తగలబెట్టిన సమాజంలో, వాటిని అడ్డుకొని వితంతువులకు ఆశ్రయం కల్పించారు సావిత్రిబాయి. మహిళల హక్కుల కోసం 1852లో మహిళా సేవా మండల్‌ను ఏర్పాటు చేశారు. ఈ దురాచారాలకు ఆధారంగా నిలుస్తున్న కుల వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించే ప్రయత్నం చేశారు సావిత్రి. అంతేకాదు సామాజిక సేవ కార్యక్రమాలను అలుపెరుగకుండా కొనసాగించారు. 1870, 1896లలో వరుసగా వచ్చిన దుర్భర కరువు కాలంలో పేదలను ఆదుకునేందుకు సావిత్రిబాయి నడుం కట్టారు. రోజుకు 2 వేల మంది అనాథ పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం జోలెపట్టి విరాళాలు సేకరించారు. అంతేకాదు ప్రాణాలకు తెగించి 1897లో పూణే పరిసర ప్రాంతాల్లో సంభవించిన ప్లేగు వ్యాధి బాధితులకు సేవలు చేశారు. ఆ ప్లేగు బారినే పడి ప్రాణాలు విడిచారు.

ఇక సామాజిక ఉద్యమకారిణిగా, ఉపాధ్యాయురాలిగా, సంఘసంస్కర్తగానే కాదు; కవయిత్రిగా, రచయిత్రిగా సావిత్రిబాయి సంధించిన అక్షర అస్త్రాలు ఎంతో విలువైనవి. హేతుబద్ధతే ప్రామాణికమైన సావిత్రి బాయి కవిత్వం 'కావ్యఫూలే' (1854), 'పావన కాశీ సుబోధ రత్నాకర్' (1891)లతో పాటు 'కర్జ్' వంటి వ్యాసాలు రాశారు. సాంఘిక విప్లవకారిణిగా సావిత్రి బాయి వేసిన ప్రభావం విలువైనది. ఇవాళ లక్షలాదిమంది అమ్మాయిలు చదువు ద్వారా తమ జీవితాలను మార్చుకుంటున్నారంటే అందుకు కారణం సావిత్రిబాయి నాడు ప్రారంభించిన విద్యా ఉద్యమమే. ఇన్ని రకాల పాత్రల్లో ఒదిగిపోయిన ఆ మహాతల్లికి ఈ సమాజం పట్ల ఎనలేని మమకారం ఉంది. తాను ఎదిగి వచ్చిన సమాజానికి తన వంతుగా తిరిగి అందించడం సామాజిక బాధ్యతగా భావించారు. అడుగడుగునా అవాంతరాలను, అడ్డంకులను ఎదుర్కొని సావిత్రిబాయి కొనసాగించిన చారిత్రాత్మకమైన పాత్రను ఇవాళ పాలకులు గుర్తించాలి. చదువు, సేవ, సాహిత్యమనే మూడు రత్నాలను అధిరోహించిన సాహసి సావిత్రిబాయి. ఆ మహాతల్లిని భారతరత్నతో సత్కరించుకోవాలి. అలాగే తమ జీవితాలను మార్చిన చదువుల తల్లి సావిత్రిబాయి జన్మదినాన్ని బహుజనులు ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలి. ఆమె మార్గంలోనే చదువు, మూఢనమ్మకాల నిర్మూలన, సామాజిక సేవను రోజు వారి జీవితంలో భాగం చేసుకోవాలి. అదే ఆ మహాతల్లికి ఘననివాళి అవుతుంది.

● డా. పసునూరి రవీందర్

(నేడు సావిత్రిబాయి ఫూలే జయంతి)

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 1976లో నెల్లూరు జిల్లా కావలి, ప్రస్తుత జవహర్ భారతి కళాశాలలో, కీ.శే. మలిరెడ్డి పట్టాభి రామరెడ్డి నేతృత్వంలో పురుడుపోసుకుంది. అప్పటి నుండి నేటి వరకు క్రమం తప్పకుండా, వార్షిక సభలు జరుపుకొంటున్నది. ఈ సభల్లో సంస్థ సభ్యులు తమ తమ పరిశోధనా రంగాల్లో చేస్తున్న కృషి ఆధారంగా, పరిశోధన పత్రాలు సమర్పిస్తున్నారు. వాటిని సంపాదీకరించి, సంపుటంగా, ఇప్పటికి 46 సంపుటాలు ప్రచురించింది. ఈ క్రమంలో మొదటి సంపుటం 2003లో విడుదలై, 2016లో ముగిసింది. ఆఖరి సంపుటం– తెలుగువారి చరిత్ర–సంస్కృతులకు సంబంధించిన ఆధారాలను, అన్నింటినీ సమీకరించి, క్రోడీకరించి (5000 బి.సి–ఎ.డి. 2006 వరకు) ఒక బృహత్ సంపుటంగా 2017లో వెలువరించింది. తెలుగువారి చరిత్రకు సంబంధించిన సమస్త ఆధారాలను, చారిత్రక దశలవారీగా విభజించి, ప్రచురించింది. చరిత్రకారులకు, పరిశోధకులకు ఈ సంపుటం కరదీపిక లాంటిది. కేవలం గ్రంథాల వివరణ మాత్రమే కాక, వివిధ పరిశోధనా సంచికల్లో వెలువడ్డ వ్యాసాలను క్రమపద్ధతిలో అమర్చింది.

ఈ బృహత్తర కృషి భావితరాలకు అందించేందుకు వీలుగా, మనసు ఫౌండేషన్ చైర్మన్ వెంకటరాయుడు ఈ ప్రచురణలను డిజిటలైజ్ చేసి భావితరాలకు అందే వీలు కల్పించారు.

ఈ సంవత్సరం చరిత్ర సభలు జనవరి 4, 5 తేదీలలో తిరుపతి జిల్లా గూడూరులోని ఎస్.కె.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డా. కె.శివప్రసాద్, స్థానిక కార్యదర్శి డా. గోవిందు సురేంద్రల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంలో కీ.శే. మామిడిపూడి వెంకటరంగయ్య స్మారకోపన్యాసం, గ్రంథావిష్కరణలు ప్రత్యేకించి తెలుగువారి ప్రాచీన కళారూపం తోలుబొమ్మలాట ప్రదర్శన జరుగుతుంది.

– వకుళాభరణం రామకృష్ణ
ఆం.ప్ర. చరిత్ర కాంగ్రెస్ సంస్థాపక సభ్యులు

అమరావతిపై మళ్లీ 'విభజన బుస'

కడివెడు పాలను ఒక్క విషపు చుక్క కలుషితం చేస్తుంది. ప్రజా రాజధాని అమరావతిపై గత ప్రభుత్వం ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ళపాటు కాలకూట విషం చిమ్మిన తర్వాత కూడా, రాజధానిపై వైసీపీ నాయకులు, పెయిడ్ ఎనలిస్టులు, పెయిడ్ ఆర్టిస్టులు, ప్రాంతీయ విద్వేషకులు, రాజధాని వ్యతిరేకులు మళ్ళీ 'విభజన' బుసలు కొట్టటం మానటం లేదు. రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి ప్రణాళికలతో కళ్ళు బైర్లు కమ్మి మెల్లగా మళ్ళీ ప్రాంతీయ ముసుగు వీరులు ముసుగులు తీసి విషం కక్కేందుకు బయలు దేరారు. తెలంగాణకు చెందిన ప్రొఫెసర్ హరగోపాల్, విశాఖపట్నంకు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శర్మ, టీవీ డిబేట్‌లలో వైసీపీ అధికార ప్రతినిధులు మళ్లీ జగన్‌ని అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యతలు స్వీకరించారు. దానికోసం అమరావతిలో ఏదేదో జరిగిపోతుందన్న తప్పుడు సంకేతాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే ప్రయత్నం చేపట్టారు. గత ఐదేళ్ళు రాజధాని రైతులు పడ్డ కష్టాలు, అణచివేతలు ఉద్యమాలను కనుమరుగు చేసే ప్రయత్నం మొదలుపెట్టారు.

అమరావతి రాజధానిగా ఉంటే తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబును ప్రజలందరూ కీర్తిస్తారని భావించారు. అమరావతిలో చంద్రబాబు నకళ్ళు కానీ, ఆనవాళ్ళు కానీ ఉండకూడదని భావించారు. అందుకోసమే మూడు రాజధానుల మంత్రదండం ప్రయోగించారు. బాల్యదశలోనే అమరావతిని హత్య చేసేందుకు సిద్ధపడ్డారు. జగన్ అమరావతిపై తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగానే రాజధాని రైతులు రోడ్డెక్కారు. 1631 రోజులు విరామం లేని సమరం చేశారు. రాజధాని ఉద్యమం ఇంతింతై వటుడింతై అన్నట్టు జగన్ దిగిపోయే దాకా సాగింది.

మళ్ళీ ఇప్పుడు అమరావతిపై బుసలు కొడుతున్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ రాయలసీమ పర్యటనలో మాట్లాడుతూ అన్నీ అమరావతిలోనే పెడతారా? అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజానికి ప్రొఫెసర్ మానవ హక్కుల వాది. పౌర హక్కుల కోసం పని చేస్తుంటారు. మాజీ సీఎం జగన్ పాలనలో రాజధాని రైతులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నప్పుడు హరగోపాల్ పెద్దగా హక్కుల గూర్చి మాట్లాడిన సందర్భాలు లేవు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో పెడుతున్న పెట్టుబడులను చూస్తూ, హైదరాబాద్‌లోనే అన్నీ పెడతారా? అని తెలంగాణా ప్రభుత్వాన్ని ఆయన ఏనాడూ అడగలేదు. అమరావతిలో పెట్టుబడుల గూర్చి మాత్రమే అడుగుతున్నారు.

అమరావతిలో ఏం పెట్టారు? పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ అమరావతిలో లేదు. 44వేల క్యూసెక్కుల సాగునీరు విజయవాడకు రావు. తిరుపతి శ్రీసిటీ గుంటూరులో లేదు. కియా కంపెనీ ప్రకాశం జిల్లాలోనిది కాదు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు ఎవరి కోసం? కడప ఉక్కు దేనికోసం! వీటి గూర్చి మాట్లాడరు. విశాఖపట్నంకు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ శర్మ అమరావతిలోనే నిధులు అన్నీ ఖర్చు చేస్తే ఉత్తరాంధ్ర పరిస్థితి ఏమిటి? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. గత ఐదేళ్ళు శర్మ ఏ సన్యాసం తీసుకున్నారో తెలియదు. ఆయన అమరావతి వంక కన్నెత్తి చూడలేదు. దేశంలోని పలు పేరొందిన నగరాల్లో విశాఖపట్నం ఒకటి. అది ఉత్తరాంధ్రలోనిదే. విశాఖ పోర్టు, విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర కోసం కాదా? పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తాగునీరు ఏ ఒక్క అమరావతి గ్రామానికీ రాదు. టీసీఎల్ కంపెనీ పెట్టి 10 వేల మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వాలన్న ప్రభుత్వ తాజా నిర్ణయం విశాఖ కోసమే. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్రలోనే ఉంది. ఇవన్నీ ప్రాంతాలకు, ప్రాంతీయ అసమానతలను రూపుమాపేందుకు తీసుకున్న చర్యలే. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు సమానంగా అందించాలన్న సంకల్పంలో భాగమే.

నిజానికి మధ్యాంధ్రలోని విజయవాడలో అరవై ఏళ్ళనాటి నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ (వీటీపీఎస్) తప్ప ఏ ఒక్క పరిశ్రమ లేదు. వందేళ్ళ కృష్ణా ఆయకట్టులోని 13 లక్షల 80 వేల ఎకరాలకు సాగునీళ్ళు లేవు. గుంటూరు, ఒంగోలు, ఏలూరు, రాజమండ్రి, నెల్లూరు తదితర రాజధాని సమీప పట్టణాలలో పెట్టిన పరిశ్రమలు లేవు, వచ్చిన ఉపాధి అవకాశాలు లేవు. భూములు తీసుకునేందుకు రక్తం చిందించాల్సిన పరిస్థితులు ఉన్న దేశంలో కన్నీటి బొట్టు రాలకుండా రాజధాని కోసం భూములిస్తే, ఎన్ని ప్రేలాపనలు? ఎన్ని ఆలాపనలు? ఎన్నెన్ని పెడబొబ్బలు? ఎన్నో కుట్రలు?

> అభివృద్ధి నిర్విరామ ప్రక్రియ. దీనికి ఒక ఏడాదో, ఐదేళ్ళో సరిపోవు. అమరావతి అభివృద్ధితో పాటు రక్షణ చర్యలు చాలా అవసరం. అది కూడా చట్టబద్ధమైన రక్షణ. భవిష్యత్తులో మరొకరు రాజధానిని అమరావతి నుంచి తీసివేసి మరో చోట పెట్టేందుకు ప్రయత్నించే సాహసం కానీ, ప్రయత్నం కానీ చేయాలంటే వీలుపడకూడదు.



అసలు రాజధాని అంటే అర్థం ఏమిటి? ఒక ప్రాంతానికి సంబంధించినదా? రాష్ట్రమంతటికీ సంబంధించినదా? అయినా ఐదేళ్ళ పాటు ఇదే వాదనను రాజకీయ ఎజెండాగా చేపడితే, ప్రజలు అలాంటి వారికి ఎలాంటి తీర్పు ఇచ్చారో తెలిసిందే. ఎన్నికల్లో మూడు రాజధానుల హామీతో వెళ్ళి బొక్క బోర్లాపడ్డా, జగన్‌లో కించిత్ అంతర్మథనం లేదు. అధికారంపై దాహార్తి తప్ప, పునః సమీక్ష లేకపోతే ఎలా? ఇలాంటి కుట్రదారులు మాటువేసి ఉన్న సందర్భంలో కూటమి ప్రభుత్వం అమరావతి కోసం ఎలాంటి రక్షణ కంచె వేస్తుందో చూడాలి? అమరావతిలో అభివృద్ధి ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు చేయటంతో పాటు రాజధాని అందరిదీ అన్న భావాన్ని మూడు ప్రాంతాల ప్రజల్లోకి తీసుకువెళ్ళాల్సిన కర్తవ్యం కూడా ప్రభుత్వానిదే. అమరావతిపై రాళ్ళు వేసే వారిపై కఠిన చట్టాలు రూపొందించైనా రక్షించాల్సిందే. అందరికోసం అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కొందరి కోసం మాత్రమే అని ప్రచారం చేసే దుండగులపై చర్యలు తీసుకోకపోతే జరుగుతున్న అభివృద్ధి అడవి కాసిన వెన్నెల కాదా?

అభివృద్ధి నిర్విరామ ప్రక్రియ. దీనికి ఒక ఏడాదో, ఐదేళ్ళో సరిపోవు. కానీ రక్షణ తీసుకునే నిర్ణయానికి ఒక్క రోజు చాలు. అమరావతి అభివృద్ధితో పాటు రక్షణ చర్యలు చాలా అవసరం. అది కూడా చట్టబద్ధమైన రక్షణ. భవిష్యత్తులో మరొకరు రాజధానిని అమరావతి నుంచి తీసివేసి మరోచోట పెట్టేందుకు ప్రయత్నించే సాహసం కానీ, ప్రయత్నం కానీ చేయాలంటే వీలుపడకూడదు. రాజధాని ప్రజల కోసం అయినప్పుడు, ప్రజలందరూ ఆ రాజధానిని సొంతం చేసుకోవాలి. ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలి. 'వంద పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ' అన్న చైనా అధ్యక్షుడు మావో సూక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి. అమరావతిలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకోగలగాలి. అమరావతిలో సోషల్ ఇమ్‌బ్యాలెన్స్ ఉందని 13 ఉమ్మడి జిల్లాలకు చెప్పగలగాలి. ఉద్యమకారులు, రాష్ట్ర ప్రజలు కోరుకునేది అదే.

■ పోతుల బాలకోటయ్య
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

తొలిరోజే పుస్తక మహోత్సవంలో సందర్శకుల సందడి



అక్షరయాగం ఆరంభం

35వ పుస్తక మహోత్సవం ఘనంగా ప్రారంభం
ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



పుస్తక మహోత్సవ ప్రాంగణంలో పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అక్షర యాగానికి అంకురార్పణ జరిగింది. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా, వేల పుస్తకాలు కొలువుదీరాయి. ఈ మహోత్సవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. తొలిరోజే పుస్తక ప్రియుల తాకిడి మొదలైంది. రెండు తెలుగు రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు భారీగా తరలివచ్చారు. ఈసారి ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రచురణకర్తలు వచ్చారు. 2024లో ప్రచురించిన పుస్తకాలను స్టాళ్లలో ప్రదర్శించారు. కాగా, ఇప్పటి వరకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీలో ప్రతినిధులుగా పనిచేసిన వారిని పవన్ కల్యాణ్ పరిచయం చేసుకున్నారు. వారంతా ఆయనకు వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. వీబీఎఫ్‌ఎస్ ప్రతినిధులు మహాభారత విజ్ఞాన సర్వస్వం పుస్తకాన్ని బహూకరించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

6లో

పేదరికపు పరుగులో కుప్పకూలీ..

కానిస్టేబుల్ నియామక పరీక్షలో యువకుడు మృతి

మచిలీపట్నంలో పరుగు పందెం జరుగుతుండగా..

- కార్డియాక్ అరెస్టుగా తేల్చిన వైద్యులు
- మృతుడిది ఎ.కొండూరు మండలం జీళ్లకుంట
- పేదరికంలో పుట్టి.. ప్రభుత్వ ఉద్యోగం కోసం సాధన



చంద్రశేఖర్ (ఫైల్)

ఓవైపు పేదరికం.. మరోవైపు ఉద్యోగ లక్ష్యం.. ఇంకోవైపు అనారోగ్యం.. ఈ మూడూ కలిసి ఆ యువకుడి ప్రాణం తీశాయి. ఎలాగైనా ఉద్యోగం పొంది తల్లిని, చెల్లిని ఆదుకోవాలన్న అతని కసి చివరికి కుప్పకూలిపోయింది. కానిస్టేబుల్ ఉద్యోగ నియామక పరీక్షల్లో భాగంగా మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఫిజికల్ ఎఫిసియెన్సీ టెస్టుకు సంబంధించి 1,600 మీటర్ల రన్నింగ్ పోటీలు గురువారం జరగ్గా, నాల్గో రౌండ్ పూర్తికావడానికి కొద్ది సమయంలో కుప్పకూలిపోయి మృతిచెందిన ఎ.కొండూరు మండలం జీళ్లకుంటకు చెందిన ధరావత్ చంద్రశేఖర్‌రావు వెనుక కన్నీటి కథ ఉంది.

ఎ.కొండూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు మండలం జీళ్లకుంటకు చెందిన ధరావత్ చంద్రశేఖర్‌రావు (25)ది నిరుపేద కుటుంబం. ఏడేళ్ల కిందట తండ్రి దేవా మృతిచెందాడు. కుటుంబ భారమంతా తల్లి మణిపైనే పడింది. అయినా ఆమె వెనకడుగు వేయలేదు. కూలి పని చేసుకుంటూ కొడుకు చంద్రశేఖర్‌రావును డిగ్రీ వరకూ చదివించింది. కష్టపడి కూతురుకు పెళ్లి చేసింది. తల్లి కష్టాన్ని చూసి చలించిపోయిన చంద్రశేఖర్ ఎలాగైనా ఆమెకు చేదోడుగా ఉండాలనుకున్నాడు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఆమెను బాగా చూసుకోవాలనుకున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్ నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేయడంతో దరఖాస్తు చేశాడు. గురువారం మచిలీపట్నంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యాడు. 1,600 మీటర్ల పరుగు పందెంలో కొంతదూరం పరుగు తీసిన చంద్రశేఖర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న వైద్యసిబ్బంది యువకుడిని హుటాహుటిన అంబులెన్స్‌లో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి మిగతా 6లో..



పీఎన్‌బీఎస్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

సంక్రాంతి సందడి మొదలైంది. రెండు రాష్ట్రాల మధ్య భారీగా రాకపోకలు జరిగే అవకాశం ఉండటంతో భారీగా ప్రత్యేక బస్సులు, రైళ్లు నడపాలని యోచిస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక రైళ్లను ప్రకటించగా, ఆర్టీసీ భారీగా ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

పండగే..!

ఈ సంక్రాంతికి ప్రయాణాల జాతరే

- ఈనెల 19 వరకు ప్రభుత్వ సెలవులు
- భారీగా జరగనున్న రాకపోకలు
- ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు ప్రణాళికలు
- రికార్డు స్థాయిలో 1,500 బస్సుల అంచనా
- హైదరాబాద్‌కు ఎక్కువగా నడపాలని యోచన
- ఇప్పటికే ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతికి ప్రయాణాల జాతర మోగనుంది. ఈనెల 19వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో భారీగా ప్రయాణ అంచనాలు నెలకొన్నాయి. గత ఏడాది కంటే రికార్డు స్థాయిలో ప్రయాణాలు జరిగే పరిస్థితి ఉండటంతో ఆర్టీసీ ముందస్తు సన్నాహాలు చేస్తోంది. గత ఏడాది 1,100 ప్రత్యేక బస్సులు తిప్పాలనుకుని, 1,310 బస్సులు తిప్పారు. ఈసారి మరిన్ని సెలవులను దృష్టిలో ఉంచుకుని 1,500 ప్రత్యేక బస్సులు నడపడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. రెండు రోజుల్లో అధికారికంగా ప్రత్యేక బస్సుల వివరాలను ప్రకటించనున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వారి కోసమే సగం బస్సులను రిజర్వు చేయాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. గత ఏడాది బస్సులు చాలకపోవటంతో కార్లు, సొంత వాహనాల్లో అనేకమంది తరలివచ్చారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని భావిస్తున్నారు. మూడొంతులకు పైగా బస్సులను హైదరాబాద్‌కు పంపించాలనే ఆలోచన చేస్తున్నారు.

ఆరు ప్రత్యేక రైళ్లు

తెలంగాణ నుంచి ఆంధ్రాకు ప్రయాణించే వారికోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ఈ మార్గంలో మొత్తం ఆరు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టుగా గురువారం ప్రకటించింది. కాచిగూడ-కాకినాడ టౌన్ (07653) రెండు రైళ్లు, కాకినాడ టౌన్-కాచిగూడ (07654) రెండు, హైదరాబాద్-కాకినాడ టౌన్ (07023), కాకినాడ టౌన్-హైదరాబాద్ (07024) మధ్య మరో రెండు రైళ్లు నడపనున్నారు.

చెన్నై, బెంగళూరుకు కాస్త తక్కువే..

చెన్నై, బెంగళూరు నుంచి గతంలో మాదిరిగా ప్రయాణాలు ఉండట్లేదు. నెల, రెండు నెలల ముందే అక్కడ పనిచేస్తున్న మన టెకీలు విమానాల్లో టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. పండుగ సమయంలో బస్సుల్లో వచ్చినా, విమానాల్లో వచ్చినా ఇంచుమించు ఒకే ధర ఉండటంతో చెన్నై, బెంగళూరు ప్రయాణికులు విమానాలకే ప్రాధాన్యమిస్తున్నారు. రెండు, మూడు నెలల ముందే విమాన టికెట్లు బుక్ చేసుకుంటే డైనమిక్ ఫేర్‌తో మిగతా 6లో..

చలో‌నా.. చలానా

వాహనదారులకు పోలీసుల ఝలక్

- పెండింగ్ చలానాలు చెల్లించకపోతే ఇక అంతే..
- 15వ తేదీలోపు చెల్లించకుంటే వాహనం సీజ్
- సదరు వాహన యజమాని లైసెన్స్ రద్దు
- బ్యారేజీ, నేతాజీ బ్రిడ్జి వద్ద నో హెల్మెట్.. నో ఎంట్రీ
- నగరమంతటా అదే నినాదంతో ఫ్లెక్సీలు





నో హెల్మెట్.. నో ఎంట్రి నినాదాలతో ప్రకాశం బ్యారేజీ, నేతాజీ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి మీ వాహనాలకు పోలీసులు విధించిన చలానాలు ఇంకా చెల్లించలేదా? అసలు మీ వాహనంపై చలానా ఉందో లేదో ఒక్కసారైనా చూసుకున్నారా? ఎన్ని పనులున్నా ఈ రెండు పనులు మాత్రం అత్యవసరంగా చేయండి. నెలల తరబడి చెల్లించకుండా ఉన్న చలానాలను వెంటనే చెల్లించండి. ఎందుకంటే ఇప్పటి వరకు చలానాలు చెల్లించకుండా ఉన్న వారికి ట్రాఫిక్ పోలీసులు ఝలక్ ఇవ్వనున్నారు. అటువంటి వారి వాహనాలను మిగతా 6లో..

ఐసీడీఎస్ పీడీలపై వేటు

రెండు జిల్లాల పీడీల సస్పెన్షన్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల ఐసీడీఎస్ పీడీలపై సస్పెన్షన్ వేటు పడింది. రెండు జిల్లాల ఐసీడీఎస్ పీడీ కార్యాలయాలు రెండూ కానూరులో ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. దీంతో ఇద్దరు పీడీలు జిల్లా కేంద్రంలో అందుబాటులో లేకుండా పోతున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు.. జిల్లా కేంద్రాల్లో కార్యాలయాలు తీసుకుని అక్కడ అందుబాటులో ఉండాలంటూ వారిద్దరికీ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను బేఖాతరు చేశారు. ఈ కారణంగా ఎన్టీఆర్ జిల్లా పీడీ జి.ఉమాదేవి, కృష్ణాజిల్లా పీడీ ఎస్.సువర్ణను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

● ముంచేసిన మంచు



పొగమంచు నగరాన్ని కమ్మేసింది. గురువారం ఉదయం 9 గంటల వరకు మంచు తొలగలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కృష్ణానది వద్ద కూడా ఇదే పరిస్థితి కనిపించడంతో ప్రకాశం బ్యారేజీ కొద్దిసేపు కనిపించలేదు.

హత్యల కలకలం!

- న్యూ ఇయర్ వేడుకల్లో ఇద్దరి హత్య
- మద్యం మత్తులో పొడిచి చంపిన దుండగులు
- రామవరప్పాడు శ్మశానం వద్ద ఒకరు..
- తెల్లదేవరపల్లి దళితవాడలో మరొకరు

6లో



ఉనికి పునాది పుస్తకం

» పఠనంతోనే జ్ఞానసంపద

» పుస్తక మహోత్సవం ప్రారంభోత్సవంలో వక్తలు

విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిత్వ వికాసం.. మానసిక ఉల్లాసం.. సామాజిక పురోగతి.. సాంస్కృతిక ఎల్లల వారసత్వ పరిరక్షణకు పుస్తకాలు అంగరక్షకులుగా ఉంటాయని, ఉనికికి 'పుస్తకం' పునాది వంటిది అని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. '35వ విజయవాడ పుస్తక మహోత్సవం' ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం రాత్రి ప్రారంభమైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జ్యోతిప్రజ్వలన చేసి మహోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ టి.అప్పలనాయుడు, కలెక్టర్ లక్ష్మీషా, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్ చూస్తుండగా ఆగిన పవర్

ప్రారంభోత్సవ సభ ముగిసిన అనంతరం పవన్ కల్యాణ్ సభా వేదికకు వెనుక వైపు ఉన్న విశాలాంధ్ర బుక్‌స్టాల్స్‌ను సందర్శించారు. ఆయన బుక్‌స్టాల్‌లో పుస్తకాలు పట్టుకోగానే పవర్ ఆగిపోయింది. విద్యుత్ దీపాలు ఆరిపోయాయి. సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో ఆయన పలు పుస్తకాలను పరిశీలించారు.

జ్ఞానార్జన అందమైన వ్యసనం

- ఎమెస్కో విజయ్‌కుమార్

జ్ఞానం సంపాదించడం ఒక అందమైన వ్యసనం. ఇది పుస్తక పఠనంతో సాధ్యమవుతుంది. పవన్ కల్యాణ్‌కు జ్ఞానస్థైర్యం ఎక్కువ. దాన్ని పుస్తకాలు ఇచ్చాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పుస్తక మహోత్సవం నిర్వహించడానికి కారణం ఆయనే. ఇక్కడ స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేసినప్పుడు పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని ఇప్పించారు.

నాలుగేళ్లు ఎన్నో ఇబ్బందులు పడ్డాం

- మనోహర నాయుడు, వీబీఎఫ్ఎస్ కార్యదర్శి

విజయవాడలో పుస్తక మహోత్సవం నిర్వహించడానికి 2019 నుంచి 2024 ఎన్నో ఇబ్బందులు పడ్డాం. కరోనా సమయంలో పుస్తక మహోత్సవం నిర్వహించలేదు. మిగిలిన నాలుగేళ్లు చాలా ఇబ్బంది పడ్డాం. పుస్తక ప్రదర్శనకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంను కేటాయించాలని కోరినా ఆ ప్రభుత్వం స్పందించలేదు. మాకు ఎలాంటి సహకారం ఇవ్వలేదు. గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలు చేసి ఆ డబ్బులను ఇప్పటి వరకు ప్రచురణకర్తలకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో అటువంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నాం. పవన్ కల్యాణ్ విశాలాంధ్ర బుక్ హౌస్‌కు వచ్చినప్పుడు తెలుగు ఉండాలని, తెలుగును పరిరక్షించాలని చెప్పారు. ఆయన ఒక విజ్ఞాన భాండాగారం.

సామాజిక పురోగతికి జ్ఞానం దోహదం


- కె.శ్రీనివాసరావు, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి

జ్ఞానం సామాజిక పురోగతికి దోహదం చేస్తుంది. జ్ఞానంతో ఉన్న సమాజం సామాజికంగా, ఆర్థికంగా పురోగతిని సాధిస్తుంది. సమాజంలో కొంత భాగమే జ్ఞానం ఉంటే కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉండదు. పుస్తకాలు కొత్త విజ్ఞానాన్ని అందజేస్తాయి. పుస్తకాలు సంస్కృతి, సృజనాత్మకత, ఊహాశక్తిని బలోపేతం చేస్తాయి. పుస్తకం తల్లి వంటిది. పుస్తకాలు సంస్కృతి, వారసత్వ సంపదను పరిరక్షిస్తాయి. ప్రస్తుతం ఉన్న సామాజిక మాధ్యమాలు, టీవీ ప్రసారాల్లో మునిగిపోవడంతో పుస్తకాలు దూరమవుతున్నాయి. పిల్లలో పఠనా శక్తి తగ్గుతోంది. దేశంలో ప్రచురణకర్తల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.



'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు రాసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు - పాములపర్తి వెంకట నరసింహారావు' పుస్తకావిష్కరణలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంపీ అప్పలనాయుడు, ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్, బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు





పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థినులు

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జనవరి2 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం పోలీస్ పశుసంవర్థక, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖాధికారులతో కోడిపందేల నిషేధంపై తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా కోడిపందేలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు పటిష్టచర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం అధికారులతో డివిజన్, మండల, గ్రామ స్థాయి బృందాలను ఏర్పాటుచేసి పకడ్బందీ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించాలని, ఆదేశాలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, బెట్టింగులు, పేకాట శిబిరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలని చెప్పారు. గతంలో కోడిపందేల నిర్వహించిన వారిని, కత్తులు కట్టే వారిని గుర్తించి బైండవర్ కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హైకోర్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తులు అందరూ హాజరయ్యారు. హైకోర్టు ఉద్యోగుల సంఘానికి చెందిన కేలెండర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. 25 కేజీల కేకును కట్‌చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, రిజిస్ట్రార్‌లు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు కె.సురేంద్రనాథ్, కార్యదర్శి ఎం.ఎలీషా, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.చంద్రబాబు, సంయుక్త కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, పది వార్షిక పరీక్షలు మేలో నిర్వహించాలి

» ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఏఐ కోఆర్డినేటర్స్ అసోసియేషన్

ధర్నాచౌక్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్మీడియట్, పదవ తరగతి వార్షిక పరీక్షలను మే నెలలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఏఐ కోఆర్డినేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్త ఓపెన్ స్కూల్స్ ఏఐ కోఆర్డినేటర్ల సమావేశం గాంధీనగర్‌లోని ఓహోటల్‌లో గురువారం జరిగింది. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం, కో-ఆర్డినేటర్లు, అభ్యాసకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రకటించిన విధంగా రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు జంబ్లింగ్ విధానం ద్వారా పరీక్షలు నిర్వహించడం ద్వారా ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసే పది, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కార్యదర్శి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.వి.సత్యనారాయణ, వర్కింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.సుధీర్, రాష్ట్రవ్యాంగా అన్ని జిల్లాలో కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్ల పరిశీలన

కృష్ణలంక : పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మంత్రి నారా లోకేశ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో కళాశాలలో ఏర్పాట్లను గురువారం ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృత్తికా శుక్లా, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో వేదిక ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. విద్యార్థులతో వర్చువల్‌గా మంత్రి మాట్లాడనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంత్రి లోకేశ్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయనున్నారు. ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సి.శివసత్యనారాయణరెడ్డి, ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

» రూ.33 లక్షల బయో ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేత

మైలవరంరూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రాలలో శ్రీసాయికృష్ణ ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ కమిషనర్ ఆదేశాలతో గురువారం వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులోని రిజిష్టర్లు, లైసెన్స్ కాపీలను సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు, వ్యవసాయాధికారి ఎన్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు తనిఖీ చేశారు. బయో స్టిములెంట్స్‌కు సంబంధించిన ఉత్పత్తులకు సరైన పత్రాలు లేకపోవడంతో రూ.33,04,85లు విలువ గల ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి, ఏఈవోలు పాల్గొన్నారు.

విస్తృత ప్రజాప్రయోజనాలపై దృష్టి పెట్టండి

» రైల్వేతో ముడిపడిన అంశాల్లో పురోగతిపై నిరంతర సమీక్ష

» ఉమ్మడి తనిఖీల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలి

» డీపీఆర్‌లు, ప్రతిపాదనల రూపకల్పన ప్రక్రియ కీలకం

» సమీక్షా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన ప్రాజెక్టులపై ప్రత్యేక చొరవ చూపాలని, ఇందుకు సమన్వయ శాఖల అధికారులు దృష్టిసారించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పనులు, భవిష్యత్తు ప్రాజెక్టులు, వాటిని చేపట్టే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, దక్షిణ మధ్య రైల్వే, ఎన్‌హెచ్ఏఐ, జలవనరుల అభివృద్ధి, డ్రెయిన్లు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా మంజూరైన పనులు, వాటిలో పురోగతి, భవిష్యత్తులో చేపట్టే పనులు తదితరాలపై సమీక్షించారు. వివిధ పనులకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) త్వరితగతిన రూపొందించాలని, ఇందుకు అవసరమైన ఉమ్మడి తనిఖీల ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. రైల్వేతో సంబంధమున్న పనుల పూర్తికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అమృత్ భారత్ పథకం కింద నిధుల మంజూరు, సత్తెనపల్లి-కొంపల్లి రైల్వేలైను తదితరాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గుణదల రైల్వే ఓవర్ బ్రిడ్జి, సింగ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి, వాంబేకాలనీ వద్ద డబుల్ లైన్ రైల్వే అండర్‌బ్రిడ్జి, మధురానగర్ పప్పులవిల్లు వద్ద డబుల్ లైన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితరాలపై సమావేశంలో చర్చించారు. తిరువూరు పట్టణంలోని అంతర్గత రహదారుల మరమ్మతుల పనులపైనా చర్చించి, సాంకేతిక అంశాల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. జగ్గయ్యపేట, నందిగామ పట్టణాలకు తాగునీటి సరఫరాతో వివిధ తాగునీటి పథకాలకు సంబంధించిన మరమ్మతులపైనా దృష్టిపెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రతిపాదనలు, డీపీఆర్‌లు రూపొందించాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులకు సూచించారు. అదేవిధంగా వెలగలేరు వద్ద హెడ్ రెగ్యులేటరీ గేట్స్ రీప్లేస్‌మెంట్, జి.కొండూరు తారకరామ ఎత్తిపోతల పథకానికి మోటార్లు సమకూర్చే అంశంపైనా ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీవో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య, సీపీవో వై.శ్రీలత, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్‌తో పాటు రైల్వే, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

» ఏడున్నర లక్షల మందికి ఉద్యోగాలు

» ఇంధన రంగంలో కొత్త ఆవిష్కరణలు

» మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటన

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఇంధన రంగంలో కొత్త ఆవిష్కరణలతో రాష్ట్రానికి పది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు... ఏడున్నర లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. వెలగపూడి సచివాలయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో గురువారం ఆయన ఇంధనరంగ సంస్థల 2025 డైరీని ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు దార్శనికతతో ఇంధనరంగంలో సుస్థిరతను సాధించే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు. వినియోగదారులకు రోజంతా కరెంటు అందించడంలో ఏపీ జెన్కో సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. జాతీయస్థాయిలో పునరుద్పాదక ఇంధన రంగంలో రాష్ట్రం పురోగతి సాధిస్తోందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటినుంచీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇంధన ఉత్పత్తి సంస్థలు ముందుకొస్తున్నాయని గొట్టిపాటి వెల్లడించారు. పంప్డ్ స్టోరేజీ రంగంలో జెన్కో పెట్టుబడులు పెడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్కో ఎండీ చక్రధరబాబు, ట్రాన్స్‌కో డైరెక్టర్ ఏకేవీ భాస్కర్, జెన్కో డైరెక్టర్ హైడల్ ఎం.సుజయ్‌కుమార్, డైరెక్టర్ థర్మల్ అశోక్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ హెచ్ఆర్ నవీన్‌గౌతమ్ తదితరులు పాల్గొన్నారు..



'2025 నాటికలు' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, డీఎస్ఎన్ మూర్తి, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

అజో విభ కందాళం ఫౌండేషన్ వేదికతో

నాటకరంగానికి పునరుజ్జీవం

» నాటికల పోటీలు ప్రారంభించిన గుమ్మడి గోపాలకృష్ణ

విజయవాడ కల్చరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : నానాటికీ నాటక రంగం హాస్యపతాలుగా మారుతున్న ఈ రోజుల్లో- దానికి పునరుజ్జీవం పోసేందుకు అజో-విభ-కందాళం ఫౌండేషన్, జామవా సంస్కృతిక వేదికలు చేపట్టిన నాటికల పోటీలు, సాహిత్య సదస్సులు, గౌరవ పురస్కారాల కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యమున్నవి. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో కార్యక్రమాలను రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నాటకాలు కేవలం వినోదానికే కాదు, భారతీయ సంస్కృతి విలువలను నిలబెట్టేందుకు కూడా అవసరం.. అందరూ కలిసి నాటక రంగాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేయాలి' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అజో-విభ-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, డీఎస్ఎన్ మూర్తిలను సత్కరించారు. చైర్మన్ డాక్టర్ కేవీ రామానుజాచార్యులు, జామవా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గుండు నారాయణరావు, ఇతర రంగస్థల, సాహిత్య, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. రైతు జీవన కష్టాలను ప్రతిబింబిస్తూ 'అన్నదాత' నాటిక ప్రదర్శించారు.

చలోనా.. చలానా

(5వ పేజీ తరువాయి)

సీజ్ చేయడంతో పాటు యజమానుల డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. బకాయి ఉన్న చలానాల చెల్లింపునకు ఈనెల 15 వరకు గడువు విధించారు. ఈలోగా వాహనదారులు చలానాలు కచ్చితంగా చెల్లించాలి. లేనిపక్షంలో హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి వాహనాలు సీజ్ చేస్తారు. దానితో పాటు సంబంధిత వాహన యజమాని డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని ట్రాఫిక్ ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ వెల్లడించారు. ఈ చలానాలను మీ సేవా కేంద్రం, ఈ-చలాన్ పరివాహన్ వెబ్‌సైట్, యాప్, సమీపంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గానీ చెల్లించాలని స్పష్టం చేశారు. 15వ తేదీ దాటాక ఇంకా వాహనాలకు చలానా బకాయిలు ఉంటే మాత్రం కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. 'నో హెల్మెట్ - నో ఎంట్రీ' నిబంధనను ఇప్పటి వరకు ప్రకాశం బ్యారేజీ, నేతాజీ బ్రిడ్జి వరకే అమలు చేస్తున్నారు. ఈ నిబంధనను నగరంలోని ప్రధాన రహదారులపై కూడా అమలు చేయాలని పోలీసులు యోచిస్తున్నారు.

నెల రోజుల్లో కేసులు ఇలా..

ఉల్లంఘనలు	కేసులు	జరిమానా (రూ.ల్లో)
హెల్మెట్‌లేని ప్రయాణం	17,136	17,13,600
సెల్‌ఫోన్ డ్రైవింగ్	661	6,61,000
నో సీట్‌బెల్ట్	18	1,800
నో పార్కింగ్	1,731	17,31,000
సిగ్నల్ జంపింగ్	14	14,000
పరిమితికి మించిన ప్రయాణం	163	1,63,000

13 రోజుల్లో రూ.34.70 లక్షలు

రోడ్డు ప్రమాదాలు, మరణాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించాక నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. డిసెంబరు 19 నుంచి ఈనెల ఒకటో తేదీ వరకు నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు మొత్తం 9,189 కేసులు నమోదు చేశారు. 19 నుంచి 31వ తేదీ వరకు 12 రోజుల వ్యవధిలో 9,124 కేసులు నమోదు చేశారు. 1న 65 కేసులు కేసులు నమోదు చేశారు. మొత్తం రూ.34లక్షల70వేల952 జరిమానా విధించారు. డిసెంబరు 19 నుంచి 31 వరకు విధించిన చలానాల్లో 7,551 మంది వాహనదారులే జరిమానా చెల్లించారు. వాటి ద్వారా రూ.16లక్షల45వేల954 వసూలు చేశారు. పాత, కొత్త చలానాలు కలిపి డిసెంబరు 31 నాటికి రూ.36లక్షల69వేల900, 1వ తేదీన రూ.48,135 వసూలు చేశారు. మొత్తంగా ఈ 13 రోజుల్లో రూ.37లక్షల18వేల035 వసూలు చేశారు. ఏడు వాహనాలను సీజ్ చేశారు.

పండగే..!

(5వ పేజీ తరువాయి)

(చివర్లో రేట్లు పెంచుకునే పద్ధతి) ప్రకారం టికెట్ల చార్జీ తగ్గుతుంది. దీంతో తక్కువ ధరకు వెళ్లిపోవచ్చన్న ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులను ఆదరించట్లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు చెన్నై, బెంగళూరుకు ప్రత్యేక బస్సులు ఎక్కువగా నడపట్లేదు. కేవలం హైదరబాద్‌కే 700 ప్రత్యేక బస్సులు నడపాలని భావిస్తున్నారు. బెంగళూరుకు 40, చెన్నైకు 40, రాజమండ్రికి 300, విశాఖపట్నానికి 150, ఇతర ప్రాంతాలకు 150 ప్రత్యేక బస్సులు నడపాలని భావిస్తున్నారు. తిరుపతికి 10 ప్రత్యేక బస్సులు, అవసరాన్ని బట్టి రిజర్వు బస్సులను కూడా సిద్ధం చేసుకోవాలని చూస్తున్నారు.

పేదరికపు పరుగులో కుప్పకూలీ..

(5వ పేజీ తరువాయి)

తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చంద్రశేఖర్ డబ్ల్యూబీసీ కౌంట్ 30 వేలకు చేరిందని, దీంతో పాటు ఐదు రోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్నాడని వైద్యులు తెలిపారు. ఉద్యోగం సాధించి ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు మృత్యురూపంతో రావడంతో ఆ కుటుంబం కన్నీటిలో మునిగిపోయింది. చేతికి అంది వచ్చిన కొడుకు కుటుంబ మృతి చెందడంతో తల్లి మణి రోదన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

జిల్లాలో

హత్యల కలకలం!

» న్యూ ఇయర్ వేడుకల్లో ఇద్దరి హత్య

» మద్యం మత్తులో పొడిచి చంపేసిన దుండగులు

విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో నూతన సంవత్సర వేడుకల సమయంలో ఒక రోజు వేర్వేరు చోట్ల జరిగిన రెండు హత్యలు తీవ్ర కలకలం రేపాయి. రామవరప్పాడు శ్మశానవాటిక వద్ద తాపీమేస్త్రిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన వైకుంఠం(30) ఉపాధి కోసం విజయవాడ వచ్చి భార్య, ఇద్దరు పిల్లలు, బంధువులతో కలిసి రామవరప్పాడు కొత్తవంతెన సమీపాన పటేల్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి దుకాణం వద్ద ఇతరులతో గొడవ పడుతుండగా బంధువులు అతడ్ని ఇంటికి తీసుకెళ్లారు. తర్వాత కాసేపటికి మళ్లీ బయటకు వచ్చాడు. పటేల్‌నగర్‌లో ఉన్న శ్మశానం వద్ద రహదారిపై వైకుంఠం రక్తపు మడుగులో పడిఉండగా బంధువులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్ కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య వెనుక ఓ రౌడీషీటర్ పాత్ర ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వైకుంఠంతో రౌడీషీటర్‌కు ఉన్న పాత వివాదాల నేపథ్యంలో గానీ, మద్యం మత్తులో జరిగిన ఘర్షణ వల్ల గానీ హత్య జరిగి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

తెల్లదేవరపల్లిలో యువకుడు..



రాంబాబు (ఫైల్‌ఫొటో)

విస్సన్నపేట : తెల్లదేవరపల్లి దళితవాడలో బుధవారం రాత్రి ట్రాక్టర్ డ్రైవర్ కారుమంచి రాంబాబు (27) హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన విసంపల్లి సతీష్ పదునైన ఆయుధంతో కడుపులో పొడిచి రాంబాబును హత్య చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాంబాబు, సతీష్‌ల మధ్య బుధవారం ఘర్షణ జరగ్గా రాంబాబును పొడిచి గాయపరిచాడు. రాంబాబుకు తీవ్ర రక్తస్రావం అవడంతో అతడ్ని బంధువులు 108లో విస్సన్నపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సీఐ గిరిబాబు, ఎస్సై జి.రామకృష్ణలు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. గురువారం మృతదేహాన్ని స్వగ్రామం తెల్లదేవరపల్లికి తరలిస్తు నిందితులను కఠినంగా శిక్షించాలని మృతుని బంధువులు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

అవనిగడ్డ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతంగా పని చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ విజయవాడ జోన్ ఏడీ జి.విజయరత్నం అన్నారు. అవనిగడ్డ డిపోను గురువారం ఆయన సందర్శించారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కారం చేస్తామని, ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. ఉత్తమ సేవలందించిన కార్మికులకు ప్రశంసాపత్రాలు అందించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114,122, 133
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

అమరావతిని ఆక్యుపంక్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలి

ధర్నాచౌక్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ఆక్యుపంక్చర్ హబ్‌గా అభివృద్ధి చేసి దేశంలోనే మొట్టమొదటి కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పా భారత్ (ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్) వ్యవస్థాపక జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. దీనిపై సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. అశోక్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఆక్యుపంక్చర్‌ను ప్రత్యేక విభాగ చికిత్సగా గుర్తింపు ఇచ్చిందన్నారు. ఎటువంటి సర్జరీలు లేకుండా అనేక వ్యాధులను నయం చేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు.

శేషజీవితం ఆనందంగా గడపాలి

సీపీ రాజశేఖరబాబు



పదవీ విరమణ చేసిన సిబ్బందితో నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు

గుణదల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఉద్యోగులు శేషజీవితం భార్య పిల్లలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్లో ఉద్యోగం చేసి డిసెంబరు 31న పదవీ విరమణ చేసిన వారికి అభినందన సభ సీపీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జరిగింది. ముందుగా వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం వారికి బెనిఫిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి అంకిత భావంతో పనిచేసిన వారికి పోలీసుశాఖ అండగా ఉంటుందని తెలిపారు. నిబద్ధత నిజాయితీతో పనిచేసిన వారు విజయాలు చవిచూస్తారని చెప్పారు. పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కృష్ణ మూర్తి నాయుడు, ఏవో సునీత, ఏసీపీ ప్రసాదరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మా చెవులు చిల్లులు పడుతున్నాయ్

● స్థానికుల ఆర్తనాదాలు ● వారధి బస్టాప్ వద్ద మైక్‌ల ఏర్పాటు ● రాత్రి 10 వరకు భారీ శబ్దంతో ఒకటే మోత

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)

వాహనాల నియంత్రణ దేవుడెరుగు మా చెవులు చిల్లులు పడుతున్నాయి, దయచేసి మైకులు వీలైతే పూర్తిగా తొలగించండి, కాదంటే సౌండ్ తగ్గించండి అంటూ స్థానికుల ఆర్తనాదాలు పెడుతున్నారు. వారధి సర్కిల్ గుంటూరు వైపు వెళ్లే బస్టాప్ వద్ద వాహనాలు నియంత్రణతో పాటు బస్టాప్‌లోనే ప్రయాణికులు ఉండాలని, బస్సులు కూడా అక్కడే ఆపాలని చెబుతూ రెండు మైకులను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ మైక్‌లు ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు విపరీతమైన శబ్దంతో మోగుతూనే ఉంటాయి. దీంతో సమీప ప్రాంత నివాసులు ఈ శబ్దం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ శబ్దం కారణంగా ఇంట్లో, బయటా ఉండలేకున్నామని, ఎవరితోనైనా మాట్లాడామంటే అవకాశం లేకుండా పోయిందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంత భారీ సౌండ్ వల్ల కర్ణభేరి ఎక్కడ దెబ్బతింటుందో భయంగా ఉందంటున్నారు. సిమెంట్ గోడౌన్‌లో పాఠశాల ఉందని, వారికి కూడా ఇబ్బందిగా ఉందని దయచేసి మైక్‌లు తొలగించాలని, కుదరని పక్షంలో తమకు ఇబ్బంది లేకుండా సౌండ్ తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.



వారధి కింద ఏర్పాటు చేసిన రెండు మైక్‌లు

పోలీసులకు చెప్పినా తగ్గించడం లేదు



మైకుల సౌండ్‌తో ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సౌండ్ తగ్గించాలని వారధి సర్కిల్ ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌లో ఉన్న పోలీసులకు వెళ్లి చెప్పినా వారు పట్టించుకోవడం లేదు. దయచేసి వాటిని తొలగించి మాకు మనశాంతిని కలిగించండి.

- దుర్గ(స్థానికురాలు)

ఇంటా, బయటా ఉండలేకపోతున్నాం



మైకుల సౌండ్‌తో ఇంటా, బయట ఉండలేకపోతున్నాం. బస్టాప్‌లో ఆగే వాహనదారుల వరకు వినిపెంచే విధంగా సౌండ్ పెడితే చాలు. అలా కాకుండా ఊరంతా వినిపించే విధంగా మైకులు పెట్టారు. చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే తొలగించకపోతే చుట్టు పక్కల వారికి పిచ్చి ఎక్కడం ఖాయం.

- సత్యవతి (స్థానికురాలు)

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భారతీనగర్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే స్వల్ప కాలిక వ్యవధి కోర్సుల శిక్షణకు ఈనెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ సెంటర్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు మూడు నెలల శిక్షణ ఉంటుంది. ఈ కోర్సులకు ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామన్నారు. 8, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమో, ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ధ్రువ పత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9985759304, 8328252829 నెంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడండి

కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న మరుగుదొడ్లలన్నిటిలోనూ ఎటువంటి మరమ్మతులు లేకుండా చూడటం తోపాటు నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం పటమట, బందర్ రోడ్డు, వారధి, నేషనల్ హైవే, లబ్బీపేట వాటర్ ట్యాంక్, ఆర్టీసీ లేబర్ కాలనీ, నైజాంగేట్ ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుధ్యపనులను, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. లబ్బీపేట వాటర్ ట్యాంక్, గవర్నర్‌పేట ప్రాంతాల్లోని మరుగుదొడ్లను కమిషనర్ పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, అధికారులందరూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చెత్త సేకరణ నిత్యం సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. 44 డివిజన్ ఆర్టీసీ లేబర్ కాలనీలో చేపట్టనున్న డ్రైయిన్ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 55వ డివిజన్ నైజాంగేటు అవుట్ ఫాల్ డ్రైయిన్‌ను పరిశీలించి చెత్త వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. విశాలాంధ్ర రోడ్డు సెంట్రల్ డివైడర్ ఎత్తును పెంచి, డివైడర్ మధ్యలో పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి, ఈఈలు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం పాల్గొన్నారు

కమిషనర్‌కు శుభాకాంక్షలు

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్రను ఆయన చాంబర్‌లో టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్. బాలస్వామి కలసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.

● చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, డీసీపీ చంద్రజోస్, టీపీవోలు వసీంబేగ్, గిరి, మురళీగౌడ్ పలువురు అధికారులు సిబ్బంది తదితరులు నగర కమిషనర్ ధ్యానచంద్రను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

చిట్టినగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రను ఆయన చాంబర్‌లో వీఎంసీ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు జి. అజయ్‌కుమార్, సెక్రటరీ టి.బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షులు జి.ఆంజనేయులు పలువురు డైరెక్టర్‌తో కలసి పుష్పగుచ్ఛాలతో నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్రెడిట్ సొసైటీ క్యాలెండర్ కమిషనర్ ధ్యానచంద్ర ఆవిష్కరించారు. పలువురు సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ లారీ ఢీకొని యువకుడు మృతి

వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం కృష్ణలంకకు చెందిన ఓ నివాసంలో విషాదం నింపింది. బుధవారం మోటార్ సైకిల్ పై వస్తున్న యువకుడిని గూడ్స్ లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పొట్లూరు మండలం, వెల్లంపాడు గ్రామానికి చెందిన కె.వెంగళరెడ్డి ప్రస్తుతం విజయవాడ కృష్ణలంకలో తన కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. కుమారుడు బ్రహ్మారెడ్డి (26) భవానీపురంలోని సాయి ఫ్రైడ్ షాపులో గుమస్తా. అతను ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు వెళ్లి రాత్రి వస్తాడు. బుధవారం రాత్రి బ్రహ్మారెడ్డి మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఫ్లై ఓవర్ దిగువన దుర్గగుడి గాలిగోపురం దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వన్‌వేలో హారన్ కొట్టకుండా అతివేగంగా గూడ్స్ లారీ వచ్చి బ్రహ్మారెడ్డిని ఢీకొంది. ఈ ఘటనలో అతను కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న మృతుడి తండ్రి, బంధువులు మృతదేహాన్ని చూసి తీవ్రంగా విలపించారు. గూడ్స్ లారీ బలంగా తగిలినందువలన చనిపోయినట్లుగా తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ

54 రకాల స్వీట్లు, 21 రకాల పండ్లతో నైవేద్యం



పూజలు చేస్తున్న అర్చకుడు రామాచార్యులు

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాజీగూడెంలో ఉన్న శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉత్సవాల్లో భాగంగా శ్రీ గోదాదేవి అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు. ఆలయ అర్చకులు ఎన్.రామాచార్యులు తొలుత విష్వక్సేన పూజ పుణ్యాహవచనం చేశారు. 60 కేజీల తులసి దళాలతో సహస్రనామవళి అష్టోత్తరలతో అమ్మవారికి విశేష అర్చనలు జరిపారు. 500 మంది సువాసినీలచే కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారికి సారెతో పాటు 54 రకాల స్వీట్లు, 21 రకాల పండ్లను నైవేద్యంగా భక్తులు సమర్పించారు. 11 రకాల పూలతో గోదాదేవి సమేత శ్రీ కృష్ణస్వామి వార్లకు, ఆలయ ప్రాంగణంలో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, గన్నవరం, విజయవాడ, కేసరపల్లి, ఉయ్యూరు, గుడివాడ ప్రాంతాలకు చెందిన చినజీయర్ స్వామి భక్తులు పాల్గొన్నారు.

అందరికీ అనుమతి వచ్చే వరకు నిరసన

కొనసాగుతున్న లయోలా, అమరావతి వాకర్స్ నిరసన



శాంతియుత నిరసన చేస్తున్న లయోలా , అమరావతి వాకర్స్

భారతీనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): లయోలా కళాశాల గ్రౌండ్‌లో అందరికీ వాకింగ్‌కు అనుమతి ఇచ్చేవరకు నిరసన తెలుపుతామని వాకర్స్ స్పష్టం చేశారు. ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం వైఖరిని వ్యతిరేకిస్తూ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ లయోలా , అమరావతి వాకర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారంతో 16వ రోజుకు చేరుకుంది. నగర పోలీస్ కమీషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సాయంత్రం లయోలా వాకర్స్ కళాశాల యాజమాన్యంతో చర్చలు జరిపారు. అనంతరం వాకర్స్ మాట్లాడుతూ ఈ చర్చలో కళాశాల యాజమాన్యం ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ ఎన్ఓ 18 ప్రకారం వాకింగ్‌కు అందరినీ అనుమతించాలి. దీనికి విరుద్ధంగా యాజమ్యానం సీనియర్ సిటిజన్స్‌ను లేదా 50 నుంచి 100 మంది వాకర్స్‌కు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చారని తెలిపారు. వీటిని తాము అంగీకరించమన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయోలా, అమరావతి వాకర్స్ పాల్గొన్నారు.

సీనియర్ జూడో చాంప్‌కు పలువురు ఎంపిక



జూడో క్రీడాకారులను అభినందిస్తున్న శాప్ వీసీ, ఎండీ గిరిషా

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో గత నెలలో జరిగిన సీనియర్ స్టేట్ జూడో చాంపియన్ షిప్‌లో పలువురు క్రీడాకారులు స్వర్ణాలతో మెరిసి, ఈ నెల 4 నుంచి 7 వరకు జరిగే సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన తారా అరుణ్‌కుమార్, బి సుభాష్, మరడా రాజు, గంటా సుమంత్, షేక్ నవాబ్ జానీ, కరమాల పార్థసారథి, షేక్ నవీన్‌లతో పాటు కోచ్ పి.వెంకటతేజలను స్థానిక శాప్ కార్యాలయంలో శాప్ వీసీ, ఎండీ పీఎస్ గిరిషా గురువారం అభినందిస్తూ నేషనల్స్‌లోను పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం స్పోర్ట్సు కిట్‌లను అందించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ జూడో అసోసి యేషన్ అధ్యక్షుడు గణేశ సుబ్బారావు, జనరల్ సెక్రటరీ పవన్ సందీప్, సీఈవో వెంకట్ నామిశెట్టిలు పాల్గొన్నారు.

వైసీపీ నేతలవి చౌకబారు విమర్శలు

పడాల గంగాధర్

ప్రభుత్వాసుపత్రి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): 6వ డివిజన్‌లో ఐదేళ్ల పాలనలో పనులు చేయలేక చేతులెత్తేసిన వైసీపీ నాయకులు కూటమి ఆరు మాసాల్లో పరుగులు పెట్టిస్తుంటే ఏం చేయాలో తెలియక ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చౌకబారు విమర్శలు చేస్తున్నారని టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ విమర్శించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శంకుస్థాపన రాళ్లకే పరిమితం అయ్యిందన్నారు. ఇప్పటికైనా కు విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

కళావేదికపై కూచిపూడి నాట్యం

వన్‌టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికపై గురువారం రామలింగేశ్వర పేటకు చెందిన వెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ గురువు చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ శిష్య బృందం 15 మంది కూచిపూడి నాట్య ప్రదర్శన ఇచ్చారు. మొత్తం 14 అంశాలకు సంబంధించి నాట్యం చేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులను అభినందించి సర్టిఫికెట్లు, ప్రసాదాలను అందజేశారు.

యోగా కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు



గణేష్ నగర్ యోగా కేంద్రంలో వేడుకలు

పటమట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి) : 12వ డివిజన్‌లోని గణేష్‌నగర్ యోగా కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. యోగా గురువు కదలి వెంకట్ మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యాలు మెరుగుపడతాయని, యోగాను, రోజూవారీ దినచర్యలో భాగంగా చేసుకుంటే ఒత్తిడిని జయించవచ్చునని, యోగాను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు శాయన బుజ్జీ, కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, ఆనంద్, ప్రసాద్, కరీం, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



కనకదుర్గ వారధి వద్ద కమ్ముకున్న పొగమంచు

మంచుదుప్పటి

నగరాన్ని మంచు దుప్పటి కప్పేసింది. గురువారం ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కురిసింది. రోడ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని ఆ వెలుగులో ముందుకు సాగారు. వాన తుంపర్ల వలే మంచు పడటం, చలిగాలులు వీయడంతో ప్రజలు గజగజ వణికిపోయారు.



కృష్ణానది వద్ద పొగమంచు

దేశీయ కాంట్రాక్టర్లతో రాజధాని పనులు

● అమరావతి పనులకు నేషనల్ టెండర్లు పిలుస్తున్న సీఆర్డీఏ ● 1,085.68 కోట్లతో ఎల్పీఎస్ జోన్లలో ట్రంక్ ఇన్ఫ్రాకు టెండర్లు

విజయవాడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల కోసం దేశీయ కంపెనీల నుంచి సీఆర్డీఏ, ఏడీసీ వరుసగా టెండర్లు పిలుస్తున్నాయి. ప్రపంచ స్థాయిలో నిర్మించే రాజధాని కాబట్టి గ్లోబల్ టెండర్లు పిలవాలని తొలుత భావించినా.. నవీ ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో సాగుతున్న అత్యద్భుత ఆర్కి టెక్చర్ నిర్మాణాలు, మౌలిక సదుపాయాలను పరిగణన లోకి తీసుకొని అమరావతిలో కూడా దేశీయ కాంట్రాక్టర్లను భాగస్వాములను చేయాలని సీఆర్డీఏ యోచిం చింది. అయితే, ప్రపంచస్థాయి కాంట్రాక్టర్లు ముందుకొ చ్చినా అమరావతి పనుల్లో భాగస్వామ్యం కల్పించేందు కు సిద్ధంగా ఉంది. గత రెండురోజులుగా రూ.వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులకు సంబంధించి సీఆర్డీఏ నేషనల్ టెండర్లు పిలుస్తోంది. దేశీయంగా ఉన్న కాంట్రాక్టర్లు రాష్ట్రంలో పనులు చేసేం దుకు వీలుగా సీఆర్డీఏ కార్యాలయంలో రిజిస్టర్ చేసు కోవాలని సూచిస్తోంది. ఆన్లైన్ విధానంలో కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం కల్పించింది.



మరో రూ.1,085.68 కోట్లతో టెండర్లు

అమరావతిలో టెండర్ల జోరు కొనసాగుతోంది. గురు వారం మరో రూ.1,085.68 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ టెండర్లు ఆహ్వానించింది. ఎల్పీఎస్ జోన్లలో ట్రంక్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ నిమిత్తం మొత్తం మూడు టెండర్లు పిలిచింది. అమరావతి క్యాపిటల్ సిటీ ఏరియా పరిధి జోన్-2ఏలోని అనంతవరం, నెక్కల్లు, తుళ్లూరు(పార్ట్) గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, నీటి సరఫరా నెట్వర్క్, సీవరేజి, విద్యుత్ ఐసీటీ యుటిలిటీ డక్ట్, రీయూజ్ వాటర్లైన్, అవెన్యూ ప్లాంటేషన్ వంటి పనుల కోసం రూ.542.84 కోట్లతో మొదటి టెండర్ పిలిచింది. మరో రూ.542.84 కోట్లతో ఎల్పీఎస్ జోన్-2బీ పరిధి అనంతవరం, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు(పార్ట్) గ్రామాల్లో పైన చెప్పుకొన్న పనులకు రెండో టెండర్ను పిలిచింది. ఈ రెండు టెండర్లకు జనవరి 23 లోపు కాంట్రాక్టర్లు బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది.



ఉపాధ్యాయ సంఘం డెమోక్రటిక్ పీఆర్టీయూ క్యాలెండర్ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

డెమోక్రటిక్ పీఆర్టీయూ క్యాలెండర్ సీఎం ఆవిష్కరణ

గవర్నర్పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): డెమోక్రటిక్ పీఆర్టీయూ (ఏపీ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, ప్రధాన కార్యదర్శి ఈ వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్టు సంఘం నేతలు తెలిపారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

● ప్రభుత్వం సానుకూల స్పందన

● ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

కృష్ణలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చామని, ఆయన సానుకూలంగా స్పందించడంతో కొత్త సంవత్సరంలో సమస్యలు పరిష్కరిస్తారనే ఆశాభావంతో ఉన్నామని ఏపీ ఎన్జీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్ తెలిపారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఏపీ ఎన్జీవో నగర శాఖ రూపొందించిన 2025 క్యాలెండర్ను గురువారం ఎన్జీఓ హోంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఉద్యోగుల సమస్యలను వినతిపత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని తెలిపారన్నారు.

స్టాఫ్నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో (ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా) ఖాళీగా ఉన్న స్టాఫ్నర్సు పోస్టులను ఒక ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ పద్మాశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 17 వరకూ సాయంత్రం 5 గంటల్లోగా రాజమహేంద్రవరంలోని వైద్యారోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు సీఎఫ్ డబ్ల్యు.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్సైట్ను సందర్శించాలన్నారు. గతంలో నోటిఫికేషన్ నెం.5/2022, 1-12-2022న కానీ, 1/2023, 20-09-2023 తేదీన కానీ ఇది వరకే నియమితులై పనిచేసున్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అనర్హులని, వారి దరఖాస్తులు తిరస్కరించడం జరుగుతుందన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

ఉయ్యూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై కె. సురేశ్బాబు తెలిపారు. ఆకునూరు ఎస్సీ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన ఎస్.సుబ్రహ్మణ్యం కొన్నిరోజులుగా వెంట పడుతున్నాడు. బుధవారం రాత్రి బంధువుల ఇంటికి వెళుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించడం చూసిన ఆమె బంధువులు అక్కడికి చేరుకోగా పారిపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పొగమంచు వల్ల విమాన రాకపోకలు ఆలస్యం

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా విమాన రాకపోకలు ఆలస్యంగా నడిచాయి. గురువారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు పడటంతో విమానాశ్రయంలో ల్యాండింగ్ అవాల్సిన విమానాలకు విజిబులిటీ లేక గంటల తరబడి గాల్లోనే చెక్కర్లు కొట్టాయి. ప్రతిరోజు ఉదయం ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. పొగమంచుతో ఒక్కో విమానం గంట నుంచి గంటన్నరకు పైగా గాలిలో చెక్కర్లు కొట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

4 నుంచి ప్రపంచ నాస్తిక మహాసభలు

● దేశ, విదేశాల ప్రతినిధుల రాక ● డాక్టర్ సమరం వెల్లడి

పటమట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నాస్తిక కేంద్రంలో ఈ నెల 4, 5 తేదీల్లో ప్రపంచ నాస్తిక మహాసభలు జరగబోతున్నాయని, నాస్తిక మహాసభల కన్వీనర్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీ సమరం తెలిపారు. ఈ మహాసభలను పురస్కరించుకుని గురువారం స్థానిక నాస్తిక కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాస్తికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని, 20 దేశాల్లో 50 శాతానికి పైగా ప్రజలు నాస్తికత్వాన్ని అనుసరిస్తున్నారన్నారు. 4న ప్రారంభమయ్యే నాస్తిక మహాసభల మొదటిరోజు 11 గంటలకు సభ మొదలవుతుందని, తమిళనాడుకు చెందిన ద్రవిడార్ కజగం అధ్యక్షుడు కే వీరమణి సభలను ప్రారంభిస్తారని, ఇందులో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, ఐఏఎస్ అధికారి కామల్తౌరీ, డాక్టర్ నరేంద్రకుమార్, డాక్టర్ దేవరాజు మహరాజు పాల్గొంటారన్నారు. రెండో రోజు ఉదయం మహాసభలు యూత్ సమ్మిట్గా నిర్వహిస్తామని, యువ సదస్సుని ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్ సంస్థాపకులైన డాక్టర్ జయప్రకాష్ నారాయణ ప్రారంభించి యువతకు తన సందేశాన్ని వినిపిస్తారన్నారు. యువ సదస్సులో జరిగే చర్చాగోష్ఠికి ఆయన సమన్వయకర్తగా వ్యవహరిస్తారని, సదస్సులో పాల్గొనే 300కు పైగా యువతను వివిధ గ్రూపులుగా విభజించి ప్రజాస్వామ్య పరిరక్షణ, శాస్త్రీయ దృక్పథం, క్రిటికల్ థింకింగ్, సెక్యులర్ ఆచరణ వంటి విషయాలపై చర్చాగోష్ఠులు నిర్వహిస్తామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కాన్ఫరెన్స్ డిక్లరేషన్ను ప్రకటిస్తారన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో దేశ, విదేశాలకు చెందిన నాస్తికులు, హేతువాదులు, మేధావులు, పలువురు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని సమరం తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వికాస్ గోరా, నియంత, సకల, రష్మీ పాల్గొన్నారు.



యర్రాజీ జ్యోతితో రాఘవేంద్ర, హైమా

అర్జున అవార్డుకు జ్యోతి ఎంపికపై హర్షం

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన భారత మహిళా అథ్లెట్ యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపిక కావడం తెలుగువారంతా గర్వించదగ్గ విషయమని శాప్ చైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్పై ఆమెకున్న అంకితభావం, పట్టుదల కారణంగా అవార్డుకు ఎంపికవడం జరిగిందని, భవిష్యత్లో మరిన్ని లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

భారత అథ్లెటిక్ సమాఖ్య అభినందనలు

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని అత్యుత్తమ అథ్లెట్గా ఒలింపియన్ యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపిక కావడం నిజంగా సర్వత్రా అభినందనీయమని భారత అథ్లెటిక్ సమాఖ్య సంయుక్త కార్యదర్శి ఆకుల రాఘవేంద్ర, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఆకుల హైమాలు కొనియాడారు. జాతీయ క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్లో 12.78 సెకన్లలో పూర్తి చేసి రజతం సాధించిందని గుర్తు చేశారు. 13 అంతర్జాతీయ పతకాలు, 22 జాతీయ పతకాలతో ఒలింపిక్స్ ఆడిన ఘనత వహించిందన్నారు.

ఆశ చూపించి మోసం

● రూ.50 లక్షలు టోకరా ● బాధితులను బెదిరిస్తున్న ఏఎస్ఐ

విద్యాధరపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తక్కువ డబ్బుతో ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశచూపి కూలీ పనులు చేసుకునేవారి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన మహిళపై బాధితులు భవానీపురం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సిన స్టేషన్లోని ఓ ఏఎస్ఐ బాధితులను బెదిరిస్తూ డబ్బులు తీసుకుని మోసం చేసిన మహిళకు వత్తాసు పలుకుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్టినగర్ పురుషోత్తమవారి వీధిలో లండా వెంకటరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడి సోదరి లక్ష్మీ భవానీపురం, నారాయణ స్కూల్ రోడ్డులో ఉంటున్న కనమర్లపూడి అనూష ఇంటిలో పనిచేస్తుంది. అనూష తక్కువ డబ్బులతో పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులొస్తాయని మాయమాటలు చెప్పడంతో లక్ష్మి తన సోదరుడు వెంకటరావుకు చెప్పింది. ఆయన 2023 ఆగస్టు 20న అనూషకు రూ.6లక్షలు నగదు ఇచ్చాడు. అప్పటి నుంచి తానిచ్చిన డబ్బులకు లాభం అడగ్గా ఇవ్వకుండా కాలయాపన చేసింది. గట్టిగా ప్రశ్నించటంతో రాజకీయ నేతలు, లాయర్లు, పోలీసులు తెలుసని బెదిరింపులకు పాల్పడుతోందని బాధితుడు గత నెల 30న పోలీసులను ఆశ్రయించాడు. అదేరోజు మరో నలుగురు మహిళలు తమ వద్ద కూడా అనూష రూ.5, 6 లక్షలు తీసుకుని మోసం చేసిందని స్పందనలో ఫిర్యాదు చేశారు. సుమారు 11మంది నుంచి రూ.50 లక్షల వరకు అనూష డబ్బులు వసూలు చేసినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయమని పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవటం లేదని స్టేషన్లో పనిచేస్తున్న ఓ ఏఎస్ఐ అనూషకు వత్తాసు పలుకుతూ బెదిరిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. దీనిపై సీఐ ఉమామహేశ్వరరావును వివరణ అడగగా ఈ వ్యవహారం తనకు తెలియదని వివాదాల పరిష్కార వేదికకు పంపించనున్నట్టు ఆంధ్రజ్యోతికి చెప్పారు.



థ్యాంక్యూ సీఎం అంటూ హర్షం వ్యక్తం చేస్తున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నేతలు

జాబ్ క్యాలెండర్ ప్రకటనపై హర్షం

వన్టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి)ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 12న జాబ్ క్యాలెండర్ ప్రకటన చేయనుండటంపై గురువారం మంగళగిరిలోని ఏపీపీఎస్సీ కార్యాలయం వద్ద ఏపీ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ థ్యాంక్యూ సీఎం సార్, థ్యాంక్యూ పవన్ కళ్యాణ్ సార్, థ్యాంక్యూ నారా లోకేష్ సార్ అంటూ ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ మాట్లాడుతూ 2022 పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షా ప్రశ్నాపత్రంలో ఉన్న లోపాలకు గ్రేస్ మార్కులు వేయమని వైసీపీ ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా పట్టించుకోకుండా కేసులు పెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులపై ఉక్కుపాదం మోపిందన్నారు. కూటమి ప్రభుత్వాన్ని కానిస్టేబుల్ అభ్యర్థులకు తెలంగాణ తరహాలో గ్రేస్ మార్కులు వేసి తదుపరి పరీక్షలకు అనుమతించాలని కోరినట్టు చెప్పారు. గ్రూప్-2, డిప్యూటీ డీఈవో తరహాలో గ్రూప్-1 కూడా ఒక ఉద్యోగానికి వందమందిని ఎంపిక చేసి మరలా ఫలితాలు విడుదల చేయాలన్నారు. ఉద్యోగ వయో పరిమితి జనరల్ అభ్యర్థులకు 48 ఏళ్లకు పెంచాలని కోరారు. జేఏసీ నేతలు కె.శివప్రసాద్, వై.లక్ష్మణరావు, ఎండీ రహమ్తున్నీసా, వి.కవిత, దుడ్డు నూకరాజు, పాడితామని నాగరాజు, కె. పెద్దయ్య, ఎం.చంద్రనాయక్, జె.విజయకుమార్ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందార్లకు సబ్సిడీ రుణాలివ్వాలి

● ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ సంఘం

గవర్నర్పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న తరహాలో గొర్రెల పెంపకం దారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా బీజేపీ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. సంఘం నేతలు గురువారం సూర్యారావుపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధరేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. గుడికట్ల పూజారులు, గొరవయ్యకు రూ.10వేలు గౌరవ వేతనం, తిరుమలలో భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలం, నిధులు కేటాయించాలన్నారు. చిత్తూరు జిల్లాలో కురుబలను గుర్తించి ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ కేటాయించేలా కూటమి నేతలను ఒప్పించాలని వివరించారు. తమ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన పురందేశ్వరి సాధ్యమైన మేరకు న్యాయం జరిగేలా కూటమి నేతలకు సూచిస్తానని చెప్పినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పురందేశ్వరిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి వశికేరి లింగమూర్తి, రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుతల విఠల్ గౌడ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణంరెడ్డి కాటమయ్య, కురుబ యువత ప్రధాన కార్యదర్శి దండు కేశం, ఉపాధ్యక్షుడు బండి కాశీ, వశీకేర శివ పాల్గొన్నారు.

నగరంలో నేటి నుంచి రోటా ఫెయిర్

లబ్బీపేట, జనవరి2 (ఆంధ్రజ్యోతి): దేశంలో పోలియో నిర్మూలనకు తమ వంతుగా విరాళాలు సేకరించేందుకు రోటా ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ బాబు తెలిపారు. బందర్ రోడ్డులోని ఒక హోటల్లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి లబ్బీపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్లో 3 రోజుల పాటు ఈ ఫెయిర్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో 120 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నామని, 10వేల మంది సందర్శకులు వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. దీనిద్వారా వచ్చే నగదును దేశంలో పోలియో నిర్మూలనకు అందిస్తామని తెలిపారు. అనంతరం రోటా ఫెయిర్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్లు అమూల్య శ్రీనివాస్, చిన్న మధుబాబు మాట్లాడుతూ ఈ ఫెయిర్లో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి గంటకు లక్కీ డిప్ నిర్వహిస్తామని, తద్వారా వచ్చిన నగదును కూడా పోలియో నిర్మూలనకు వినియోగిస్తామన్నారు. అనంతరం బ్రోచర్ అవిష్కరించారు. క్యూనిక్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ఆనంద్ రెడ్డి, కమిటి సభ్యులు నాని, అమిత్, ఉదయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజన్-2047 పేరుతో మభ్య పెట్టొద్దు

● సీపీఎం సమాలోచనలో వక్తలు

గవర్నర్పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజన్-2047 పేరుతో ప్రభుత్వం ప్రజల్ని భ్రమల్లో ముంచి మబ్బుల్లోకి తీసుకెళుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజన్-2047 అంశంపై గురువారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో సమాలోచన నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి. తులసీదాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విజన్ 2020పై ఇంతవరకు సమీక్ష లేదని, మరోసారి 2047 విజన్ పేరుతో ప్రజలను మోసం చేయడం తప్ప వాటివల్ల రాష్ట్ర ప్రజలకు ప్రయోజనాలు ఏమీ ఉండటం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మేస్తున్నారని, కొత్తగా పీపీపీ స్థానంలో పీ4 తీసుకొచ్చారని విమర్శించారు. ఇక ముందు అన్నిట్లోనూ ప్రజల భాగస్వామ్యం పేరుతో దోచుకోవడానికి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ 2047 నాటికి రెండు ట్రిలియన్ల ఎకానమీకి తీసుకువెళతామంటున్నారని, అంటే 23ఏళ్లలో రాష్ట్ర ఎకానమీ 12 రెట్లు పెరగాల్సి ఉందని అది సాధ్యం కాదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె. ప్రభాకరరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



రిబ్బన్ కట్ చేసి వాహనాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చిత్రంలో ఎంపీ బాలశౌరి, కొల్లు రవీంద్ర తదితరులు

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వాహనం

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

మచిలీపట్నం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముందస్తుగా కేన్సర్ గుర్తించి మరణాలు తగ్గించే లక్ష్యంతో జిల్లాలో ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే వాహనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన జిల్లాలో ఉచిత కేన్సర్ నిర్ధారణ జరిపే వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) రూ.2 కోట్ల వ్యయంతో ఈ వాహనాన్ని సమకూర్చడం ముదావహమన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కేటాయించిన తేదీల్లో ఈ వాహనం తిరుగుతుందన్నారు. ముందస్తుగానే కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తే జిల్లాలో ఏడాదికి 40వేల కేన్సర్ రోగుల మరణాలను నివారించే అవకాశం ఉంటుందని బాలశౌరి తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, వర్ల కుమార్రాజా, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ బాలాజీ, మెడికల్ డెవలప్మెంట్ సర్వీసెస్ కార్పొరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన నేతలు పాల్గొన్నారు.



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామచంద్ర మోహన్, అర్చకులు

దేవదాయ శాఖ మంత్రికి దుర్గమ్మ ఆశీస్సులు

వన్టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి నూతన సంవత్సరం సందర్భంగా దుర్గగుడి తరపున ఆశీస్సులు అందజేశారు. గురువారం రామ నారాయణ రెడ్డిని ఆ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్, అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ పి.వి.ఆర్. శేఖర్, డిప్యూటీ ఈవో రత్నరాజు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి, తదితరులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలపటంతో పాటు దుర్గమ్మ ఆశీస్సులను అందజేశారు. అనంతరం ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం ఇచ్చారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

కృష్ణలంక, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను గురువారం రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఎండీని, చైర్మన్ను సత్కరిస్తున్న జోనల్ చైర్మన్లు

ఆర్టీసీ చైర్మన్, ఎండీలకు జోనల్ చైర్మన్ల శుభాకాంక్షలు

బస్టేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ భవన్లో గురువారం ప్రజా రవాణా సంస్థ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు, నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి, నాయకుడు సీతారామయ్య, తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో ఉద్యోగ సంఘాల నేతలు దివ్యాంగులు, కారుణ్య నియామకాలు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చైర్మన్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.



సదస్సులో మాట్లాడుతున్న కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక

స్ఫూర్తినిచ్చిన జాతీయ సదస్సు

● కేసరపల్లి సర్పంచ్ లక్ష్మీ మౌనిక

గన్నవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంపై జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో మండలంలోని కేసరపల్లి గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక హాజరయ్యారు. మైసూరులో ఇటీవల జరిగిన ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి లక్ష్మీ మౌనిక ఒక్కరినే ఎంపిక చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ సదస్సు ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన సదస్సులో అన్ని రాష్ట్రాల నుంచి మహిళా సర్పంచ్లు వచ్చారన్నారు. మహిళా సర్పంచ్ల పాలన వ్యవహారాల్లో వారి కుటుంబ పురుషుల జోక్యం నివారించటమే సదస్సు ఉద్దేశమన్నారు. పరిపాలనలో మహిళా సర్పంచ్లు స్వేచ్ఛగా పనిచేయటంపై చర్చ జరిగినట్టు చెప్పారు. జాతీయ సదస్సుకు రాష్ట్రం నుంచి తనను ఎంపిక చేసి పంపించిన పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య నివేదన
శుక్రవారం • 3 జనవరి 2025

గీతాసారం

ఆ అర్హత పొందేది అప్పుడే...

*మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖ దుఃఖదాః
ఆగమాపాయినో నిత్యాః స్తాం స్తితీక్షస్వ, భారత!*



"అర్జునా! ఇంద్రియాలతో విషయాల సంయోగం వల్ల..., క్షణికమైన సుఖాలు, దుఃఖాలు కలిగినట్టు అనిపిస్తూ ఉంటుంది. అవి అనిత్యమైనవి. శీతాకాలంలా, ఎండాకాలంలా వస్తూ పోతూ ఉంటాయి. వాటి వల్ల కలత చెందకుండా... అంటే సుఖం వచ్చినప్పుడు సంతోషపడకుండా, కష్టం వచ్చినప్పుడు దుఃఖపడకుండా... ఓర్పుతో వాటిని సహించాలి" అని ఈ గీతాశ్లోకంలో శ్రీకృష్ణుడు బోధించాడు. సమకాలీన సమాజంలో ఈ భావాన్నే 'అది కూడా దాటిపోతుంది' అని వ్యక్తీకరిస్తూ ఉంటాం. అనుభవాత్మకమైన స్థాయిలో మనం దీన్ని అలవాటు చేసుకోగలిగితే... ఈ ద్వంద్వాలను అధిగమించ గలుగుతాం, వాటిని సమానంగా చూడగలుగుతాం.

మనకు చూపు, వినికిడి, వాసన, రుచి, స్పర్శ అనే అయిదు ఇంద్రియానుభూతులు ఉన్నాయి. వాటిని వ్యక్తీకరించే భౌతిక సాధనాలు... కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక, చర్మం. సంబంధిత అవయవాల ద్వారా వచ్చే సమాచారాన్ని క్రమబద్ధీకరించడానికి మెదడులో కూడా ఒక్కొక్క ఇంద్రియానికి ఒక్కొక్క భాగం ఉంటుంది. ఇంద్రియ సాధనలకు అనేక పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు కన్ను ఒక రకమైన పౌనఃపున్యంగల కాంతిని మాత్రమే క్రమబద్ధం చెయ్యగలదు. దీన్నే మనం 'దృశ్యమాన కాంతి' (విజిబుల్ లైట్) అంటాం. ఇక రెండో విషయమేమంటే... కన్ను సెకెనుకు 15 బొమ్మల కన్నా ఎక్కువ గుర్తించలేదు. తెరపై చూసినప్పుడు మనకు ఆనందాన్ని ఇచ్చే వీడియోలు, సినిమాల సృష్టి వెనుక సూత్రం ఇదే. మూడోది... దేన్నయినా చూడడానికి కనీసం కొంత కాంతి అయినా అవసరం. ఇంద్రియాలకు ఉన్న ఈ పరిమితులు 'సత్' (శాశ్వతం), 'అసత్' (అశాశ్వతం) మధ్య తేడాను గమనించే మన సామర్థ్యానికి అడ్డుపడతాయి. తాడుని చూసి చుట్టుకున్న పాము అని భ్రమ పడేలా చేస్తాయి.

ఈ భౌతిక పరికరాలకు అనుబంధంగా ఉండే మెదడులోని భాగాలు కూడా ఈ పరికరాలకు ఉన్న పరిమితుల కారణంగా వైకల్యానికి గురి అవుతాయి. ప్రత్యేకించి, మన బాల్యంలో పెంపకం ద్వారా మనకు నేర్పిన అంశాల వల్ల... మెదడులోని కొన్ని కణాలైన న్యూరాన్లు ప్రత్యేకమైన నిర్మాణాన్ని సంతరించుకుంటాయి. దీన్నే 'హార్డ్ వైరింగ్' అంటారు. ఇది ప్రేరేపితమైన అవగాహనను కలిగిస్తుంది. అంటే మనం దేన్ని చూడాలనుకుంటున్నామో దాన్నే చూసేలా చేస్తుంది. 'సత్'ను చూడలేని ఈ అసమర్థత, 'అసత్' వైపు ఒరిగే స్వభావం దుఃఖానికి కారణం అవుతాయి. సుఖం, దుఃఖం లాంటి ధ్రువాలు దాడి చేసినప్పుడు మనం సంతులనంతో ఉండగలిగితే... అంటే వివేకంతో సుఖ, దుఃఖాలను సమానంగా చూస్తూ, వాటి వల్ల బాధపడకుండా ఉన్నప్పుడు... అమృతానికి (మోక్షానికి) అర్హత సంపాదించుకుంటామని...

యం హి న వ్యథయం త్యే
తే పురుషం
పురుషర్షభ
సమదుఃఖ సుఖం ధీరం
సోమృతత్వాయ కల్పతే... అనే శ్లోకంలో శ్రీకృష్ణుడు అభయం ఇచ్చాడు.



కె. శివప్రసాద్
ఐఏఎస్

ఆలయదర్శనం



పంచరంగాలు చూసొద్దాం!

గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతీ, నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు...

దేశంలో అత్యంత పవిత్రమైనవిగా పూర్వులు పేర్కొన్న ఏడు నదుల్లో కావేరి ఒకటి. ఒక పురాణ కథ ప్రకారం... కవేర ముని కుమార్తె కావేరి. ఆమె అగస్త్య మహాముని రెండో భార్య. అగస్త్యుడు నిరంతరం దేశ సంచారంలో ఉండేవాడు. ఆయనతోనే ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించిన కావేరి... నీటిగా మారింది. ఆయన కమండలంలో స్థిరపడింది. అలా ఒకసారి సహ్యాద్రి ప్రాంతంలో (పశ్చిమ కనుమల్లో) అగస్త్యుడు పర్యటిస్తూ... ఒక చోట ధ్యానం కోసం ఆగాడు. అదే సమయంలో... ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని భావించిన భగవంతుడు... ఒక కాకిలో ప్రేరణ కలిగించాడు. ఆ కాకి ఎగురుతూ వచ్చి, అగస్త్యుడి కమండలాన్ని తోసేసింది. కమండలంలో నుంచి నీరు ఉద్ధృతంగా ప్రవహించి, నదీ రూపం దాల్చింది. అదే కావేరి. కావేరీ నదిని సాక్షాత్తూ విష్ణుస్వరూపంగా భావిస్తారు. ఆ నదీ తీరంలో... కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో నెలకొన్న అయిదు రంగనాథుడి ఆలయాలు... పంచ రంగ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ క్షేత్రాల్లో రంగనాథస్వామి శయన భంగిమలో దర్శనమిస్తాడు. వైష్ణవులకు ఇవి అత్యంత పవిత్రమైనవి. ముఖ్యంగా ధనుర్మాసంలో వీటిని భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకొని, రంగనాథుణ్ణి పూజిస్తారు.

శ్రీరంగం:

108 వైష్ణవ దివ్యక్షేత్రాల్లో అత్యంత ప్రధానమైన శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం 'భూలోక వైకుంఠం'గా, 'ఇండియన్ వాటికన్'గా ప్రసిద్ధి చెందింది. దీన్ని 'పెరియ కోయిల్' (పెద్ద గుడి) అని కూడా పిలుస్తారు. 'శ్రీరంగ మహాత్మ్యం'తో సహా అనేక గ్రంథాల్లో ఈ ఆలయ ఆవిర్భావానికి సంబంధించిన ఎన్నో కథలున్నాయి. ఈ ఆలయ గోపురం క్షీరసాగర మథనంలో ఆవిర్భవించిదనేది వాటిలో ఒకటి. విభీషణుడు ఈ ఆలయాన్ని నిర్మించాడని స్థలపురాణం చెబుతోంది. రామాయణం, మహాభారతం, పద్మ, బ్రహ్మాండ, గరుడ పురాణాల్లో, అనేక ప్రాచీన గ్రంథాల్లో శ్రీరంగనాథుడి ప్రస్తావన ఉందని 'శ్రీరంగ మహాత్మ్యం' పేర్కొంటోంది. కాగా, క్రీస్తుపూర్వం 500 నుంచి 300 మధ్యకాలానికి చెందిన సంగమ యుగ తమిళ సాహిత్యం కూడా శ్రీరంగ క్షేత్ర విశిష్టతను వివరించింది. ధనుర్మాసంలో గానం చేసే తిరుప్పావై పాశురాలను రచించిన గోదాదేవి (ఆండాళ్)కి, శ్రీరంగనాథుడికి వివాహం కూడా జరిగిన ప్రదేశంగానూ దీనికి ప్రశస్తి ఉంది. 150 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయంలో 21 గోపురాలు, ఏడు ప్రాకారాలు ఉన్నాయి. 236 అడుగులతో, పదమూడు అంతస్తుల్లో ఉండే సమున్నతమైన రాజగోపురం ప్రత్యేక ఆకర్షణ. అలాగే ప్రపంచంలోనే పెద్దదైన రంగనాథస్వామి విగ్రహం ఈ ఆలయంలో ఉంది. స్వామి దేవేరి శ్రీరంగనాయకి. ఆమెను 'రంగనాయకి నాచియార్' అని కూడా వ్యవహరిస్తారు. ఈ ఆలయంలో అనేక ఉపాలయాలతో పాటు శ్రీరామానుజస్వామి భౌతిక దేహం కూడా దాదాపు 1200 ఏళ్లుగా భద్రపరచి ఉండడం మరో విశేషం. తిరుచిరాపల్లి (తిరుచ్చి)కి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.





శ్రీరంగపట్నం:

పంచరంగ క్షేత్రాలలో శ్రీరంగపట్నంలోని రంగనాథుడి ఆలయం మొదటిది. కర్ణాటకలోని మైసూరు నగరానికి సుమారు 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం వెయ్యేళ్ళ పూర్వం నాటిది. పశ్చిమ గంగవంశానికి చెందిన పాలకులు దీన్ని కట్టించారని చరిత్ర చెబుతోంది. శ్రీరంగపట్నాన్ని రాజధానిగా చేసుకొని టిప్పుసుల్తాన్ పరిపాలించాడు. విశిష్టాద్వైత ప్రతిపాదకుడైన శ్రీమద్రామానుజాచార్యులు ఇక్కడ కొంతకాలం నివసించారు. ఆలయం గర్భగుడిలో రంగనాయకీ సమేతుడైన శ్రీ రంగనాథస్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడు, నారసింహుడు, హనుమంతుడు, గరుత్మంతుడు తదితర దేవతామూర్తులు కూడా ఈ ఆలయ ప్రాంగణంలో కొలువుతీరి ఉన్నారు.



కోవిలడి (తిరుప్పేర్‌నగర్):

వైష్ణవులు పవిత్రంగా భావించే 108 దివ్యదేశాలలో ఒకటైన అప్పక్కుడుతాన్ పెరుమాళ్ ఆలయం తమిళనాడులోని ప్రధాన నగరాల్లో ఒకటైన తిరుచిరాపల్లి (తిరుచ్చి)కి 28 కిలోమీటర్ల దూరంలోని కోవిలడిలో ఉంది. ఇక్కడి రంగనాథుడికి 'అప్పక్కుడుతాన్ పెరుమాళ్' అనే పేరు రావడం వెనుక ఒక కథ.. స్థలపురాణంలో కనిపిస్తుంది. ఉపమన్యుడనే మహారాజుకు శ్రీమహావిష్ణువు వృద్ధ రూపంలో దర్శనం ఇచ్చాడు. తనకు ఆహారం కావాలని అడిగాడు. ఉపమన్యుడు ఎన్ని పదార్థాలను నివేదించినా.. స్వామి ఆకలి శాంతించలేదు. ఏం చెయ్యాలో తెలియక... తనకు మార్గం చూపించాలని పరాశర మహర్షిని ఉపమన్యుడు ఆశ్రయించాడు. అప్పాలను భక్తిపూర్వకంగా స్వామికి సమర్పించుకోవాలని పరాశరుడు సలహా ఇచ్చాడు. వాటితో సంతృప్తుడైన మహా విష్ణువు.. అక్కడ కొలువయ్యాడు. మధ్యయుగ చోళుల కాలం నాటి ఈ ఆలయంలో శ్రీరంగనాథుడు భూదేవి, కోమలవల్లీ తాయార్ సమేతుడై ఉంటాడు.



కుంభకోణం:

ఆలయాలకు నిలయంగా ప్రసిద్ధి చెందిన తమిళనాడులోని కుంభకోణంలోని అతి పెద్ద వైష్ణవాలయాల్లో సారంగపాణి ఆలయం ఒకటి. భృగుమహర్షి... లక్ష్మీ నిలయమైన మహావిష్ణువు వక్షస్థలం మీద తన్నడం, లక్ష్మీదేవి భృగువుపై ఆగ్రహించడం, భృగువు అరికాలిలో ఉన్న కన్నును మహావిష్ణువు చిదిమెయ్యడంతో.. భృగువు అహంకారం తొలగిపోవడం... ఈ కథ 'శ్రీవేంకటాచల మహాత్మ్యం'లో కనిపిస్తుంది. ఆ తరువాత లక్ష్మీదేవిని భృగువు ప్రార్థించి, ప్రసన్నం చేసుకొని, తన కుమార్తెగా పుట్టాలని కోరుకుంటాడు. ఆ తరువాత హేమమహర్షిగా భృగువు, ఆయన కుమార్తె కోమలవల్లి (కోమలాంబాళ్)గా లక్ష్మీదేవి జన్మించారు. హేమమహర్షి కోరికపై విష్ణుమూర్తి తన విల్లును (సారంగాన్ని) చేతపట్టి, భూలోకానికి వచ్చి, కోమలవల్లిని పెళ్ళి చేసుకొని, అక్కడే స్థిరపడిపోయాడని స్థలపురాణం వివరిస్తోంది. అందుకే ఈ స్వామిని 'వీట్టోడు మాప్పిళ్ళై' (ఇల్లరికం అల్లుడు) అని పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణం క్రీస్తు శకం ఏడు, ఎనిమిది శతాబ్దాల్లో తొలి చోళ రాజుల కాలంలో జరిగి ఉండొచ్చని చరిత్రకారుల అభిప్రాయం. కాగా పంచరంగ క్షేత్రాల్లో ఒకటిగా... ఈ ఆలయానికి బదులు తమిళనాడులోని నాగపట్నం జిల్లా వడ(ట)రంగంలో ఉన్న రంగనాథపెరుమాళ్ ఆలయాన్ని కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి.



తిరుఇందలూర్:

తమిళనాడులోని మయిలాడుతురై పట్టణ శివార్లలోని తిరుఇందలూర్‌లో కొలువుతీరిన రంగనాథస్వామిని 'పరిమళ పెరుమాళ్' అని పిలుస్తారు. స్థల పురాణం ప్రకారం... శాపగ్రస్తుడైన చంద్రుడు ఆ శాపం నుంచి విముక్తి పొందడానికి ఇక్కడ తపస్సు చేశాడు. అనుగ్రహించిన మహావిష్ణువు ప్రత్యక్షమై, చంద్రుణ్ణి శాపవిముక్తుణ్ణి చెయ్యడంతో పాటు అతని కోరికపై ఇక్కడ వెలిశాడు. ఇందుడు అంటే చంద్రుడు... ఆ పేరుమీద ఈ క్షేత్రానికి 'తిరుఇందలూర్' అనే పేరు వచ్చింది. వెయ్యేళ్ళకు పైగా చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని మధ్య యుగ చోళులు, విజయనగర రాజులు, మధుర నాయకులు అభివృద్ధి చేశారు. పరిమళ పెరుమాళ్ దేవేరి పరిమళ రంగనాయకి. ఆమెను 'చంద్రశాప విమోచనవల్లి', 'పుండరీకవల్లి' అని కూడా పిలుస్తారు. గర్భాలయంలో నదీ దేవతలైన గంగ, కావేరి విగ్రహాలు ఉంటాయి. ఈ ఆవరణలో యోగనరసింహుడు, రామాంజనేయులు, సూర్య చంద్రులు తదితర ఉపాలయాలు కూడా ఉన్నాయి. మయిలాడుతురై పట్టణ కేంద్రానికి అయిదు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

ఆదిమధ్యాంత రంగాలు

కావేరీ నది తీరంలోని మూడు వేర్వేరు దీవుల్లో ఉన్న రంగనాథ ఆలయాలను 'ఆది', 'మధ్య', 'అంత్య' రంగాలుగా పేర్కొంటారు. వీటిలో శ్రీరంగపట్నలోనిది ఆద్యరంగం, శ్రీరంగంలోనిది అంత్యరంగం కాగా... కర్ణాటకలోని శివసముద్రంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయాన్ని 'మధ్యరంగం'గా వ్యవహరిస్తారు. ఇక్కడ రంగనాథస్వామి యవ్వనంలో ఉంటాడని భక్తుల నమ్మకం. కాబట్టి ఆయనను 'మోహన రంగడు', 'జగన్మోహన రంగడు' అని పిలుస్తారు.



జీవితమే సందేశం

పూర్వం ఒక ధనికుడి దగ్గర ఒక సామాన్యుడు పనిచేస్తూ ఉండేవాడు. రోజూ అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి తెచ్చేవాడు. బావిలో నీళ్ళు తోడేవాడు. ఆ ఇంట్లో వారు చెప్పిన ఇతర పనులన్నీ చేసేవాడు. యజమాని పెట్టిన తిండి తినేవాడు. ఇచ్చిన వస్త్రాలు ధరించేవాడు. ఏదో ఒక మూల నిద్రపోతూ ఉండేవాడు. అయితే అతనిలో జ్ఞానపిపాస ఉండేది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. అలా ఒక రోజు అతను ఆలోచిస్తూ, ఆలోచిస్తూ తాదాత్మ్యస్థితిలోకి వెళ్ళిపోయాడు. అకస్మాత్తుగా అతనికి జ్ఞానోదయం కలిగింది. అతని హృదయంలో ప్రేమ, ఆనందం ఉప్పొంగాయి. క్రమంగా అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. అతణ్ణి చూసినవారికి ఏదో తేజస్సు కనిపించేది. క్రమంగా జనం ఆయన పట్ల ఆకర్షితులయ్యారు. అతణ్ణి అనేక విషయాల గురించి అడిగేవారు. అతను ఏదో చెప్పి తప్పించుకొనేవాడు. కానీ అతను గొప్పవాడనే ప్రచారం చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యాపించింది. గురువుగా అతణ్ణి భావించేవారు. అలాగే పిలిచేవారు.

ఈ గురువు గురించి తెలుసుకున్న ఒక వ్యక్తి... తన సందేహాలను చర్చించడం కోసం దూరప్రాంతం నుంచి ఆ గ్రామానికి బయలుదేరాడు. ఊరు బయటే అతను కనిపించడంతో... పలకరించాడు. కొద్దిసేపు మాట్లాడిన తరువాత... అతనికి జ్ఞానోదయం కలిగిందని స్పష్టమయింది. "మీరు జ్ఞాని అయ్యారు కదా! అంతకుముందు మీరేం చేసేవారు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆ గురువు నవ్వి "మా యజమాని కోసం కట్టెలు కొట్టి తెచ్చేవాణ్ణి. బావికి వెళ్ళి నీరు తోడి తెచ్చేవాణ్ణి" అని సమాధానం ఇచ్చాడు.

"ఇప్పుడు మీరు జ్ఞాని కదా! ఇప్పుడేం చేస్తున్నారు?" అని అడిగాడు ఆ వ్యక్తి.

"ఇప్పుడూ అదే పని చేస్తున్నాను" అన్నాడు గురువు.

"మరి తేడా ఏముంది? మీరు జ్ఞాని కావడం వల్ల ప్రయోజనం ఏముంది?" అని ప్రశ్నించాడు ఆ వ్యక్తి.

అప్పుడు గురువు

సద్బోధ



"ఎంతో తేడా ఉంది. అంతకుముందు కట్టెలు కొట్టి తెచ్చినా, బావి నుంచి నీరు మోసుకువచ్చినా యజమాని మీద కోపంతో ఎప్పుడూ ఏదో గొణుక్కొంటూ ఉండేవాణ్ణి. ఆ పనులన్నీ తిట్టుకుంటూ చేసేవాణ్ణి. పనిపట్ల విసుగు, యజమానిపట్ల ద్వేషం ఉండేవి. తినే తిండి నచ్చేది కాదు. కంటికి నిద్ర పట్టేది కాదు. మనసుకు ప్రశాంతత అసలే ఉండేదికాదు. కానీ ఇప్పుడు ఆ పనులన్నీ నాకు ఎంతో ఆనందదాయకమైన, ఆహ్లాదమైన కార్యాలు. వాటిలో అందం, ఆనందం ఇంతా అంతా అని చెప్పలేను. ఇప్పుడు నా దృష్టిలో ఆ యజమాని... నా శ్రేయోభిలాషి, నా సంరక్షకుడు. అతని పట్ల నాకు అమితమైన కృతజ్ఞతాభావం ఏర్పడింది. ఎందుకంటే నాకు కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర ప్రసాదిస్తున్నాడు. సరే! ఇప్పటికే ఆలస్యమయింది. నా యజమాని నాకోసం ఎదురుచూస్తూ ఉంటాడు. వెళ్ళొస్తాను" అని ప్రశాంత వదనంతో, మెరిసేకళ్ళతో చెబుతూ వెళ్ళిపోయాడు.

ఈ కథను ఒక సందర్భంలో ఓషో (రజనీశ్) ఉదహరించారు. శిష్యులతో సేవలు చేయించుకొనే గురువుల గురించి మాత్రమే విన్న మనకు ఇతరులకు సేవలు చేయడానికి ఉబలాటపడే గురువుల గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. "ధ్యానం చేస్తాను, జపం చేస్తాను, ప్రవచనం చెబుతాను" అనే గురువులే తెలిసిన మనకు... "ఆకలైనప్పుడు తింటాను, నిద్రవస్తే నిద్రపోతాను" అని చెప్పే గురువుల తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ ఇది నిజం. ఇలాంటివారు ఎందరో ఉన్నారు. ఎంతో సాధారణ వ్యక్తుల్లా జీవిస్తారు. వారు ఎక్కడా ఏ ప్రత్యేకతా కోరుకోరు. ప్రతి పనిని మన స్ఫూర్తిగా, సంతోషంగా చేయాలి, వాటిలో ఆనందం వెతుక్కోవాలి. మన చుట్టూ ఉన్నవారిని ప్రేమించాలి. ఆదరించేవారిపట్ల కృతజ్ఞతతో ఉండాలి. అలాంటి జీవితాన్ని గడపడం ద్వారా... తమ జీవితాన్నే ఒక సందేశంగా బోధించే గురువులకన్నా గొప్పవారు ఇంకెవరుంటారు?

రాచమడుగు శ్రీనివాసులు

చింతన

మనం స్వేచ్ఛగానే ఉన్నామా?

మనకు ఇష్టం వచ్చిన మతాన్ని మనం అనుసరిస్తాం. నచ్చిన రాజకీయ పార్టీకి ఓటు వేస్తాం. నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకుంటాం. నచ్చిన ప్రదేశంలో జీవిస్తాం. ప్రజాస్వామ్యం పుణ్యమా అని మనకు అంత స్వేచ్ఛ ఉంది. మన దేశ చరిత్రలో కనీవినీ ఎరుగనంత స్వేచ్ఛను ఈనాడు అనుభవిస్తున్నామంటే అతిశయోక్తి కాదు. మరి మనం నిజంగానే స్వేచ్ఛగా ఉన్నామా?

జిడ్డు కృష్ణమూర్తి దృష్టిలో ఈ స్వేచ్ఛ కేవలం ఒక భ్రాంతి మాత్రమే. నిజానికి మనం ఎన్నో ప్రభావాలకు లోనై ఉంటాము. ఉదాహరణకు, మన వృత్తికి సంబంధించిన నిర్ణయం వెనుక ఎన్నో ఆదర్శాలు, ఆశలు, దురాశలు, దేశ కాల పరిస్థితులు గుప్తంగా ఉంటాయి. మనం ప్రేమించి పెళ్ళి చేసుకొనే వ్యక్తి కూడా అంతే. అసలు అందం అనే భావం మీద ఎన్నో ప్రభావాలు కనిపిస్తాయి. ఈ ప్రభావాలకు అతీతమైన అందం ఏదైనా ఉంటుందా? అనేది ఒక పెద్ద వివాదాంశం. "మనిషి తీసుకొనే నిర్ణయాల మీద ఈ ప్రభావాలు ఉన్నంతకాలం... మనిషిని స్వేచ్ఛాజీవి అనడానికి వీలు లేదు" అనేది కృష్ణమూర్తి మనకు తెలియజేసే ఒక ముఖ్యమైన సత్యం. అంటే... అన్ని ప్రభావాలను వదిలించుకున్న తరువాతే మనిషికి స్వేచ్ఛ వస్తుంది. మన పెంపకం, చదువుకున్న పుస్తకాలు (అది భగవద్గీత కావచ్చు, కమ్యూనిస్ట్ మేనిఫెస్టో కావచ్చు), నేర్చుకున్న సిద్ధాంతాలు, విద్యలు, మన అనుభవాలు, సమకాలీన పరిస్థితులు, మన సమాజం, మన వాతావరణం, చివరకు మనం తీసుకొనే ఆహారం... వీటన్నిటి ప్రభావం మన చైతన్యం మీద ఉంటుంది. ఈ ప్రభావాలను మనం ప్రయత్నపూర్వకంగా వదిలించుకోవచ్చు. మన చైతన్యాన్ని శుభ్రపరచుకోవచ్చు. అయితే అంతమాత్రాన మనకు నిజమైన స్వేచ్ఛ రాదు. మనిషి చైతన్యం మీద ఇంకొక లోతైన ప్రభావం ఉంటుంది.



కొందరు తత్త్వవేత్తల దృష్టిలో మనిషి ఆలోచించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటున్నప్పుడు... అతడు ఒక స్వేచ్ఛాజీవి. కానీ ఈ ప్రతిపాదనలో ఉన్న దోషాలను కృష్ణమూర్తి చూపిస్తారు. ఆలోచనలలోని అంశాలన్నీ మనం గతంలో జ్ఞానేంద్రియాల ద్వారా సంపాదించిన విషయాలే. వీటన్నిటి సాయంతో మనం... అంటే మన చైతన్యం ఆలోచించగలుగుతుంది. అంటే 'ఆలోచించడం' అనే ఒక ప్రక్రియ... గతానికి బద్ధమై, గతంలోనే పరిభ్రమిస్తూ ఉంటుంది. గతాన్ని అధిగమించలేని ఆలోచనా ప్రక్రియకు స్వేచ్ఛ ఉండే అవకాశం లేదు. అయితే మనిషి చైతన్యంలో మరో రెండు ప్రగాఢమైన ప్రభావాలు ఉంటాయి, అవి: అహంకారం అంటే 'నేను' అనే భావం, అలాగే కాలం. ఇవి ఆలోచనల్లో పుట్టే అతి క్లిష్టమైన రెండు ప్రభావాలు. అంటే కేవలం ఉపరితలంలో ఉండే పెంపకం, చదువు లాంటి ప్రభావాలను వదిలించుకున్నంతమాత్రాన మనిషికి స్వేచ్ఛ రాదు. మనిషి చైతన్యం ఆలోచనను, అహంకారాన్ని, కాలాన్ని కూడా నిశ్శేషంగా నిర్మూలించాలి. అప్పుడే అతనికి పరిపూర్ణమైన స్వేచ్ఛ లభిస్తుంది. "ఈ మూడింటిని ఒక్క క్షణంలో అధిగమించాలి. నెలల తరబడి, సంవత్సరాల తరబడి చేసే సాధన ద్వారా కాదు. దీనికి వేరే మార్గం ఏదీ లేదు అంటారు" కృష్ణమూర్తి. 'అది ఎలా సాధ్యం?' అనేదే అసలు ప్రశ్న. క్లిష్టమైన శేషప్రశ్న.

గుంటూరు వనమాలి
www.gunturu.de

ముత్యాల ముగ్గు



19 చుక్కలు
5 వరుసలు
అటు ఇటు వదిలి 5 వరకు



సి.హెచ్. మాధవి
అల్వాల్, హైదరాబాద్

ఈ-మెయిల్:
features@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● శుక్రవారం 3 జనవరి 2025

సిరీస్‌లో ఇప్పటికే 1-2తో వెనుకబడిన వేళ.. సిడ్నీ టెస్టులో భారత జట్టు చావోరేవో తేల్చుకోవాల్సిందే. అయితే ఫలితంపై కాకుండా, ఈ మ్యాచ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడతాడా? పెవిలియన్‌కే పరిమితమవుతాడా? అనేదే ఇప్పుడు అందరికీ ఆసక్తికర అంశం. కోచ్ గంభీర్ సైతం అతడి స్థానంపై భరోసా ఇవ్వకపోవడంతో జరుగబోయేదేంటో అర్థమవుతోంది. పేలవ ఫామ్ కొనసాగిస్తున్న హిట్‌మ్యాన్‌పై వేటు పడితే.. సిరీస్ మధ్యలో ఏకంగా కెప్టెన్‌నే పక్కనబెట్టినట్టవుతుంది. భారత క్రికెట్‌లో ఇలాంటి పరిణామం గతంలో ఎన్నడూ చూడనిది. అదే జరిగితే తొలి టెస్టు మాదిరి ఆఖరి మ్యాచ్‌కు కూడా బుమ్రా కెప్టెన్సీలోనే భారత్ తలపడనుంది.

రోహిత్ లేకుండానే?

బరిలోకి టీమిండియా

కెప్టెన్‌గా బుమ్రా

గాయంతో పేసర్ ఆకాశ్ అవుట్ ● నేటి నుంచి ఆసీస్‌తో ఐదో టెస్టు

ఉదయం 5 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో





సిడ్నీ: అత్యంత ఆసక్తిగా సాగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి అంకానికి చేరుకుంది. గురువారం నుంచి జరిగే ఆఖరిదైన ఐదో టెస్టు భారత జట్టుకు అత్యంత కీలకమైనది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌ను సమం చేసుకోగలుగుతుంది. దీంతో పాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ ఆశలను సజీవంగా ఉంచుకోగలుగుతుంది. ఇలా ఒక్క మ్యాచ్.. రెండు ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న టీమిండియా సిడ్నీ టెస్టులో భారీ మార్పులతో బరిలోకి దిగబోతోంది. పేలవ ఫామ్‌తోపాటు నాయకత్వం విషయంలోనూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్ నుంచి తప్పుకొనే అవకాశాలున్నాయి. దీంతో బుమ్రా నాయకత్వంలో జట్టు ఆసీస్‌ను ఎదుర్కొనబోతోంది. ఈ సిరీస్‌లో ఆడిన మూడు టెస్టుల్లో హిట్‌మ్యాన్ కేవలం 6.2 సగటుతో 31 పరుగులు చేయడంతో కోచ్ గంభీర్ అసంతృప్తితో ఉన్నాడు. అలాగే కెప్టెన్సీలోనూ తేలిపోతున్నాడు. మిడిలార్డర్, ఓపెనింగ్ స్థానాల్లో వచ్చినా పరుగుల్లో వెనుకబడి పోవడంతో చివరి టెస్టులో అతడిపై కఠినంగా వ్యవహరించాలన్న నిర్ణయానికి వచ్చినట్టు మీడియా కథనం. మ్యాచ్‌కు ముందు జరిగిన విలేకరుల సమావేశంలోనూ గౌతీ నర్మగర్భంగా ఇదే విషయాన్ని తెలిపాడు. రోహిత్ ఆడతాడని నేరుగా తేల్చకుండా, పిచ్‌ను పరిశీలించాకే తుది జట్టుపై నిర్ణయం తీసుకుంటామని సమాధానాన్ని దాటవేశాడు. ఒకవేళ శుక్రవారం టాస్ వేసేందుకు రాకపోతే రోహిత్ కెరీర్‌లో మెల్‌బోర్న్ టెస్టే చివరిదని భావించాల్సి ఉంటుంది. మరోవైపు ఆసీస్ జట్టు ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా డబ్ల్యూటీసీ ఫైనల్‌లో చోటు దక్కించుకుంటుంది.

మార్పులు ఖాయమే..: సిడ్నీని చేజిక్కించుకోవడం భారత్‌కు అత్యంత ఆవశ్యకం కాబట్టి కోచ్ గౌతీ తుది జట్టును పకడ్బందీగా రూపొందించాలనుకుంటున్నాడు. దీంట్లో భాగంగా నాలుగో టెస్టుకు దూరమైన గిల్‌ను రోహిత్ స్థానంలో తీసుకుని వన్‌డౌన్‌లో ఆడించడం ఖాయంగానే కనిపిస్తోంది. ఓపెనర్‌గా తిరిగి రాహుల్ ఆడతాడు. మరోవైపు నిర్లక్ష్యపు షాట్లతో ఎంసీజీలో జట్టు ఓటమికి కారణమైన కీపర్ పంత్‌పైనా వేటు వేస్తారా? అనేది చూడాల్సిందే. డ్రా కోసం ఓపిగ్గా ఆడాల్సిన వేళ భారీ షాట్‌కు వెళ్లి పంత్ అవుట్ కాగా, ఆసీస్ ఆ తర్వాత టపటపా వికెట్లను పడగొట్టింది. తన స్థానంలో మరో కీపర్ ధ్రువ్ జురెల్ చాన్స్ కోసం చూస్తున్నాడు. నెట్స్‌లోనూ తను ప్రాక్టీస్ చేయడం కనిపించింది. కానీ సిడ్నీ మైదానంలో పంత్ గతంలో అజేయంగా 159 రన్స్ చేసి జట్టును కాపాడాడు. ఒకవేళ పంత్‌ను కొనసాగిస్తే..తుది కూర్పు ఎలావుంటుందో చూడాలి. అలాగే మెల్‌బోర్న్‌లో ఆకట్టుకున్న పేసర్ ఆకాశ్ దీప్ వెన్నునొప్పితో ఈ టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానం కోసం హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ క్రిష్ణ పోటీపడుతున్నారు. బ్యాటింగ్‌లో జైస్వాల్, నితీశ్, రాహుల్ నిలకడగా రాణిస్తున్నారు. విరాట్ కోహ్లీ సైతం ఫామ్‌లేమితో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. సిడ్నీలో స్థాయికి తగ్గట్టు రాణిస్తేనే అతడి కెరీర్ కొనసాగే అవకాశాలుంటాయి. ఇక బౌలింగ్‌లో బుమ్రా జట్టు భారాన్నంతా మోస్తున్నాడు. సహచర బౌలర్ల నుంచి అతడికి తోడ్పాటు అందడం లేదు.

1 సిడ్నీ గ్రౌండ్‌లో తానాడిన 13 టెస్టుల్లో భారత్ ఒక్కసారి మాత్రమే నెగ్గడం గమనార్హం. ఇందులో ఐదు ఓటములు, ఏడు డ్రాలున్నాయి.


వెబ్‌స్టర్

మార్ష్‌పై వేటు

ఆస్ట్రేలియా కూడా సిరీస్‌ను గెలిచేందుకు మార్పులతో బరిలోకి దిగుతోంది. మిడిలార్డర్‌లో మిచెల్ మార్ష్ దారుణంగా విఫలమవుతున్నాడు. టీ20ల్లో జట్టు కెప్టెన్‌గా కొనసాగుతున్న తను ఈ సిరీస్‌లో చేసింది 73 పరుగులే. దీంతో అతడిపై వేటు పడింది. కొత్తగా 31 ఏళ్ల బ్యూ వెబ్‌స్టర్‌కు అవకాశమిచ్చారు. ఈ సిరీస్‌లో ఆసీస్ నుంచి తను మెక్‌స్వీనే, కాన్‌స్టాస్ తర్వాత మూడో అరంగేట్ర ప్లేయర్ కాబోతున్నాడు. 6.5 అడుగుల ఎత్తున్న ఈ ఆజానుబాహుడు బౌలింగ్‌లో ఆఫ్‌స్పిన్ కాకుండా మీడియం పేస్ కూడా వేయగలడు. అలాగే ఆసీస్ బ్యాటింగ్ పటిష్ఠంగా కనిపిస్తుండడంతో భారత బౌలర్లు శ్రమించాల్సిందే. దూకుడు మీదున్న ట్రావిస్ హెడ్ ఎంసీజీలో మాత్రం విఫలమయ్యాడు. పేసర్ స్టార్క్ ఫిట్‌గానే ఉండడం ఆసీస్‌కు సానుకూలాంశం. కెప్టెన్ కమిన్స్ ప్రత్యర్థి బ్యాటర్లను హడలగొడుతున్నాడు.

జట్లు

భారత్ (అంచనా) : రోహిత్ (కెప్టెన్)/గిల్, జైస్వాల్, రాహుల్, విరాట్, పంత్, జడేజా, సుందర్/జురెల్, నితీశ్, ప్రసిద్ధ్/హర్షిత్, బుమ్రా, సిరాజ్.

ఆస్ట్రేలియా (తుదిజట్టు): ఖవాజా, కాన్‌స్టాస్, లబుషేన్, స్మిత్, హెడ్, వెబ్‌స్టర్, క్యారీ, కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, బోలాండ్, లియోన్

పిచ్, వాతావరణం

ఎస్‌సీజీ పిచ్ బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించనుంది. ఆరంభంలో బ్యాటర్లు లాభపడనుండగా.. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. అయితే వాతావరణ పరిస్థితులను బట్టి పేసర్లు కూడా కీలకంగా మారే చాన్స్ ఉంది. వికెట్‌పై 7 మిల్లీమీటర్ల మేర గడ్డిని కత్తిరించారు. తొలి రోజు ఆకాశం మేఘావృతంగా ఉన్నా, వర్షం కురిసే అవకాశం 25 శాతం మాత్రమే. చివరి రెండు రోజులు మాత్రం వరుణుడు మ్యాచ్‌ను అడ్డుకునే అవకాశం లేకపోలేదు.

రోహిత్ ఏమైనా కుర్రాడా?



రోహిత్ టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతాడనే కథనాలపై మాజీ కోచ్ స్పందించాడు. అదే జరిగితే తానేమీ ఆశ్చర్యపోనని బదులిచ్చాడు. రోహిత్ కుర్రాడేమీ కాదని, చాలామంది యువ ఆటగాళ్లు చాన్స్‌ల కోసం వేచి చూస్తున్నారని గుర్తుచేశాడు. ఆసీస్‌తో సిరీస్ తర్వాత రోహిత్ నిర్ణయం తీసుకోవచ్చని, ఒకవేళ భారతజట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెళ్తే పరిస్థితి వేరేలా ఉంటుందని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు.

అవి పుకార్లు మాత్రమే

'డ్రెస్సింగ్ రూమ్‌లో పరిస్థితి బాగాలేదనే వార్తలు పూర్తి అవాస్తవం. అక్కడ మేం మాట్లాడుకునేది ఆటగాళ్ల ప్రదర్శన గురించి. ఇంకా టెస్టు మ్యాచ్‌లు ఎలా గెలవాలనే దానిపైనా చర్చిస్తాం. సీనియర్లు విరాట్, రోహిత్‌తో వ్యక్తిగతంగా నేను మాట్లాడలేదు. అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్, ఆటగాళ్ల మధ్య జరిగిన విషయాలు అక్కడి వరకే పరిమితం కావాలి. బయటకు రాకూడదు. నిజాయతీ కలిగిన వ్యక్తులు ఉన్నంతవరకు భారత క్రికెట్ భద్రంగానే ఉంటుంది'

-కోచ్ గౌతం గంభీర్

క్రీడా రత్నాలు

గుకేష్, మను





● నలుగురికి ఖేల్‌రత్న ● జ్యోతి, దీప్తికి అర్జున ● జాతీయ క్రీడా పురస్కారాల ప్రకటన


దీప్తి


జ్యోతి

న్యూఢిల్లీ: చెస్ వరల్డ్ చాంపియన్ గుకేష్, డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌లను ప్రతిష్ఠాత్మక 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డులు వరించాయి. 2024కు సంబంధించిన క్రీడా పురస్కారాల జాబితాను క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసింది. అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్నకు నలుగురిని, అర్జున అవార్డుకు 32 మందిని ఎంపిక చేశారు. గుకేష్, మనుతోపాటు భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌లు కూడా ఖేల్‌రత్నకు ఎంపికయ్యారు. కాగా, తెలుగు అథ్లెట్లు జ్యోతి యర్రాజి, దీప్తి జీవాంజిలకు అర్జున దక్కాయి. ఈసారి అర్జునకు ఎంపికైన వారిలో 17 మంది పారా అథ్లెట్లు ఉండడం విశేషం. వీరిలో ఎక్కువ మంది పారిస్ పారాలింపిక్స్‌లో అదరగొట్టినవారే. ముగ్గురు కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డులు దక్కాయి. ఈ నెల 17న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఖేల్‌రత్న విజేతలకు జ్ఞాపికతోపాటు రూ. 25 లక్షలు, అర్జున అవార్డీలకు రూ. 15 లక్షలతోపాటు అర్జునుడి ప్రతిమను బహూకరించనున్నారు.

చెస్ చిన్నోడికి అనూహ్యంగా..

ఊహించని రీతిలో గుకేష్‌కు ఖేల్‌రత్న అవార్డు దక్కింది. 18 ఏళ్ల వయసులోనే చెస్ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఆటగాడిగా గుకేష్ చరిత్ర సృష్టించాడు. ఇటీవలే జరిగిన పోరులో డిఫెండింగ్ చాంప్ డింగ్ లిరెన్‌ను ఓడించిన గుకేష్ చెస్ రారాజు కిరీటాన్ని అందుకొన్నాడు. చెస్ ఒలింపియాడ్‌లోనూ దేశానికి చారిత్రక స్వర్ణం అందించడంలోనూ గుకేష్ కీలకపాత్ర పోషించాడు.

పారిస్ స్టార్లకు పెద్దపీట

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా 22 ఏళ్ల మను భాకర్ రికార్డు సృష్టించింది. పారిస్ క్రీడల్లో 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో మను కాంస్య పతకాలు సొంతం చేసుకొంది. అయితే, కొద్ది రోజుల క్రితం బయటకు వచ్చిన జాబితాలో మను పేరు లేకపోవడం వివాదాస్పదమైంది. కానీ, ఆ తర్వాత మంత్రిత్వశాఖ జోక్యంతో అంతా సద్దుమణిగింది. కాగా, హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత పురుషుల హాకీ జట్టు విశ్వక్రీడల్లో వరుసగా రెండో కాంస్యం సాధించింది. పారిస్ పారాలింపిక్స్ హైజంప్ టీ-64 విభాగంలో ప్రవీణ్ స్వర్ణం కొల్లగొట్టగా.. 400 మీ. రేస్‌లో టీ20 విభాగంలో తెలంగాణ అమ్మాయి దీప్తి కాంస్యం అందుకొంది. ఒలింపిక్స్ 100 మీటర్ల హర్డిల్స్‌కు అర్హత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి రికార్డు నెలకొల్పింది. పారిస్ బరిలో నిలిచిన ఆమె సెమీస్‌కు అర్హత సాధించలేక పోయింది.


హర్మన్


ప్రవీణ్

క్రీడా అవార్డుల జాబితా ఇదిగో..

మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న

గుకేష్ (చెస్)
మను భాకర్ (షూటింగ్)
హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
ప్రవీణ్ కుమార్ (పారా హైజంప్)

అర్జున

జ్యోతి యర్రాజి (అథ్లెటిక్స్)
అన్నూ రాణి (అథ్లెటిక్స్)
నీతూ (బాక్సింగ్)
సవీటి బోరా (బాక్సింగ్)
వంతిక అగర్వాల్ (చెస్)
సలీమా టెటె (హాకీ)
అభిషేక్ (హాకీ)
సంజయ్ (హాకీ)
జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
సుఖ్‌జీత్ సింగ్ (హాకీ)
స్వప్నిల్ సురేష్ కుశాలే (షూటింగ్)
సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్)
అభయ్ సింగ్ (స్క్వాష్)
సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్)
అమన్ (రెజ్లింగ్)
రాకేశ్ కుమార్ (పారా ఆర్చరీ)
ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్)
దీప్తి జీవాంజి (పారా అథ్లెటిక్స్)
అజీత్ సింగ్ (పారా అథ్లెటిక్స్)
సచిన్ సర్జేరావు ఖిలారా (పారా అథ్లెటిక్స్)
ధరమ్‌బిర్ (పారా అథ్లెటిక్స్)
ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్)
హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్)
సిమ్రన్ (పారా అథ్లెటిక్స్)
నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్)
నితేశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్)
తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్)
నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)
మనీషా రాందాస్ (పారా బ్యాడ్మింటన్)
కపిల్ పర్మార్ (పారా జూడో)
మోనా అగర్వాల్ (పారా షూటింగ్)
రుబీనా ఫ్రాన్సిస్ (పారా బ్యాడ్మింటన్)

అర్జున అవార్డులు (లైఫ్‌టైమ్)

సుచా సింగ్ (అథ్లెటిక్స్)
మురళీకాంత్ రాజారామ్ పెట్కర్ (పారా స్విమ్మింగ్)

ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు)

సుభాష్ రాణా (పారా షూటింగ్)
దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్)
సందీప్ సంగ్వాన్ (హాకీ)

చంద్రబాబు అభినందన

దేశ ప్రతిష్ఠను పెంచిన నలుగురు క్రీడాకారులను మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపిక చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అలాగే అర్జున అవార్డు గ్రహీతలు విశాఖకు చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ, వరంగల్‌కు చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి కూడా 'ఎక్స్' వేదికగా చంద్రబాబు అభినందనలు తెలిపారు.

సిడ్నీలోనూ విఫలమైతే ఇక కష్టమే!

టెస్టులకు వీడ్కోలు తప్పదా?



న్యూఢిల్లీ: టెస్టుల నుంచి కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్ కావడం ఇక లాంఛనమే ! అదే సమయంలో విరాట్ కోహ్లీ కూడా సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికే సమయం ఎంతో దూరం లేదని మాజీ ఆటగాళ్లు అభిప్రాయపడుతున్నారు. దారుణ వైఫల్యాలకు స్వస్తిపలికే మార్గాలను రోహిత్, విరాట్ కనుగొనలేకపోతుండడంతో.. వారిద్దరి వీడ్కోలుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని భారత జట్టు మాజీ ఆటగాడు అతుల్ వాసన్ బీసీసీఐకి సూచించడం ఆసక్తి రేపుతోంది. 36 ఏళ్ల కోహ్లీ సుదీర్ఘ కాలంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్నాడు. ఇప్పటికే టీ20లనుంచి రిటైర్మెంట్ తీసుకున్న విరాట్ టెస్ట్ కెరీర్ సైతం డోలాయమానంలో పడింది. ఈక్రమంలో విరాట్ వారసుడిని ఎంపిక చేయడంతోపాటు కోహ్లీకి ఘనమైన వీడ్కోలు ఇచ్చేలా చూడాలని వాసన్ అన్నాడు. ప్రస్తుత ఆస్ట్రేలియా పర్యటనలో ఆఫ్‌స్టంప్ ఆవలిగా వేసిన బంతులను వదిలేయడంలో విరాట్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. మెల్‌బోర్న్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కొంత సంయమనం పాటించినట్టు కనిపించింది. కానీ తర్వాత ఆ బలహీనతకు లొంగిపోయాడు. ఆరు, ఏడు స్టంపుల ఆవలిగా పడిన బంతులను వేటాడి మరీ బాక్సింగ్ డే టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వికెట్ సమర్పించుకున్నాడు. ఆస్ట్రేలియా పిచ్‌లకు తగినట్టుగా తాను ఆడలేకపోతున్నానని నాలుగో టెస్ట్‌కు ముందు కోహ్లీ కూడా అంగీకరించాడు. సిడ్నీ టెస్ట్‌లో కనుక విరాట్ భారీగా పరుగులు చేయకపోతే రెడ్‌బాల్ క్రికెట్‌లోనూ అతడి కెరీర్ ముగియడం ఖాయమేనన్నది క్రీడా పండితుల అభిప్రాయం.





గంభీర్ x రోహిత్

సిడ్నీ: సీనియర్ స్పిన్నర్ అశ్విన్ అనూహ్యంగా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించేసి..ఒక్క క్షణం కూడా జట్టుతో ఉండకుండా స్వదేశానికి తిరిగి రావడం సంచలనం సృష్టించింది. అంతేకాదు..అశ్విన్ నిర్ణయం టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం సుహృద్భావపూర్వకంగా లేదనే అనుమానాలను లేవనెత్తింది. ఆ అనుమానాలకు బలం చేకూర్చే ఘటన ఒకటి తాజాగా సిడ్నీలో చోటు చేసుకుంది. గురువారం మధ్యాహ్నం ఒకటిన్నర సమయంలో కోచ్ గంభీర్, పేసర్ బుమ్రా సిడ్నీ గ్రౌండ్ సెంటర్ పిచ్‌ను పరిశీలించేందుకు వచ్చారు. కొన్ని నిమిషాల తర్వాత కెప్టెన్ రోహిత్ కూడా వారివద్దకు వచ్చాడు. ఆ సమయంలో గంభీర్, రోహిత్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోకుండానే అక్కడనుంచి వెనుదిరిగారు. అనంతరం ప్రొటోకాల్ ప్రకారం రోహిత్ కాకుండా గంభీర్ విలేకరులతో మాట్లాడడం జట్టులో లుకలుకలకు బలం చేకూర్చినట్టయింది. కాగా..చివరి టెస్ట్ తుది జట్టులో కెప్టెన్ రోహిత్‌కు చోటుండదన్న వార్తలు బలంగా వస్తున్న నేపథ్యంలో..ఆ విషయమై విలేకరులు గంభీర్‌ను ప్రశ్నించారు. అయితే రోహిత్‌కు తుది 11 మందిలో స్థానం కచ్చితంగా ఉంటుందని మాత్రం కోచ్ చెప్పలేదు. పైగా..'పిచ్‌ను పరిశీలించాక తుది జట్టుపై నిర్ణయం తీసుకుంటాం' అని గౌతీ బదులివ్వడం రోహిత్‌పై వేటు ఖాయమన్న వార్తలకు మరింత ఊతం ఇచ్చింది. ఇంకా..'నిజాయతీ, మెరుగైన ప్రదర్శనే భారత డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండేందుకు అర్హత' అని గంభీర్ కుండబద్దలుగొట్టడం మరెన్నో ప్రశ్నలను రేకెత్తించింది. కెప్టెనే విలేకరుల సమావేశానికి హాజరు కావాలనేది సంప్రదాయం కాదు' అని గంభీర్ వ్యాఖ్యానించడంతో కెప్టెన్, కోచ్ మధ్య సంబంధాలు బెడిసి కొట్టాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎడ మొహం..పెడ మొహం!

హిట్‌మ్యాన్‌కు ఆ అపకీర్తి తప్పదా?

పేలవ ప్రదర్శనతో ఇప్పటికే ముప్పేట విమర్శలు ఎదుర్కొంటున్న కెప్టెన్ రోహిత్‌కు మరో అపకీర్తి తప్పేలా లేదు. సిడ్నీ టెస్ట్‌కు రోహిత్‌పై వేటు వేస్తారని వార్తలు వెల్లువెత్తుతున్నాయి. అవే నిజమైతే..కెప్టెన్‌గా ఉండి జట్టులో చోటు కోల్పోయిన తొలి భారత క్రికెటర్‌గా రోహిత్ అపఖ్యాతి మూటగట్టుకోనున్నాడు. రోహిత్ పరోక్షంలో..బుమ్రా సారథ్యంలో పెర్త్ తొలి టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది. ఆ అంశంకూడా రోహిత్ తొలగింపునకు కారణం కానుందని చెప్పేవారూ ఉన్నారు. సిరీస్ మధ్యలో.. కెప్టెన్‌ను తొలగించిన లేదా వైదొలగిన ఉదంతాలు అంతర్జాతీయ క్రికెట్‌లో గతంలోనూ ఉన్నాయి. 2014లో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో మిస్బావుల్ హక్‌ను తొలగించి షాహిద్ అఫ్రీదికి నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. 2014 టీ20 వరల్డ్ కప్‌లో సెమీస్, ఫైనల్ సహా చివరి మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని చాందిమల్ నిర్ణయించుకోవడంతో..మలింగ సారథ్యాన్ని చేపట్టాడు. 1974 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ మైక్ డెన్నిస్ తుది 11 మంది నుంచి వైదొలగడంతో..జాన్ ఎడ్రిచ్ జట్టుకు కెప్టెన్సీ వహించాడు.

అఫ్ఘానిస్థాన్ 157 ఆలౌట్

జింబాబ్వేతో రెండో టెస్ట్

బులవాయో: మొదటి టెస్ట్‌లో శతకాల మోత మోగించిన అఫ్ఘానిస్థాన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఆ టెస్ట్‌లో డబుల్ సెంచరీలతో చెలరేగిన రహమత్ షా (19), కెప్టెన్ హష్మతుల్లా షాహిది (13), శతకంతో కదం తొక్కిన జజాయ్ (16) కనీసం 20 పరుగులు కూడా చేయలేకపోయారు. రషీద్ ఖాన్ (25) టాప్ స్కోరర్. దాంతో గురువారం ఆరంభమైన రెండో టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 157 పరుగులకే కుప్పకూలింది. సికిందర్ రజా, న్యూమన్ చెరో మూడు వికెట్లు, ముజరబానీ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన జింబాబ్వే ఆట ఆఖరికి వికెట్ నష్టపోకుండా ఆరు పరుగులు సాధించింది.

టీ20 కెప్టెన్సీ నుంచి వైదొలిగిన షంటో



ఢాకా: బంగ్లాదేశ్ టీ20 జట్టు కెప్టెన్సీ నుంచి నజ్ముల్ హొస్సేన్ షంటో వైదొలిగాడు. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ తర్వాత అతడీ నిర్ణయానికి వచ్చినట్టు బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) అధికారి పేర్కొన్నాడు. ఒకవేళ తను ఫిట్‌గా ఉంటే వన్డే, టెస్టులకు కెప్టెన్‌గా కొనసాగుతాడని చెప్పాడు. ప్రస్తుతానికి టీ20 జట్టు కెప్టెన్‌గా ఎవరినీ నియమించకపోయినా, రేసులో మెహదీ హసన్ మిరాజ్ ఉన్నట్టు సమాచారం.

కుశాల్ మెరుపు శతకం

శ్రీలంక ఓదార్పు విజయం


కుశాల్ (46 బంతుల్లో 101)

నెల్సన్ (న్యూజిలాండ్): కుశాల్ పెరీరా (46 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 101) మెరుపు బ్యాటింగ్‌తో న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి టీ20లో శ్రీలంక ఏడు పరుగులతో నెగ్గింది. పొట్టి ఫార్మాట్‌లో శ్రీలంక తరపున వేగవంతమైన సెంచరీ ఇది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఓదార్పు విజయం దక్కించుకుంది. తొలి రెండు టీ 20ల్లో గెలుపొందిన ఆతిథ్య జట్టు ఇప్పటికే సిరీస్‌ను సొంతం చేసుకున్న విషయం విదితమే. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 218/5 స్కోరు చేసింది. కుశాల్, కెప్టెన్ అసలంక (46) నాలుగో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. ఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 211/7 స్కోరుకే పరిమితమై ఓడింది. రచిన్ రవీంద్ర (69), టిమ్ రాబిన్సన్ (37) దూకుడైన ఆరంభం ఇవ్వగా, మిచెల్ (35), చివర్లో జకారీ ఫౌక్స్ (21 నాటౌట్) పోరాడినా కివీస్‌కు ఓటమి తప్పలేదు. అసలంక మూడు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు.

పోంజీ కుంభకోణంలో నలుగురు క్రికెటర్లకు సమన్లు!



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గుజరాత్ పోంజీ స్కీమ్ కుంభకోణంలో నలుగురు క్రికెటర్లను విచారణకు పిలవనున్నారు. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తామని పెట్టుబడులు సేకరించిన బీజెడ్ గ్రూప్ ప్రజలను మోసం చేసింది. ఇందులో రూ. 450 కోట్ల లావాదేవీలకు సంబంధించి సీఐడీ విచారణ చేపట్టింది. ఈ కంపెనీలో గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, రాహుల్ తెవాటియా, సాయి సుదర్శన్, మోహిత్ శర్మలు కూడా పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. దీంతో అందుబాటులో ఉన్న క్రికెటర్లకు సమన్లు జారీ చేసి విచారిస్తామని సీఐడీ పేర్కొంది. గిల్ సుమారు రూ. 2 కోట్లు పెట్టుబడి పెట్టగా.. మిగిలిన వారు స్వల్ప మొత్తాల్లో డిపాజిట్ చేసినట్టు సమాచారం.

అశ్విన్ స్వార్థపరుడు

రిటైర్మెంట్‌పై కలినాన్ ఫైర్



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో సిరీస్ మధ్యలో ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటించడాన్ని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు డారెల్ కలినాన్ తీవ్రంగా తప్పుబట్టాడు. అతడిది స్వార్థ, విద్వేషపూరిత నిర్ణయమని మండిపడ్డాడు. 'సిరీస్ మధ్యలో అశ్విన్ వీడ్కోలు ప్రకటించాల్సింది కాదు. అతడిది స్వార్థపూరిత నిర్ణయంగా అనిపిస్తోంది. చోటు దక్కకపోతే జట్టునే ఇబ్బంది పెట్టేలా విద్వేషపూరితంగా వ్యవహరిస్తాడా? ఒక్క వారం ఆగి.. సిడ్నీ టెస్ట్ తర్వాత గుడ్‌బై పలకాల్సింది'అని కలినాన్ అన్నాడు. ఆఖరి టెస్ట్‌లో టీమిండియా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పాడు.

మేనేజ్ చేసి మేనేజర్ పైకి నెట్టి

(మొదటి పేజీ తరువాయి)



పేర్ని నాని సతీమణి జయసుధ హాజరైన విషయం తెలిసిందే. బియ్యం పక్కదారి పట్టిన ఉదంతంలో తమ తప్పు ఏమీ లేదని, తప్పంతా మేనేజర్‌దేనని ఆమె వాంగ్మూలం ఇచ్చారు. గోదాము మేనేజర్ విషయంలో ఆమె అబద్ధాలు చెప్పేందుకు ప్రయత్నం చేయగా.. పోలీసుల విచారణలో అసలు విషయాలు బయటపడ్డాయి.

ఒప్పందం సాక్షిగా..

బందరు మండలం పొట్లపాలెం గ్రామంలో ఎల్‌పీ నంబరు 89/2, 92/1లో పేర్ని కుటుంబ సభ్యులకు 11 ఎకరాల భూమి ఉంది. ఇందులో పేర్ని జయసుధ పేరు మీద 2.18 ఎకరాలు ఉండగా మిగిలిన భూమి ఆమె తల్లి సత్యనారాయణమ్మ పేరుతో ఉంది. ఇక్కడ పేర్ని నాని అత్త పేరుతో సత్య వేర్ హౌస్, పేర్ని జయసుధ పేరుతో జేఎస్ వేర్ హౌస్ గోదాములు నిర్మించారు. జయసుధ పేరుతో ఉన్న గోదామును పౌరసరఫరాల శాఖకు లీజుకు ఇచ్చారు. 2022లో గోదాముల నిర్మాణం పూర్తికాగా 2023 జనవరి 9న పౌరసరఫరాల శాఖతో లీజు ఒప్పందం చేసుకున్నారు. ఈ లీజు ఒప్పందంలో సాక్షిగా బేతపూడి మానస్ తేజ్, రావి ప్రత్యూష సంతకం చేశారు. 2023 జనవరి నుంచే మానస్ తేజ్ గోదాము మేనేజర్‌గా, ప్రత్యూష గోదాములో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దానికి ఒప్పంద పత్రమే నిదర్శనం. కానీ బుధవారం నాటి పోలీసు విచారణలో పేర్ని జయసుధ తనకు ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆరు నెలల క్రితమే మానస్ తేజ్‌ను మేనేజర్‌గా నియమించామని చెప్పారు. అయితే మానస్ తేజ్ రెండేళ్లుగా మేనేజర్‌గా చేస్తున్నారంటూ పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. దానికి లీజు అగ్రిమెంట్‌ను రుజువుగా చూపారు.

2023 అక్టోబరు నుంచి నగదు లావాదేవీలు

మానస్ తేజ్‌ను మేనేజర్‌గా నియమించిన తర్వాతే గోదాములో బియ్యం పక్కదారి పట్టాయని చెప్పి, ఈ అక్రమంలో తమకు ఏమీ సంబంధం లేదని పేర్ని కుటుంబం బుకాయించే ప్రయత్నం చేసింది. కానీ పోలీసులు సేకరించిన నగదు లావాదేవీల వివరాల్లో 2023 అక్టోబరు నుంచి 2024 నవంబరు వరకు మానస్ తేజ్ బ్యాంకు ఖాతాలో రూ. 22,39,980 జమ అయిందని గుర్తించారు. నెలకు రూ.10 వేలు జీతానికి పనిచేసే వ్యక్తి ఖాతాలో ఏడాది కాలంలో ఇంత పెద్ద మొత్తం జమ కావడం ఎలా సాధ్యమన్న విషయాన్ని పేర్ని కుటుంబం విస్మరించింది. తప్పును అతనిపై తోసివేసేందుకు ప్రయత్నిస్తోంది. మానస్ తేజ్ బ్యాంకు ఖాతాలో జమ అయిన డబ్బు.. బియ్యం విక్రయించడం ద్వారానే సమకూరిందని, దాన్ని అతను పేర్ని కుటుంబ సభ్యులకు అందజేశాడని పోలీసుల విచారణలో స్పష్టమైంది. పోలీసు విచారణలో తాము చెప్పినట్లు 6 నెలల క్రితం మేనేజర్‌గా నియమితుడైన వ్యక్తి ఏడాది కాలంగా బియ్యాన్ని ఎలా విక్రయిస్తున్నాడనే ప్రశ్నకు పేర్ని కుటుంబం సమాధానం ఇవ్వాల్సి ఉంది.

పత్తి కొనుగోలు, జిన్నింగ్ వివరాలివ్వండి

» సీసీఐకి హైకోర్టు ఆదేశం.. విచారణ 6కు వాయిదా

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ముడిపత్తి కొనుగోలు చేయడానికే పరిమితం కాకుండా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ ఉద్దేశాలకు విరుద్ధంగా సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) జిన్నింగ్, ప్రాసెసింగ్ నిర్వహించడం చట్టనిబంధనలకు విరుద్ధమంటూ దాఖలైన వ్యాజ్యంలో పూర్తి వివరాలు సమర్పించాలని సీసీఐని హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరుకు చెందిన జి.సాయి ఆదిత్య ఈ వ్యాజ్యం దాఖలు చేశారు.

అదానీ ఒప్పందాలపై చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం: రామకృష్ణ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అదానీ ఒప్పందాలపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ ఒప్పందాల్లో జరిగిన అవినీతి వ్యవహారాలపై అమెరికా తుది నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని చెప్పడం తగదన్నారు. గురువారం విజయవాడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అమెరికా నివేదిక కోసం ఎదురు చూస్తుంటే.. ఇక్కడ రాష్ట్ర పోలీసు విభాగం, ప్రభుత్వం ఎందుకు?' అని ప్రశ్నించారు.

పొలాలకు పీఎం కుసుమ్!

» 17 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్తు కనెక్షన్లు

» కేంద్ర పథకంలో చేరాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ పంపు సెట్లకు ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్తు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అస్మదీయ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా విస్మరించిన ఈ స్కీమ్‌లో చేరి, రైతులకు లబ్ధి చేకూర్చాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌ను కుసుమ్ స్కీమ్‌లో చేర్చాలని న్యూఅండ్ రెన్యువల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎండీ చక్రధర బాబు ఇటీవల కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖను కోరారు. ఈ వినతి పట్ల కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో రాష్ట్రంలోని 17 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ ప్యానళ్లతో కూడిన విద్యుత్తు పరికరాలు బిగించేలా కార్పొరేషన్ కార్యాచరణ సిద్ధం చేసింది. సంబంధిత ఆదేశాలు అధికారికంగా వెలువడలేదు. అయితే వ్యవసాయానికి స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ కొంతకాలం నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి డిస్కమ్‌ల సీఎండీలకు మౌఖిక ఆదేశాలు వెళ్లాయి. కుసుమ్ కింద సోలార్ విద్యుత్తు అందించేందుకు స్థానికంగా గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తారు. దీని వల్ల ట్రాన్స్‌మిషన్ వ్యయం, నష్టాలు తగ్గుతాయి. రైతులు తమకు అవసరమైన మేర సోలార్ విద్యుత్తు వాడుకుని, మిగిలిన దాన్ని గ్రిడ్ ద్వారా డిస్కమ్‌లకు విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తారు. కాగా, కుసుమ్ పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం అందిపుచ్చుకోలేదు. ఈ స్కీమ్‌లో చేరడంలేదని కేంద్రానికి సీఎం హోదాలో జగన్ అప్పట్లో స్పష్టం చేశారు. తన అస్మదీయ కంపెనీకి వ్యవసాయ మీటర్లను బిగించే పనులు అప్పగించాలన్న రహస్య ఆజెండాతో.. పీఎం కుసుమ్‌లో చేరడం లేదని జగన్ ప్రకటించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉచిత వ్యవసాయ విద్యుత్తు పథకాన్ని కొనసాగిస్తామని చెబుతూనే.. రైతులు వాడే కరెంటును లెక్కగట్టి ప్రతినెలా వారి ఖాతాలో ఆ మొత్తాన్ని జమ చేస్తామని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు గృహాలు, వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు బిగించే పనులు అప్పగించారు. పట్టణాలు, నగరాల్లో విద్యుత్తు వినియోగం నెలకు 200 యూనిట్లు దాటితే మీటర్లు బిగించాలని నిర్ణయించారు. ఆ బాధ్యతలను అదానీ కంపెనీకి అప్పగించారు. వ్యవసాయ విద్యుత్తు మీటర్లను బిగించే పనులు తమ అస్మదీయ సంస్థ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడేలోపే ఆయా సంస్థలు స్మార్ట్ మీటర్ల సరఫరా ప్రారంభించాయి. అయితే ఈ లావాదేవీలు ఇంకా ప్రారంభం కాలేదు.

రైతులు వద్దంటున్నా..

వైసీపీ పాలనలో రైతులు వద్దంటున్నా.. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు అమర్చడం ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టారు. రైతుల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచారు. వీటి నిర్వహణను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నెలనెలా రైతు ఖాతాలో కరెంటు బిల్లుల సొమ్ము పడటం.. అవి డిస్కమ్‌లకు జమ కావడం లాంటి ప్రక్రియ నోచుకోలేదు. వ్యవసాయ విద్యుత్తుకు స్మార్ట్‌మీటర్ల బిగింపుపై రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో పీఎం కుసుమ్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

బాలయ్య డైలాగులతో 'దబిడి దిబిడి'



నందమూరి బాలకృష్ణ అంటేనే డైలాగులకు పెట్టింది పేరు. ఆయన చిత్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన డైలాగ్స్‌తో ఒక పాట తయారు చేస్తే..? ఆయన అభిమానులకు అంతకంటే ఆనందం ఏముంటుంది! అందుకే దర్శకుడు బాబీ కొల్లి 'డాకూ మహారాజ్' చిత్రం కోసం 'దబిడి దిబిడి' పాటను గీత రచయిత కాసర్ల శ్యామ్‌తో రాయించారు. తమన్ స్వరపరిచిన ఈ పాటను వాగ్దేవి అద్భుతంగా పాడారు. అభిమానుల్లో నిలిచే పోయే ఈ మాస్ నృత్యగీతాన్ని బాలకృష్ణ, ఊర్వశి రౌతేలాపై చిత్రీకరించారు. ఈ పాటను గురువారం విడుదల చేశారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ భారీ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది.

వివాహ బంధంలోకి అర్మాన్ మాలిక్



పాపులర్ గాయకుడు అర్మాన్ మాలిక్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రేయసి, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఆష్నా ష్రాఫ్‌ను గురువారం బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడారు. ఈ విషయాన్ని ఇరువురూ తమ ఇన్‌స్టాగ్రామ్ వేదిక ద్వారా ప్రకటించారు. 2017 నుంచి ప్రేమలో ఉన్న వీరిద్దరికీ గతేడాది నిశ్చితార్థం జరిగింది. కాగా, అర్మాన్ తన పాటలతో తెలుగువారికీ సుపరిచితమే. 'అలవైకుంఠపురంలో' సినిమాలోని 'బుట్టబొమ్మ'.. 'అరవింద సమేత'లోని 'అనగనగనగా'.. 'కాటమరాయుడు'లోని 'ఏమో ఏమో'.. 'తొలిప్రేమ'లోని 'నిన్నిలా నిన్నిలా'.. 'హలో' టైటిల్ సాంగ్.. 'ఎమ్మెస్ ధోనీ' సినిమాలోని 'నిన్నే తొలి ప్రేమలో' పాటలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

మా దర్శకులకు శంకర్ ఒరిజనల్ గ్యాంగ్‌స్టర్

యువ దర్శకులు మమ్మల్ని చూసి గర్వపడుతుంటారు. కానీ మేం మాత్రం శంకర్‌ను చూసి పొంగిపోతుంటాం. దర్శకులకు ఆయన ఓ.జి.. ఒరిజనల్ గ్యాంగ్‌స్టర్. పెద్ద కలల్ని సినిమాగా తీస్తే డబ్బులు వెనక్కి వస్తాయని అందరిలో కాన్ఫిడెన్స్ క్రియేట్ చేసిన దర్శకుడాయన. 'గేమ్‌ఛేంజర్‌తో వింటేజ్ శంకర్‌ను చూస్తాం' అన్నారు దర్శకుడు రాజమౌళి. రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ రూపొందించిన 'గేమ్ ఛేంజర్' చిత్రం ట్రైలర్‌ను గురువారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేసిన అనంతరం రాజమౌళి మాట్లాడారు. 'రామ్‌చరణ్ మగధీర' నుంచి 'ఆర్ఆర్ఆర్'కే ఎంతో ఎదిగిపోయారు. ఈ సినిమాలో ఆయన హెలికాప్టర్ నుంచి లుంగీ కట్టుకుని కత్తితో దిగుతుంటే విజిల్స్ ఎలా వస్తాయో నాకు తెలుసు' అన్నారాయన.


రాజమౌళి

'గేమ్ ఛేంజర్' సోషల్ కమర్షియల్, మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఓ పొలిటికల్ లీడర్‌కు, ఓ ఐఏఎస్ ఆఫీసర్‌కు మధ్య జరిగే కథ ఇది. ఈ సినిమాతో రామ్‌చరణ్ మళ్లీ అందరి హృదయాలు గెలుస్తారు' అన్నారు శంకర్.

రామ్‌చరణ్ మాట్లాడుతూ 'రాజమౌళి, శంకర్.. ఏ విషయంలోనూ రాజీ పడని దర్శకులు. ఇద్దరూ పర్ఫెక్షన్ కోసం ప్రయత్నిస్తుంటారు. ఆర్టిస్టులంతా అద్భుతంగా నటించడం వల్లే ఈ సినిమా ఎలివేట్ అవుతోంది. ఈ నెల 10న మీ ముందుకు వస్తున్నాం' అని చెప్పారు. ట్రైలర్‌లో చూపించింది యాభై శాతం మాత్రమేనని, అసలు మేటర్ ఈ నెల 10న తెలుస్తుందని నిర్మాత దిల్ రాజు చెప్పారు.పెట్టిన దానికంటే ఎక్కువ లాభాలు రాబోతున్నాయని తెలిపారు.

మహేశ్‌బాబు - రాజమౌళి సినిమా ప్రారంభం



మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. నగర శివారులోని ఓ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ సినిమా పూజా కార్యక్రమం నిర్వహించినట్లు సమాచారం. మహేశ్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు సామాజిక మాధ్యమాల్లో పలు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. సాధారణంగా మహేశ్ బాబు తన సినిమా ఓపెనింగ్ పూజా కార్యక్రమాలకు వెళ్లరు. ఆయన బదులు నమ్రత హాజరవుతుంటారు. అయితే ఈ రోజు రాజమౌళి సినిమా పూజ కోసం మహేష్ బాబు తన సెంటిమెంట్ మార్చుకొని పూజా కార్యక్రమానికి హాజరయ్యారని అంటున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమానికి సంబంధించిన వీడియోలను, ఫొటోలను చిత్రబృందం అధికారికంగా విడుదల చేయకపోవడం గమనార్హం. కనీసం పూజలో ఎవరెవరు పాల్గొన్నారనే విషయం కూడా బయటకు రాకుండా చిత్రబృందం జాగ్రత్తపడింది. కాగా, భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నారని టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటి వరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంలో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

ప్రపోజ్ చేయమని సవాల్ చేశా



నటి కీర్తి సురేశ్ ఇటీవలే తన చిరకాల ప్రియుడు ఆంటోనీ తట్టిల్‌తో వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. తమ ప్రేమ కథ గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "మాది 15 ఏళ్ల బంధం. ఆర్కుట్ (ఒకప్పటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్)లో చాట్ చేసుకునేవాళ్లం. 12వ తరగతి నుంచే మా మధ్య ప్రేమ చిగురించింది. 2010లో కుటుంబంతో కలసి బయటికి వెళ్లా. అక్కడికి తను వచ్చాడు. భయంతో నన్ను కలవలేకపోయాడు. దమ్ముంటే ప్రపోజ్ చేయమని అప్పుడే సవాల్ చేశా. అలా మొదటిసారి నాకు ప్రపోజ్ చేసి రింగ్ ఇచ్చాడు. పెళ్లయ్యే వరకూ నేను దాన్ని తీయలేదు. ఆ ఉంగరం నేను నటించిన సినిమాల్లో కనిపిస్తుంది. నేను, ఆంటోనీ తగిన సమయం వచ్చే వరకు మా ప్రేమను గోప్యంగా ఉంచాలనుకున్నాం. మేమిద్దరం ప్రేమలో ఉన్నట్లు విజయ్, సమంత, అట్లీ.. ఇలా కొందరికే తెలుసు. ఆంటోనీకి బిడియం ఎక్కువ. తను నాకంటే ఏడేళ్లు పెద్ద. నా కెరీర్ విషయంలో ఆంటోనీ సపోర్ట్ చాలా ఉంది. పెళ్లి చేసుకుని ఒక్కటవ్వడం ఎంతో కాలంగా మేము కన్న కల" అని చెప్పారు.



కొత్త నటుడు కాదు సౌతిండియా స్టార్



ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్, టాలీవుడ్ నిర్మాత నాగవంశీల మధ్య దక్షిణాది, ఉత్తరాది చిత్రపరిశ్రమల మధ్య పోటీపై వాడివేడి చర్చ నడిచిన విషయం తెలిసిందే. ఇదే కార్యక్రమంలో దక్షిణాది హీరోల బాలీవుడ్ అరంగేట్రంపై స్పందిస్తూ 'జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్‌కు కొత్త నటుడు' అంటూ బోనీకపూర్ చేసిన ఓ వ్యాఖ్య చర్చనీయాంశమైంది. 'దక్షిణాది దర్శకులు కొత్త నటుణ్ణి హీరోగా పెట్టి, బాక్సాఫీసు రికార్డు సాధించగలరు, బాలీవుడ్‌లో ఇప్పుడు అలా చేయగలరా?' అని సిద్ధార్థ్ బోనీకపూర్‌ను ప్రశ్నించగా, 'బాలీవుడ్‌లో కూడా ఇలా చేయగలరు, జూనియర్ ఎన్టీఆర్‌ను నిర్మాత ఆదిత్య చోప్రా 'వార్ 2' కోసం తీసుకున్నారు కదా' అని బోనీకపూర్ బదులిచ్చారు. అయితే జూనియర్ ఎన్టీఆర్ సినిమాలకు కొత్త వ్యక్తి కాదని, సౌత్ ఇండియా బిగ్గెస్ట్ స్టార్ అని, ఆయన అగ్ర నిర్మాతలతో సినిమాలు చేశారని సిద్ధార్థ్, నాగవంశీ చెప్పారు. మీ కూతురు జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో ఎన్టీఆర్ సరసన నటించిన విషయం కూడా మర్చిపోయారా అంటూ నెటిజన్లు బోనీకపూర్‌ను ప్రశ్నిస్తున్నారు.

బాలీవుడ్‌ను వదిలేస్తా


అనురాగ్ కశ్యప్

'ఇకపై నేను బాలీవుడ్‌లో సినిమాలు చేయాలనుకోవడం లేదు. దక్షిణాది పరిశ్రమతో కలసి పనిచేస్తాను. ఇన్నేళ్లు పనిచేసినా ఇక్కడ నాకు పెద్దగా గుర్తింపు రాలేదు. బాలీవుడ్‌ను చూస్తుంటే అసహ్యం వేస్తోంది. నిర్మాతలకు ఎంతసేపూ లాభాలు పిండుకోవాలనే యావ తప్ప ప్రయోగాత్మక చిత్రాలకు ఇక్కడ స్థానం లేదు' అని బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ చెప్పారు. బాలీవుడ్ దర్శకులు హిందీ ప్రేక్షకులను నిర్లక్ష్యం చేయడం వల్లే అక్కడి మార్కెట్‌లో దక్షిణాది చిత్రాలు పాగా వేస్తున్నాయని అన్నారు. ప్రేక్షకుల అభిరుచిని పట్టించుకోకపోతే ఇలానే జరుగుతుంది, బాలీవుడ్ సినిమాల్లో పస లేదు, పరభాషా చిత్రాలను కాపీ కొట్టి సినిమాలు చేస్తున్నారు అని అసంతృప్తి వ్యక్తం చేశారు. దక్షిణాదిన మాత్రం కొత్త తరహా కథలతో సినిమాలు వస్తున్నాయి. అక్కడి సినిమాలను హిందీలో డబ్‌చేసి యూట్యూబ్‌లో పెట్టడం ద్వారా ఇక్కడి ప్రేక్షకులను ఆకట్టుకొని మార్కెట్‌ను పెంచుకోగలిగారు' అని అన్నారు.

రేవ్‌పార్టీ కేసులో హేమకు ఊరట

డ్రగ్స్ కేసులో హై కోర్టు స్టే



నటి హేమకు కర్ణాటక హైకోర్టులో భారీ ఊరట లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్నట్లు తనపై నమోదైన కేసులో హేమ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌ను విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ చందనగౌడర్ స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది మే 19న బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని జీఆర్ ఫామ్ హౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీలో నటి హేమ సహా పలువురు పాల్గొన్నట్లు పోలీసులు ప్రకటించారు. కానీ తాను హైదరాబాద్‌లో మిత్రులతో కలిసి ఉన్నానని హేమ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. జూన్ 3న హెబ్బగుడి పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద హేమను అరెస్టు చేశారు. కోర్టు ఆమెకు 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీ విధించడంతో జైలుకు వెళ్లారు. పదిరోజుల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చారు. జైలు నుంచి వచ్చాక పోలీసుల వ్యవహార శైలిపై ఆమె పలు అనుమానాలను వ్యక్తం చేశారు. పార్టీలో తాను డ్రగ్స్ తీసుకోలేదని, శాంపిల్స్‌లోను ఎటువంటి సాక్ష్యాలు లభించలేదని ఆమె హైకోర్టును ఆశ్రయించారు. కేసు నుంచి మినహాయింపు కోరుతూ హేమ దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం విచారించి.. స్టే విధించింది. ప్రాసిక్యూషన్‌కు నోటీసులు జారీ చేసింది.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

తమిళ నటుడికి జైలు శిక్ష



ఓ పాత్రికేయురాలి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో తమిళ నటుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ శేఖర్‌కు ప్రత్యేక కోర్టు విధించిన ఏడాది జైలు శిక్షను మద్రాసు హైకోర్టు ఖరారు చేసింది. ఆ మేరకు దిగువ కోర్టు వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సమర్పించిన అప్పీలు పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. 2018లో ఓ పాత్రికేయురాలిని కించపరిచేలా ఎస్వీ శేఖర్ తన ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై తమిళ పాత్రికేయుల సంరక్షణ సంఘం కార్యదర్శి మిత్రా మొయుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు ఎస్వీ శేఖర్‌కు నెల రోజుల జైలు శిక్ష రూ.15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఎస్వీ శేఖర్ మద్రాసు హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఆ అప్పీలుపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ గురువారం ఎస్వీ శేఖర్ అప్పీలు పిటిషన్‌ను తోసిపుచ్చారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

పుట్టిన వారికి మరణం తప్పదు



జేడీ చక్రవర్తి, నరేశ్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వంలో ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీని మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో ప్రీతీ జంఘియానీ రీ ఎంట్రీ ఇస్తున్నారు. కాగా, ఈ సినిమాకు 'జాతస్య మరణం ధ్రువం' అని టైటిల్ ఖరారు చేసిన మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఒక సంస్కృత పదం నుంచి వచ్చిన ఈ టైటిల్‌కు 'పుట్టిన వారికి మరణం తప్పదు' అని అర్థం. ఈ మూవీకి అర్జున్ రాజా డీవోపీ, జిబ్రాన్, రాజ్ ఆషూ సంగీతం అందించారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.

కర్రతో చితక్కొట్టి.. ఆపై ఉరివేసి

- నడిరోడ్డుపై భర్తను హత్య చేసిన భార్య
- మద్యానికి బానిసై వేధిస్తున్న భర్తకు 'మరణ శిక్ష'

బాపట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త వేధింపులకు ఆ మహిళ విసిగిపోయింది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తానే తుది తీర్పు ఇచ్చింది. భర్తను కర్రతో చితక్కొట్టి.. ఆపై నడిరోడ్డుపై ఉరివేసి చంపేసింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. బాపట్ల జిల్లా అడవులదీవి పోలీసు స్టేషను పరిధిలోని కొత్తపాలేనికి చెందిన అరుణతో గోకర్ణమఠం గ్రామానికి చెందిన అమరేంద్రబాబుకు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమరేంద్ర మద్యానికి బానిసై నిత్యం భార్య అరుణను వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుసార్లు పంచాయితీలు జరిగినా అమరేంద్రబాబు తీరులో మార్పు రాకపోగా, వేధింపులు మరింత పెరిగాయి. అమరేంద్రబాబు, అరుణల మధ్య కొత్తపాలెంలో గతనెల 31న తీవ్ర ఘర్షణ జరిగింది. ఏళ్లుగా ఓపిక పడుతూ వస్తున్న అరుణ భర్తపై కర్రతో తీవ్రంగా దాడి చేసి చంపేసింది. మృతుడి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అరుణ తన భర్తను కర్రతో కొట్టి చంపినట్లు పోలీసులు భావించారు. అయితే తన భర్తను కర్రతో కొట్టిన తర్వాత కూడా అరుణ కోపం చల్లారలేదు. అమరేంద్రను నడిరోడ్డుపైకి లాక్కొచ్చి ఉరివేసి, మెడపై కాలువేసి అదిమిపట్టి చంపినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో గురువారం వైరల్ అయింది. వైరల్ అయిన వీడియో దృశ్యాల ఆధారంగా కేసులో సెక్షన్ల నమోదుపై పోలీసులు పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది.

అరుదైన పగడాలు సీజ్

- ఇద్దరు స్మగ్లర్లు అరెస్ట్: డీఆర్ఐ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సముద్రం లోపల పగడపు దీవుల్లో లభించే అరుదైన పగడాలను సీజ్ చేసి, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) తెలిపింది. ఒంగోలుకు చెందిన ఇద్దరు స్మగ్లర్లు అరుదైన పగడాలు, గుర్రపు ముఖం శంఖాలను ఎగుమతి చేస్తున్న సమాచారం అందింది. నిఘా పెట్టి శ్రీశైలంలో 10 కిలోల అరుదైన నల్ల, మృదువైన పగడాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఆర్ఐ గురువారం తెలిపింది. వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేసి, ఏపీ అటవీ శాఖ అధికారులకు వాటిని అప్పగించినట్లు పేర్కొంది.

పెరిగిన చలి

విశాఖపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. దీనికితోడు ఉత్తర భారతం నుంచి చలిగాలులు మధ్య భారతం మీదుగా తెలంగాణ, దానికి ఆనుకుని కోస్తా ప్రాంతాల వరకు వీస్తున్నాయి. గురువారం ఉదయం అనేక ప్రాంతాల్లో మంచు కురిసింది. వీటన్నింటి ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల చలి వాతావరణం నెలకొంది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో ఉదయంపూట మంచు కురుస్తోందని, కొన్నిచోట్ల చలి ప్రభావం కొనసాగుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

గౌతమ్‌రెడ్డికి సుప్రీం కోర్టులో స్వల్ప ఊరట

న్యూఢిల్లీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తదుపరి విచారణ వరకూ వైసీపీ నేత గౌతమ్‌రెడ్డిని అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమోదైన హత్యాయత్నం కేసు విషయంలో గౌతంరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హాజరయ్యారు.




దశాబ్దాలుగా చెక్కుచెదరని ఐక్యత!

ఆ గ్రామంలో సుమారు 1500 మంది ఉంటారు. ఏటా జనవరి 2వ తేదీ వచ్చిందంటే చాలు.. గ్రామానికి చెందినవారు ఎక్కడ ఉన్నా ఇళ్లకు చేరతారు. అంతాకలిసి రకరకాల పిండి వంటకాలతో విందు ఏర్పాటు చేసుకుంటారు. తొలుత డిసెంబరు 31, జనవరి 1 తేదీల్లో గ్రామంలోని పెంతెకోస్తు చర్చిలో గ్రామస్థులంతా ప్రార్థనల్లో పాల్గొంటారు. జనవరి 2న సహపంక్తి భోజనాలు పెట్టుకుంటారు. ఇంటికో రకం వంటకం తయారు చేస్తారు. వీటిలో బూరె, గారె, పది రకాల స్వీట్లు, ఐదు రకాల హాట్, పులిహోర, బిర్యాని, పప్పు, చికెన్ కర్రీ, సాంబారు, బిస్కట్ ప్యాకెట్, ఐస్‌క్రీం.. ఇలా ఎన్నో ఉంటాయి. ఎవరు స్పాన్సర్ చేసిన ఐటెంను వారు ఆకునిండుగా.. ఆనందంగా వడ్డిస్తారు. ఇవన్నీ తినలేని వారి కోసం కవర్ కూడా ఇస్తారు. గ్రామంలోని జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇదీ.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం ప్రత్యేకత. పది మంది ఉండే ఇంట్లో ఏదైనా కార్యక్రమం చేపట్టాలంటే గొడవలు పడే ఈ రోజుల్లో.. 1500 మందికి జనాభా ఉండే గ్రామంలో దశాబ్దాల తరబడి ఈ సంప్రదాయం కొనసాగుతుండటం విశేషమే.

- తాడేపల్లిగూడెం రూరల్, ఆంధ్రజ్యోతి

బోరుగడ్డ అనిల్‌ను జైల్లో ఉండనీయండి



- అసభ్య పోస్టులు పెట్టడం తప్ప వేరే పనిలేదా?
- బోరుగడ్డ అనిల్ తీరుపై హైకోర్టు అసహనం
- బెయిల్ పిటిషన్ కొట్టివేత

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో వైసీపీ మద్దతుదారు బోరుగడ్డ అనిల్‌పై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సామాజిక మధ్యమాల్లో పెట్టిన పోస్టుల్లో పిటిషనర్ వాడిన భాష, పదజాలాన్ని ఆమోదించలేమని పేర్కొంది. పిటిషనర్ అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నట్లు ఉందని వ్యాఖ్యానించింది. ఆయనను మరి కొంతకాలం జైల్లో ఉండనీయండని ఆదేశించింది. అనిల్ లాంటి వారిపై కనికరం చూపించడానికి వీల్లేదని పేర్కొంటూ బెయిల్ పిటిషన్ కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుటుంబసభ్యులపై అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డ అనిల్ పై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అనిల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ సెక్షన్ 111 వ్యవస్థీకృత నేరం మినహా పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు వ్యవస్థీకృత నేరం కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదన్నారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయి రోహిత్ వాదనలు వినిపించారు."పిటిషనర్‌కు నేరచరిత్ర ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 22 కేసులు ఉన్నాయి. గతంలో ఓ కేసులో పోలీస్ కస్టడీ నుంచి తప్పించుకున్నారు. అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో నమోదైన రెండు కేసుల్లో ఆయనపై పోలీసులు చార్జిషీట్లు కూడా దాఖలు చేశారన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 111 ప్రయోగం చెల్లుబాటు అవుతుంది. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి" అని కోరారు. ఈ వాదనతో ఏకీభవించిన జడ్జి...అనిల్ బెయిల్ పిటిషన్‌ను కొట్టేశారు.

విజయ్ కుమార్ రెడ్డిపై కేసు వివరాలు ఇవ్వండి

- ఏసీబీ అధికారులకు హైకోర్టు ఆదేశం.. విచారణ 6కి వాయిదా

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జగన్ పత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలతో సమాచార పౌరసంబంధాల (ఐ అండ్ పీఆర్) శాఖ పూర్వ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డిపై నమోదు చేసిన కేసు పూర్తి వివరాలు తమ ముందుంచాలని ఏసీబీ అధికారులను గురువారం హైకోర్టు ఆదేశించింది. విచారణను 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వం జగన్ పత్రిక, చానల్‌కు అనుచిత లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, సాక్షి మీడియా గ్రూపులో పనిచేస్తున్న పలువురు సిబ్బందిని ఐ అండ్ పీఆర్, ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులుగా చట్టవిరుద్ధంగా నియమించారంటూ.. అప్పటి కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డిపై ఏపీ మీడియాఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఢిల్లీబాబురెడ్డి ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున న్యాయవాది మహేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌ను అరెస్టు చేస్తారనే ఆందోళన ఉందని.. మధ్యంతర ముందస్తు బెయిల్ కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు.

ఎస్పీడీసీఎల్‌లో 200 కోట్ల అవినీతి

- విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు
- సాక్ష్యాధారాలతో విజిలెన్స్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి లేఖ

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ పవర్ డిస్కంల పరిధిలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో విద్యుత్ పరికరాల (ఫైర్ వెడ్జ్ క్లాంపుల) కొనుగోలులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కోరారు. ఈ మేరకు గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఆయన లేఖ రాశారు. 'ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో ప్రస్తుతమున్న క్లాంపులన్నీ మార్చి, కొత్తవి ఏర్పాటు చేయడంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారు. రూ.కోట్లు స్వాహా చేస్తున్నారు. పాతవాటిని మార్చాల్సిన అవసరం లేకపోయినా ఈ పనిని సృష్టించి, ఏర్పాటు చేస్తున్నారు. చాలా అత్యవసరం అంటూ నిర్మాణ విభాగం అధికారుల నుంచి ప్రతిపాదనలు చేయించారు. ఎస్ఈల సిఫారసులతో అగ్రిమెంట్లు తీసుకుంటున్నారు. రూ.5కోట్లు దాటితే విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి అవసరం. కాబట్టి ఒక్కో పని రూ.5కోట్లలోపు ఉండేలా విడివిడిగా అగ్రిమెంట్లు కుదుర్చుకుంటున్నారు. ఒక్క ఎస్పీడీసీఎల్ పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో రూ.200 కోట్ల పైబడి ఎటువంటి టెండరు లేకుండా నేరుగా కాంట్రాక్టర్లుకు చెల్లిస్తున్నారు. మార్కెట్ ధర కంటే 5-10 రెట్లు ఎక్కువ ధరకు కొటేషన్లు తెప్పించి, ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారు. గుంటూరులోని రాజేశ్వరి ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్స్ అనే కంపెనీ ద్వారా ఈ దోపిడీ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.200కు లభిస్తున్న పరికరానికి రూ.1,867, రూ.275 వచ్చే వస్తువును రూ.2,583 కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు' అని ఫిర్యాదు చేశారు. ఎస్పీడీసీఎల్, కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న ధరల పట్టికను తన ఫిర్యాదుకు జత చేసి, ఈ దోపిడీపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

రూ.10 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు అరెస్టు

బాపట్ల రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సకాలంలో పోలీస్ టెక్ సిబ్బంది స్పందించడంతో రూ.17,90,680 నగదు ఫ్రీజ్ చేయించగలిగారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ.7లక్షల నగదు, స్మార్ట్ ఫోనులు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ తుషార్ డూడి వివరాలను తెలిపారు. 'రేపల్లె సబ్‌డివిజన్ చుండూరు పోలీసుస్టేషన్ పరిధిలోని వేటపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఆచార్యుడు గొంది లక్ష్మీవరప్రసాదరావుపై సైబర్ నేరగాళ్లు వల వేశారు. ఫోన్‌లో మనీ ల్యాండరింగ్ కేసు అంటూ బెదిరించారు. సీబీఐ విచారణ అంటూ భయపెట్టారు. కేసు నుంచి బయటపడేయాలంటే రూ.74 లక్షలు తమ ఖాతాకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బెదిరిపోయిన వరప్రసాదరావు సొమ్ము బదిలీ చేశారు. వెంటనే చుండూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని వెంటనే బాపట్ల జిల్లా టెక్నికల్ బృందానికి సమాచారాన్ని చేరవేశారు. టెక్ బృందం బ్యాంకు వారితో సమన్వయం చేసుకొని రూ.17,90,680 నగదును ఫ్రీజ్ చేయించింది. మిగతా నగదు ఐదు బ్యాంక్ ఖాతాలకు, వాటి నుంచి వేర్వేరు ఖాతాలకు నగదు బదిలీ జరిగిందని గుర్తించింది. కేసు విచారణలో నిందితులు రాజస్థాన్, ముంబయిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చుండూరు సీఐ నేతృత్వంలో ఒక జట్టు రాజస్థాన్‌కు, ఆర్ఐ శ్రీకాంత్ నేతృత్వంలో మరో బృందం ముంబయికి వెళ్లింది. రాజస్థాన్ వెళ్లిన జట్టు ఏ 3 రమేశ్‌ను పట్టుకొని అతని వద్ద రూ.2 లక్షలు, ఏ 4 శ్రావణ్‌కుమార్‌ను వద్ద రూ.5 లక్షలు రికవరీ చేశారు. ఆ క్రమంలో సదరు నిందితుల ఖాతాలను పరీక్షించగా... వారు దేశంలోని 8 రాష్ట్రాలలోని 12 పోలీసుస్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలకు పాల్పడినట్లు తేలింది. వీరిలో ఏ 3 మొత్తంగా ఆరు కేసుల్లో రూ.15 లక్షలు, అలాగే ఏ 4 మొత్తంగా 7 కేసుల్లో రూ.35 లక్షలు తమ ఖాతాలకు వేయించుకున్నట్లు గుర్తించారు. వీరిద్దరి నుండి చుండూరు కేసుకు సంబంధించి రూ.7 లక్షల రూపాయల నగదు బదిలీ జరగగా ఆ మొత్తాన్నీ రికవరీ చేశారు. మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటాం' అని ఎస్పీ డూడి తెలిపారు.



బ్యాంకులకు నిధుల కొరత

రూ.2 లక్షల కోట్లకుపైగా లోటు.. ఆదుకోవాలని ఆర్‌బీఐకి వినతి

న్యూఢిల్లీ: అందరికీ అప్పులిచ్చే బ్యాంకులే ఇప్పుడు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజం. ప్రస్తుతం ఈ కొరత రూ.2 లక్షల కోట్లకుపైగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి సంబంధించి 2024 డిసెంబరు 15 నాటికి కంపెనీలు, వ్యాపార సంస్థలు, వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు ముందస్తు పన్ను (అడ్వాన్స్ ట్యాక్స్) కింద రూ.3.15 లక్షల కోట్లు చెల్లించారు. దీనికి తోడు పండగల సీజన్ ఖర్చుల కోసం కంపెనీలు, వ్యక్తిగత వినియోగదారులు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలోనే నగదు వెనక్కి తీసుకున్నారు. ఇది చాలదన్నట్టు డాలర్‌తో రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద మొత్తంలో రూపాయలతో డాలర్లు కొనుగోలు చేసి.. మార్కెట్లో విడుదల చేయాల్సి వస్తోంది. ఈ మూడు కారణాలతో ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో రూ.2 లక్షల కోట్లకు పైగా నిధుల కొరత ఏర్పడిందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

పనిచేయని సీఆర్ఆర్ కోత: గత నెల (డిసెంబరు)లో ప్రకటించిన ద్రవ్య విధాన సమీక్షలో తమ డిపాజిట్లలో బ్యాంకులు తన వద్ద హామీగా ఉంచాల్సిన నగదు నిల్వల నిష్పత్తిని ఆర్‌బీఐ 4.5 శాతం నుంచి 4 శాతానికి కుదించింది. దీంతో గత నెల 28వ తేదీ నాటికి బ్యాంకులకు అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి వచ్చాయి. అయినా ప్రస్తుతం బ్యాంకులకు నిధుల కొరత తప్పడం లేదు. దీంతో స్వల్పకాలిక నిధుల సర్దుబాటు కోసం, బ్యాంకుల మధ్య జరిగే ఓవర్‌నైట్ కాల్ మనీ వడ్డీ రేటు గత నాలుగేళ్లలో ఎన్నడూ లేని విధంగా 6.34 శాతానికి చేరింది.

ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు బ్యాంకులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎక్కువ వడ్డీ చెల్లిస్తాం, మా బ్యాంకులో డిపాజిట్ చేయండని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి. అయితే ఐపీఓ మార్కెట్ బూమ్‌తో ఆ ప్రయత్నాలేవీ పెద్దగా ఫలించడం లేదు. దీంతో మా దగ్గర ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలు తీసుకుని, అందుకు సమానమైన రూపా

ఆదుకోండి ప్లీజ్..


యలు ఇవ్వమని ఆర్‌బీఐని కోరినట్టు సమాచారం. దీంతో డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకోవడంతో పాటు ఆర్‌బీఐ ఫారెక్స్ నిల్వలూ పెరుగుతాయని చెబుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై ఆర్‌బీఐ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ఉలుకూ పలుకూ లేక పోవడం బ్యాంకులను గాభరా పెడుతోంది. దీంతో ప్రస్తుత నిధుల కొరతను ఎలా అధిగమించాలో పాలుపోవడం లేదని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

కాకినాడ యూనిట్-3లో ఉత్పత్తి షురూ: దివీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్ కాకినాడ సమీపంలోని ఒంటిమామిడి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన యూనిట్-3లో ఉత్పత్తి ప్రారంభించినట్లు దివీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. ఈ నెల 1న ఈ ప్రాజెక్టులో తొలి దశ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపింది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్స్ ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) ఉత్పత్తి కోసం కంపెనీ మూడు దశల్లో 500 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు అమలు చేస్తోంది. ఇందులో ఇప్పటికే 200 ఎకరాల్లో తొలి దశను పూర్తి చేసింది. ఈ కొత్త ప్రాజెక్టు కోసం కంపెనీ రూ.1,200 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకు ఖర్చు చేయనుంది.

రిలయన్స్ జియో రూ.40,000 కోట్ల ఐపీఓ!

రూ.10 లక్షల కోట్లకు కంపెనీ మార్కెట్ విలువ



న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్).. తన టెలికాం సేవల అనుబంధ విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌ను మెగా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఏడాది ద్వితీయార్ధంలో కంపెనీ ఐపీఓకు రావచ్చని, తద్వారా రూ.35,000-40,000 కోట్లు సమీకరించే అవకాశం ఉందని సమాచారం. అనగా, దేశీయ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ కానుంది. ఐపీఓలో భాగంగా రిలయన్స్ జియో మార్కెట్ విలువను రూ.10 లక్షల కోట్ల స్థాయిలో లెక్కించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. పలు బ్రోకరేజీ సంస్థలు ఇప్పటికే జియో విలువను రూ.8.5 లక్షల కోట్ల స్థాయిలో అంచనా వేశాయి. ఐపీఓలో భాగంగా జియో తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులకు చెందిన ఈక్విటీ వాటాను సైతం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎ్‌ఫఎస్) పద్ధతిన విక్రయించే అవకాశం ఉంది. ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ఆలోచన కూడా ఉన్నట్లు, ఇందుకోసం ప్రాథమిక చర్చలు కూడా ప్రారంభమైనట్లు సమాచారం. ఒకవేళ ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా నిధులు సమీకరిస్తే, ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ ప్రస్తుత అంచనా కంటే తగ్గవచ్చు. ఆర్ఐఎల్ డిజిటల్ సేవల అనుబంధ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్‌లో భాగంగా రిలయన్స్ జియో ఉంది. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), సిల్వర్ లేక్, కేకేఆర్, ముబాదల వంటి అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజాలకు జియోలో వాటాల విక్రయం ద్వారా అంబానీ 2020లో 1,800 కోట్ల డాలర్లు సమీకరించారు. ప్రస్తుతం జియోలో 33 శాతం వాటా విదేశీ ఇన్వెస్టర్ల చేతుల్లో ఉంది.

ఇండో ఫార్మ్ ఐపీఓకు 227 రెట్ల బిడ్లు

ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ రూ.260 కోట్ల ఐపీఓకు ఇన్వెస్టర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. గురువారంతో ముగిసిన ఈ పబ్లిక్ ఇష్యూకు ఏకంగా 227.57 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. ఐపీఓలో భాగంగా కంపెనీ 84.70 లక్షల షేర్లను విక్రయానికి పెట్టగా.. ఇన్వెస్టర్ల నుంచి 192.75 కోట్లకు పైగా షేర్ల కొనుగోలుకు బిడ్లు వచ్చాయి. గడిచిన 11 నెలల్లో అత్యధిక రెట్ల సబ్‌స్క్రిప్షన్ సాధించిన ఐపీఓ ఇదే. 2024 ఫిబ్రవరిలో విభోర్ స్టీల్ ట్యూబ్స్ ఐపీఓ 320 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కాగా, కోల్‌కతాకు చెందిన ఆగ్రో కంపెనీ రీగాల్ రిసోర్సెస్ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.190 కోట్ల తాజా ఈక్విటీతో పాటు ప్రమోటర్‌కు చెందిన 90 లక్షల షేర్లను సైతం విక్రయించాలనుకుంటోంది.

కేతన్ పరేఖ్ మరో స్కామ్



- ఫ్రంట్ రన్నింగ్ స్కీమ్ ద్వారా రూ.65.77 కోట్ల అక్రమార్జన
- ఆయనతో సహా ముగ్గురిపై నిషేధం విధించిన సెబీ

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో భారీ అక్రమాలకు పాల్పడిన వ్యక్తుల్లో ప్రముఖంగా వినిపించే పేర్లు హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్. డాట్ కామ్ బూమ్ (1999-2000) సమయంలో మార్కెట్‌ను శాసించిన కేతన్ పరేఖ్.. పలు ఆర్థిక మోసాలకు పాల్పడి జైలుకెళ్లడంతో పాటు సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి 14 ఏళ్ల పాటు నిషేధించబడ్డారు. అయినా, ఆయన తీరు మారలేదు. ఈ మార్కెట్ మాయావి మరో కుంభకోణం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫ్రంట్ రన్నింగ్ స్కీమ్ ద్వారా రూ.65.77 కోట్లు అక్రమంగా ఆర్జించిన కేసులో కేతన్ పరేఖ్ సహా ముగ్గురు వ్యక్తులను సెబీ తక్షణమే సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించింది. సింగపూర్‌కు చెందిన ట్రేడర్ రోహిత్ సాల్‌గావ్‌కర్, అశోక్ కుమార్ పొద్దార్ కూడా ఈ నిషేధిత జాబితాలో ఉన్నారు. అలాగే, ఈ ముగ్గురు ఇకపై ఏ మార్కెట్ ఇంటర్మీడియేటరీ సంస్థతో ప్రత్యక్షం లేదా ప్రత్యక్షంగా అనుబంధం కాకుండా నిషేధించింది. అంతేకాదు, తాజా స్కామ్‌లో అక్రమంగా ఆర్జించిన మొత్తం సొమ్మును కక్కాలని పరేఖ్ సహా 22 సంస్థలు, వ్యక్తులను ఆదేశిస్తూ సెబీ షోకాజు నోటీసులు జారీ చేసింది. వీరి బ్యాంక్ ఖాతాలను ఇప్పటికే జప్తు చేసింది. ఏదైనా బడా పెట్టుబడి సంస్థ ఏ కంపెనీలో పెట్టుబడులు పెట్టబోతున్నారనే సమాచారాన్ని బ్రోకర్ లేదా ఎవరైనా మార్కెట్ అనలిస్ట్ ద్వారా ముందస్తుగా తెలుసుకుని, ఆ కంపెనీ షేర్లలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అయాచితంగా లబ్ధి పొందడాన్నే ఫ్రంట్ రన్నింగ్ కార్యకలాపాలుగా పిలుస్తారు. కేతన్ పరేఖ్ కూడా ఇదే వ్యవహారానికి పాల్పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 2.5 లక్షల కోట్ల డాలర్ల విలువైన పెట్టుబడులను నిర్వహిస్తోన్న ఓ అమెరికన్ ఎఫ్‌పీఐ (ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్).. భారత కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలుసుకుని వాటిలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అక్రమంగా లబ్ధిపొందారు. ఈ ఎఫ్‌పీఐతో సత్సంబంధాలున్న రోహిత్ సాల్‌గావ్‌కర్ ద్వారా పెట్టుబడుల సమాచారాన్ని తెలుసుకుని, పరేఖ్ ఇతరుల ద్వారా ట్రేడింగ్‌కు పాల్పడినట్లు.. 2021 జనవరి నుంచి 2023 జూన్ వరకు ఈ తతంగం నడిచినట్లు సెబీ గుర్తించింది.

హ్యుండయ్ క్రెటా ఈవీ



దక్షిణ కొరియా ఆటో దిగ్గజం హ్యుండయ్.. భారత మార్కెట్లోకి క్రెటా ఎలక్ట్రిక్ వెర్షన్‌ను ఆవిష్కరించింది. ఈ నెల 17న ప్రారంభం కానున్న భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో క్రెటా ఈవీని అధికారికంగా విడుదల చేయనుంది. కంపెనీ ఇప్పటికే భారత్‌లో హ్యుండయ్ కోనా, ఐయోనిక్ 5 కార్లను విక్రయిస్తోంది. 51.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన క్రెటా ఈవీ ఒకసారి చార్జింగ్‌తో 473 కిలోమీటర్లు, 42 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన కారు 390 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది. ఈ కారు ధర రూ.20 నుంచి రూ.30 లక్షల మధ్యన ఉండొచ్చని అంచనా.

ఆర్‌వీఎన్ఎల్‌తో విశాఖ పోర్టు ఒప్పందం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్)తో విశాఖపట్నం పోర్టు గురువారం రూ.300 కోట్ల విలువైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సరుకు రవాణాలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నగరంలోని వివిధ జంక్షన్ల నుంచి వాహనాలు నేరుగా పోర్టులోకి రావడానికి తిరిగి బయటకు వెళ్లడానికి వీలుగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా సీ హార్స్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో 11 లెవెల్ క్రాసింగ్‌లు ఉన్నాయి. వీటిని అధిగమించేలా ఫై వంతెన వస్తుంది.

బిజినెస్

కొనుగోళ్ల కిక్

- సెన్సెక్స్ 1,436 పాయింట్లు అప్
- 24,000 ఎగువకి నిఫ్టీ

ముంబై: దలాల్‌స్ట్రీట్‌లో బుల్ కొత్త ఏడాది వేడుక వరుసగా రెండో రోజూ కొనసాగింది. కొనుగోళ్ల 'కిక్'తో సెన్సెక్స్ రెండు వారాల గరిష్ఠానికి ఎగబాకింది. గురువారం ట్రేడింగ్‌లో సూచీ ఏకంగా 1,436.30 పాయింట్లు (1.83 శాతం) పెరిగి 79,943.71 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌కు గడిచిన నెల రోజులకు పైగా కాలంలో ఇదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. ఆఖరి అర గంటలో సూచీ 1,525 పాయింట్ల వృద్ధితో మళ్లీ 80,000 మైలురాయిని దాటినప్పటికీ, చివరి వరకు ఆ స్థాయిని నిలబెట్టుకోలేకపోయింది. నిఫ్టీ విషయానికొస్తే, 445.75 పాయింట్ల (1.88 శాతం) లాభంతో 24,188.65 వద్దకు చేరుకుంది. 2025సంవత్సరం తొలి ట్రేడింగ్ సెషన్ (బుధవారం)లోనూ సెన్సెక్స్ 368 పాయింట్లు, నిఫ్టీ 98 పాయింట్లు బలపడ్డాయి. ఈ రెండు రోజుల్లో స్టాక్ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.8.52 లక్షల కోట్లు వృద్ధి చెంది మొత్తం రూ.450.47 లక్షల కోట్లకు చేరింది.

ఆగని రూపాయి పతనం

భారత కరెన్సీ వరుసగా 8వ రోజూ పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ గురువారం మరో 9 పైసలు క్షీణించి రూ.85.73 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ


హైదరాబాద్	525	విజయవాడ	550
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	563	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	101	విజయవాడ	108
వరంగల్	101	గుంటూరు	108
కరీంనగర్	101	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	88
కర్నూలు	101	నెల్లూరు	92
విశాఖపట్నం	97	అనంతపురం	92
గోదావరి	108		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,330 ▲	71,800 ▲	98,000 ▼
విజయవాడ	79,500 ▲	75,000 ▲	89,500 ▼
విశాఖపట్నం	77,610 ▲	71,140 ▲	88,930 ▲
రాజమండ్రి	78,330 ▲	71,800 ▲	89,500 ▲
ప్రొద్దుటూరు	78,800 ▲	72,920 ▲	89,500 ▲
ముంబై	77,079 ▲	70,604 ▲	87,167 ▲



కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రులు, సీఎస్ విజయానంద్

కనిగిరిలో బయోగ్యాస్ ప్లాంటు

కంప్రెస్డ్ బయో గ్యాస్ ఉత్పత్తికి ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతంలో 4 వేల ఎకరాల భూమి కేటాయించాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో ఈ తరహావి 500 ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి రిలయన్స్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ పథకం అమలుపై గురువారం కేబినెట్ చర్చించింది. కనిగిరిలో బీడు భూములు ఎక్కువగా ఉన్నందు అక్కడ ఒక రకమైన గడ్డి పెంచి దాని ద్వారా రిలయన్స్ సంస్థ బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తుంది. గడ్డి పెంపకానికి తీసుకున్న వాటిలో ప్రభుత్వ భూములుంటే ఏడాదికి ఎకరానికి రూ.15వేలు, ప్రైవేటు భూములకు రూ.30 వేలు కౌలు రూపంలో రిలయన్స్ చెల్లిస్తుంది. వీలైతే ఈ పథకాన్ని ఈ నెల 8న ప్రధాని మోదీ చేతుల మీదుగా విశాఖలో ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. కౌలు ఒప్పందాలు పూర్తికాకపోతే ప్రారంభం వాయిదాపడే అవకాశం ఉంది. కనిగిరితోపాటు ఉదయగిరి ప్రాంతంలోనూ ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని భావిస్తున్నట్లు విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సౌరవిద్యుత్‌కు ఉపయోగపడే భూములు ఇవ్వబోమన్నారు.

భారీ పెట్టుబడులు సాకారం!

- పట్టాలెక్కనున్న బీపీసీఎల్, టీసీఎస్ ప్రాజెక్టులు
- రామాయపట్నంలో భారీ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు
- విశాఖలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కార్యకలాపాలు
- రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- కనిగిరిలో కంప్రెస్డ్ బయో గ్యాస్ విద్యుత్ ప్లాంటు
- కాకినాడ, నంద్యాల, కడప, పత్తికొండలో కొత్తగా రానున్న ఇంధన ఆధారిత ప్లాంట్లు

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రానున్నాయి. ప్రతిష్ఠాత్మక బీపీసీఎల్, టీసీఎస్ ప్రాజెక్టులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ఈ రెండు ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేసింది. ఇవి కార్యరూపం దాలిస్తే రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రమే మారిపోతుంది. అనుబంధ పరిశ్రమల రాకతో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీయనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిపాదనల ప్రకారం.. నెల్లూరు జిల్లా రామాయపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ.96,862 కోట్ల అతి భారీ పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు కానుంది. మొత్తం 9మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో ఏర్పాటు చేసే ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రో కెమికల్స్ యూనిట్స్, క్రూడాయిల్ టెర్మినల్, గ్రీన్‌హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులను నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే 20 ఏళ్లలో రాష్ట్రానికి రూ.88,747 కోట్ల ఆదాయం లభిస్తుంది. 2,400 మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2029లోపే ఈ మొత్తం ప్రాజెక్టును పూర్తిచేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. బీపీసీఎల్ కూడా ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసేందుకు చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. రూ.6,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రీ-ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు, రామాయపట్నంలో భారీ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏర్పాటు ప్రతిపాదనను కూడా బీపీసీఎల్ బోర్డు ఇప్పటికే ఆమోదించింది. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కోసం ఈ సమాచారాన్ని అందిస్తూ వెంటనే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఈ), బోంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (బీఎస్ఈ)లకు ఇటీవలే లేఖ కూడా రాసిం ది. ఈ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద కసరత్తే చేశారు. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమబెంగాల్ దీనికోసం పోటీపడగా.. చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చలు జరిపారు. ప్రాజెక్టుకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని, ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుకు కావలసిన వనరులు కూడా రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని వివరించారు. తర్వాత రాష్ట్ర అధికారుల బృందం బీపీసీఎల్ ప్రతినిధులతో పలు దఫాలు సంప్రదింపులు జరిపింది. దరిమిలా బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీని రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సానుకూలత వ్యక్తం చేసింది. అయితే మచిలీపట్నంలో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా.. బీపీసీఎల్ మాత్రం రామాయపట్నంపై ఆసక్తి చూపింది. సీఎం కూడా అంగీకరించారు. రాష్ట్ర మంత్రిమండలి పచ్చజెండా ఊపింది.

విశాఖలో టీసీఎస్‌కూ ఓకే

దిగ్గజ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) విశాఖలో రూ.80కోట్లతో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలోనే ఈ సంస్థ కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి. తొలిదశలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. తర్వాత టీసీఎస్‌ను మరింత విస్తరిస్తారు. అప్పుడు 10వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. విశాఖలోని రుషికొండ ఐటీపార్కు హిల్-2పై నాన్ సెజ్ ఏరియాలో డల్లాస్ టెక్నాలజీస్ సంస్థ నిర్మించిన భవనంలో లీజు ప్రాతిపదికన ఆఫీసు ఏర్పాటుకు టీసీఎస్ ముందుకు రాగా.. ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే డల్లాస్ భవనంలో 1400 మంది వరకు మాత్రమే పనిచేయడానికి స్థలం సరిపోతుంది. ఈ నేపథ్యంలో టీసీఎస్ ప్రతిపాదనల మేరకు సీటింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు పక్కనే ఖాళీగా ఉన్న స్థలాన్ని అదనంగా కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్రంలో ఐటీ కేంద్రంగా అభివృద్ధి సాధిస్తున్న విశాఖలో యాంకర్ కంపెనీలు లేకపోవడం ఇంతవరకు పెద్ద లోటుగా ఉండేది. ఈ లోటును భర్తీ చేయడంపై ఐటీ మంత్రి లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖకు టాప్-10 కంపెనీలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని గతంలోనే ప్రకటించారు. ఈ క్రమంలోనే టీసీఎస్ ప్రతినిధులతో చర్చలు జరిపి. వారిని విశాఖకు ఆహ్వానించారు. ఇన్ఫోసిస్‌కు పక్కనే టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభమైతే విశాఖ ఐటీ కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ భారీ ప్రాజెక్టులు కార్యకలాపాలను ప్రారంభిస్తే.. అనుబంధ పరిశ్రమలతో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుంది. వేలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- పునరుత్పాదక విద్యుత్ రంగంలో కొత్త టెక్నాలజీతో దేశంలో మొదటిసారిగా రెండు ప్లాంట్లను హీరో సంస్థ మన రాష్ట్రంలో ప్రారంభించబోతోంది. మంత్రివర్గ సమావేశంలో అధికారులు ఈ విషయం తెలిపారు. పవన, సౌర విద్యుత్, బ్యాటరీ ప్రాజెక్టుల కలయికతో కడప, నంద్యాల జిల్లాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. బ్యాటరీలను కూడా కలిపి ఇంతవరకూ దేశంలో ఎక్కడా ఈ తరహా ప్లాంట్లు లేవు. సౌర, పవన విద్యుత్‌ను ఈ బ్యాటరీల్లో నిల్వ చేసి వాటిని గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. 249 మెగావాట్ల సామర్థ్యంతో ఇవి ఏర్పాటు కానున్నాయి.

మరిన్ని నిర్ణయాలు..

- మెస్సర్స్ ఏఎం గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ కాకినాడలో ఒక ఎంఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమ్మోనియా తయారీ సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం.
- రెండు గిగావాట్ ఎలక్ట్రొలైజర్ తయారీ సామర్థ్యంతో కాకినాడలో ప్లాంటు ఏర్పాటుకు జూన్ కాకెరిల్ గ్రీన్‌కో హైడ్రోజన్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు గ్రీన్‌సిగ్నల్.
- టాటా పవర్ రెన్యువబుల్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు, పెద్ద హుల్తీ గ్రామాల్లో 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదముద్ర.
- బస్సుల బాడీ బిల్డింగ్ సంస్థ ఆజాద్ ఇండియా మొబిలిటీ లిమిటెడ్ రూ.1,046 వేల కోట్ల పెట్టుబడితో శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేసే ప్లాంటుకు 70.7 ఎకరాలు కేటాయింపు. ఎకరా ధర రూ.38.37 లక్షలు.
- బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో ఉడ్ ఫ్యాక్టరీ స్థాపనకు అంగీకారం.



కేబినెట్ సమావేశంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతిలో 2,723 కోట్ల పనులు

పాత టెండర్లు రద్దు.. కొత్త వాటికి ఆమోదం

- చిత్తూరు జిల్లాలో ఐఆర్ బెటాలియన్‌కు 40 ఎకరాలు
- వంద పడకలకు తిరుపతి ఈఎస్ఐ అప్‌గ్రేడ్
- పిఠాపురం అథారిటీకి అదనపు పోస్టులు
- రైల్వేజోన్‌కు ఈ నెల 8న ప్రధాని శంకుస్థాపన
- కేబినెట్ వివరాలు తెలిపిన మంత్రి పార్థసారథి



అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో అమరావతి పునర్నిర్మాణ పనులను పరుగులు పెట్టించేలా పలు నిర్ణయాలను రాష్ట్ర మంత్రివర్గం తీసుకుంది. ఆ వివరాలను గురువారం పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వెల్లడించారు. అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా రూ.2,723 కోట్ల విలువైన ఇంజనీరింగ్ పనులకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి చెప్పారు. అమరావతిలో పాత టెండర్లు రద్దు చేసి కొత్త వాటిని పిలవనున్నట్లు తెలిపారు.

ముఖ్యమైన తీర్మానాలు..

- తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు రూ. 7.44 కోట్ల అంచనా వ్యయంతో అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం.
- ఈ మొత్తం వ్యయాన్ని 7:1 నిష్పత్తిలో ఈఎస్ఐ కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి.
- ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపీఎంఆర్‌యూడీఏ) చట్టం-2016కు సవరణ ప్రతిపాదిస్తూ రూపొందించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు ఆమోదం.
- కొత్తగా ఏర్పడిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో (పీఏడీఏ) పరిపాలన సజావుగా సాగేందుకు, అభివృద్ధి పనులు మరింత మెరుగ్గా అమలయ్యేందుకువీలుగా 19 ప్రభుత్వ పోస్టుల మంజూరుకు సమ్మతి.
- చిత్తూరు జిల్లా యాదమర్రి మండలం జంగాలపల్లె గ్రామంలో 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కొని షరతులకు లోబడి ఐఆర్ బెటాలియన్ స్థాపనకు హోంశాఖకు ఉచితంగా బదిలీ చేయడానికి చేసిన ప్రతిపాదనకు ఆమోదం.
- 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం కోసం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో 6.35 ఎకరాల భూమిని డీజీ, ఈఎస్ఐ హాస్పిటల్, న్యూఢిల్లీ పేరిట బదలాయించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదముద్ర.
- కడప జిల్లా అక్కయ్యపల్లి గ్రామంలో రెండు ఎకరాల భూమిని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం. గతంలో టీడీపీ కార్యాలయానికి మంజూరు చేసిన ఈ భూమిని గత ప్రభుత్వం రద్దు చేసింది. దీనికోసం దీనికోసం జీవో నంబర్ 18 తెచ్చింది. దానిని రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది.

సదస్సులపై సమీక్ష..

గత ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధ్వంసక విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఘోరంగా తయారైందని చంద్రబాబు అన్నారు. రెవెన్యూ సదస్సుల అమలు తీరుపై సీఎం చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. దాదాపు 1 లక్షకుపైగా పిటిషన్లు ఈ సదస్సుల్లో వచ్చాయనీ, 22ఏ, ల్యాండ్ సర్వే వివాదాలు, ల్యాండ్ రికార్డులకు సంబంధించిన పిటిషన్లు వాటిలో ఎక్కువగా ఉన్నాయని సీఎంకు అధికారులు తెలిపారు. అయితే, సదస్సులు పూర్తి అయ్యేంతవరకూ వేచి ఉండకుండా, సత్వరమే పరిష్కరించేందుకు అవకాశం ఉన్న పిటిషన్లను వెంటనే చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, ఈ నెల 8న తన విశాఖ పర్యటనలో రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేస్తారని మంత్రి పార్థసారథి తెలిపారు.

తల్లికే తొలి వందనం!

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి పాఠశాలలు తెరిచేసమయంలో తల్లుల ఖాతాలో 'తల్లికి వందనం' డబ్బులు వేస్తామని చంద్రబాబు తెలిపారు. వాగ్దానం ప్రకారం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ డబ్బులు ఇస్తామని ప్రకటించారు. ఆలస్యం అవుతుందేమో అని కొందరు మంత్రులు సందేహం వ్యక్తం చేశారు. 'పాఠశాలల్లో హాజరు డెబ్బై శాతం ఉన్న పిల్లలకు 'తల్లికి వందనం' కింద డబ్బులు ఇస్తామని ప్రకటించాం. ఈ విద్యా సంవత్సరంలో హాజరు చూసి అర్హత ఉన్నవారికి తిరిగి పాఠశాలలు తెరిచే ముందు డబ్బులు ఇవ్వబోతున్నాం. ఇది సరైందే' అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు కూడా డబ్బులు త్వరలో ఇవ్వబోతున్నట్లు సీఎం తెలిపారు. 'ఈ పథకం కింద కేంద్రం ఇచ్చే మొత్తాన్ని రూ.పది వేలకు పెంచింది. దానికి మరో రూ.పది వేలు కలిపి రైతులకు మొత్తం రూ.20వేలు ఇస్తాం. కేంద్రం ఎన్ని వాయిదాల్లో ఇస్తే మనం కూడా అదే సమయంలో అంతే మొత్తం అన్నే వాయిదాల్లో ఇస్తాం" అని చంద్రబాబు తెలిపారు. పేదల పింఛన్లు రూ.3వేల నుంచి రూ. 4వేలు చేశామనీ, అన్న క్యాంటీన్లు తెరిచామనీ, ఉచిత వంట గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేశామంటూ ఇప్పటిదాకా అమలుచేసిన హామీల గురించి సీఎం వివరించారు. అలాగే.. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులను పట్టాలు ఎక్కించామని తెలిపారు. చేపలు గుడ్లు పెట్టే సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇచ్చే మొత్తం రూ.ఇరవై వేలు ఏప్రిల్‌లో ఇవ్వాలని కూడా మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకొంది. చేపల వేట నిషేధం ఏప్రిల్ మధ్యలో ప్రారంభమై నలభై ఐదు రోజులు కొనసాగుతుంది. కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద గత ప్రభుత్వం పెద్ద మొత్తం బకాయిలు పెట్టి వెళ్లిందని, ముందు ఎంతోకొంత ఇస్తే వారికి కొంత ఉపశమనం కలుగుతుందని మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ కోరారు. అయన విజ్ఞప్తి మేరకు బకాయిల్లో కొంత ఈ నెలలో విడుదల చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం వారి ఖాతాల్లో ఫీజుల డబ్బులు వేస్తున్నందువల్ల రాష్ట్రం ఇచ్చే డబ్బులు కూడా, వారి వరకూ ఆ విద్యార్థుల ఖాతాల్లోనే వేయాలని నిర్ణయం తీసుకొన్నారు. ఈ వర్గాల విద్యార్థులకు ఫీజుల మొత్తంలో అరవై శాతం కేంద్రం ఇస్తోంది. కాలేజీలకు బకాయిలు కొంత మేర విడుదల చేస్తున్నందువల్ల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా కలెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులు బాధ్యత తీసుకొనేలా చూడాలని సమావేశం నిర్ణయించింది. ఆడబిడ్డల నిధి పథకం కూడా వరుస క్రమంలో అమలు చేద్దామని, నిధుల లభ్యత చూసుకొని వెళ్దామని ముఖ్యమంత్రి చెప్పారు.

పెండింగ్ బిల్లులు 1.30లక్షల కోట్లు

- గత ప్రభుత్వం చెల్లించని బకాయిలు
- మంత్రివర్గానికి నివేదించిన రాష్ట్ర ఆర్థిక శాఖ
- 'జల హారతి'పై కేబినెట్‌లో చర్చ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వం చెల్లింపులు చేయకుండా బకాయి పెట్టి వెళ్లిన పెండింగ్ బిల్లుల మొత్తం రూ. ఒక లక్షా ముప్పై వేల కోట్లు. ఈ విషయాన్ని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూశ్ కుమార్ గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అధికారికంగా వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పీయూశ్ కుమార్ ఈ సమావేశంలో కొన్ని వివరాలు వెల్లడించారు. పెండింగ్ బిల్లుల విషయం చర్చకు వచ్చినప్పుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకొని....చెల్లింపు చేయాల్సిన పెండింగ్ బిల్లులు ఎన్ని ఉన్నాయని అడిగారు. ఆ వివరాలను పవన్‌కు పీయూశ్ తెలిపారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. "ప్రభుత్వ ఉద్యోగుల జీతాల నుంచి కత్తిరించి పొదుపు ఖాతాల్లో జమ చేసిన డబ్బులు రూ.ఇరవై వేల కోట్లు కూడా డ్రా చేసి ఇతర అవసరాలకు గత ప్రభుత్వం వాడేసింది. వాటిని తిరిగి జమ చేయాలని కేంద్రం మనపై ఒత్తిడి తెస్తోంది. వాటిని వీలైనంత తొందరలో జమ చేయాల్సి ఉంది. చివరకు కోర్టు పరిధిలో ఉన్న డిపాజిట్లను కూడా డ్రా చేసి గత ప్రభుత్వం వాడేసింది. వీటన్నింటి చెల్లింపుల భారం మనపై పడింది" అని ఆయన చెప్పారు. ఇన్ని సమస్యలు ఉన్నా రాష్ట్రానికి పరిశ్రమలు పెద్ద సంఖ్యలో వస్తున్నాయని, వాటివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతోపాటు ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని తెలిపారు. "ఐదేళ్లకాలంలో ఇరవై లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టిస్తామని వాగ్దానం చేశాం. ఇప్పటికి ఒప్పందాలు కుదిరిన పరిశ్రమల ద్వారానే నాలుగు లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి" అని చంద్రబాబు అన్నారు.

రెవెన్యూ సమస్యలపై మంత్రుల సబ్ కమిటీ

రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం ప్రదర్శిస్తున్నందుకు ఆ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి అక్షింతలు వేశారు. "మీకు ఓపిక ఉండవచ్చు. కానీ ప్రజలు మీ అంత సహనంతో ఎదురు చూడలేరు. వారికి ఇప్పటికే తిరిగి తిరిగి విసుగు వస్తోందని గుర్తించండి" అని ఆయన రెవెన్యూ శాఖ కార్యదర్శి సిసోడియాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న సమస్యల పరిష్కారంపై ఆయన మంత్రివర్గ సమావేశంలో మంత్రులతో చర్చించారు. నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై దృష్టి పెట్టాలని, సాధ్యం అనుకొన్నవాటిని వెంటనే తేల్చేయాలని ఆయన గట్టిగా కోరారు. రెవెన్యూ సదస్సుల్లో ఇప్పటివరకూ పదమూడు వేల దరఖాస్తులు వచ్చాయని ఆ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చెప్పారు. ఏ రకం సమస్యలు ఏమిటో వర్గీకరించాలని, కక్ష సాధింపుగా నిషేధ జాబితాలో పెట్టిన వాటిని తొలగించడం, రీ సర్వేలో వచ్చిన తప్పులు సవరించడం, అర్బన్ ప్రాంతాల్లో నిషేధ జాబితాలో ఉన్న ఇళ్ల స్థలాలకు విముక్తి కలిగించడం వంటివి త్వరగా చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "వచ్చిన వారే మళ్లీ మళ్లీ కాగితం పట్టుకొని తిరుగుతున్నారంటే వారి సమస్య పరిష్కారం కాలేదని అర్థం. మనం మాటలు చెప్పడం కాదు. పరిష్కారంపై శ్రద్ధపెట్టాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడానికి రెవెన్యూ, ఆర్థిక, మునిసిపల్, పరిశ్రమల శాఖల మంత్రులతో సబ్ కమిటీ వేయాలని నిర్ణయం తీసుకొన్నారు. ప్రతి మంత్రివర్గ సమావేశానికి ఈ కమిటీ ఒక స్థాయీ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రధాని పర్యటనపై...

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల ఎనిమిదో తేదీన విశాఖకు వస్తున్నందువల్ల ఆ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రివర్గ సమావేశం చర్చించింది. విశాఖ నగరంలో ఒక కిలోమీటర్ మేర రోడ్ షో, తర్వాత ఒక భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని, కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో దీనిని విజయవంతం చేయాలని నిర్ణయించారు. మూడు పార్టీల నేతల సమావేశం కోసం ఈ నెల ఐదో తేదీన లోకేశ్ విశాఖ వెళ్తున్నారు. విశాఖ రైల్వే జోన్, పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ కర్మాగారం, నక్కపల్లిలో ఫార్మా సెజ్, పారిశ్రామిక నోడ్‌లకు ప్రధాని ఈ సందర్భంగా శంకుస్థాపన చేయనున్నారు. పది వేల మంది ఉద్యోగుల సామర్థ్యంతో విశాఖలో టీసీఎస్ ఏర్పాటు చేయదల్చిన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా వీలైతే ప్రధాని చేతుల మీదుగా ప్రారంభింపచేయాలని సమావేశం నిశ్చయించింది.

పోలవరం- బనకచర్లపై చర్చ

కొత్తగా ప్రతిపాదించిన పోలవరం- బనకచర్ల భారీ నీటిపారుదల పథకంపై నీటి పారుదల శాఖ కార్యదర్శి సాయిప్రసాద్ ప్రజంటేషన్ ఇచ్చారు. విభజన చట్టంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వాన్ని ఈ పథకం కోసం నిధులు అడుగుతున్నామని సీఎం తెలిపారు. ఈ పథకం వస్తే హంద్రీనీవా ప్రాజెక్టు కింద కాల్వల వెడల్పు పెంచాల్సి వస్తుందని, దానిని దృష్టిలో ఉంచుకొని దీనికి మంజూరైన లైనింగ్ పనులు నిలిపివేయాలని ఆర్థికమంత్రి పయ్యావుల కోరారు. పనులు ప్రస్తుతానికి ఆపి పాత ప్రతిపాదనలు మరోసారి పరిశీలన చేయాలని సీఎం ఆదేశించారు.

కోటిమంది కార్యకర్తలకు టీడీపీ ధీమా

- రూ. 5 లక్షల చొప్పున ప్రమాద బీమా
- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్‌తో లోకేశ్ డీల్
- సభ్యత్వ నమోదు మరో 15రోజులు పొడిగింపు



కోటి మంది టీడీపీ కార్యకర్తలకు బీమా వర్తించేలా చేసుకున్న ఒప్పందాన్ని చూపుతున్న మంత్రి నారా లోకేశ్, బీమా కంపెనీ ప్రతినిధి

అమరావతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. కోటి మంది టీడీపీ కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పించేలా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీతో పార్టీ తరఫున ఆయన ఒప్పందం కుదుర్చుకున్నారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో లోకేశ్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్, ఇతర బీమా సంస్థల ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కోటి మందికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామనీ, ఒకేసారి ఇంతమందికి బీమా కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రథమమని లోకేశ్ అన్నారు. అక్టోబరు 26న ప్రారంభమైన సభ్యత్వ నమోదు డిసెంబరు 31తో ముగియాల్సి ఉన్నా- ప్రజల నుంచి వస్తున్న స్పందనతో మరో 15 రోజులు పొడిగించామని తెలిపారు.

బీమాకు మార్గదర్శకాలు

బీమా పొందటానికి అనుసరించాల్సిన ప్రక్రియపై టీడీపీ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రమాద బీమా కోసం వ్యక్తి మరణించిన 15రోజుల్లోపు తెలియజేసి, 30రోజుల్లోగా నామినీ పత్రాలతో పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలియజేయాలని సూచించింది. ఏదైనా సమాచారం కోసం 7306299999 నంబరుకు ఫోన్ చేయాలని కోరింది. బాధిత కుటుంబం ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం నివేదిక, తహసీల్దార్ జారీ చేసే మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు నకళ్లు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ప్రమాదం జరిగినప్పుడు తీసిన రెండు ఫొటోలు, న్యూస్ పేపర్ కటింగ్, నామినీ ఆధార్, బ్యాంక్ అకౌంట్, పాన్‌కార్డు, ఓటర్‌ఐడీతో పాటు ఆయా పత్రాల ఒరిజినల్ సెట్, జిరాక్స్ కాపీలు రెండు సెట్లు అందజేయాలని పార్టీ నిర్దేశించింది.

చేరికలపై సమస్య ఉంటే ముందు నాకు చెప్పండి

- మంత్రులకు లోకేశ్ సూచన

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి కూటమిలోని పార్టీల్లో ఎవరినైనా చేర్చుకునే విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని మంత్రి లోకేశ్ సహచర మంత్రులకు సూచించారు. గురువారమిక్కడ రాష్ట్ర కేబినెట్ సమావేశానికి ముందు తమ పార్టీకి చెందిన కొందరు మంత్రులతో ఆయన కొద్దిసేపు భేటీ అయ్యారు. విశాఖ వైసీపీ నేత ఆడారి ఆనంద్ ఇటీవల బీజేపీలో చేరడంపై రేగిన వివాదం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. మంగళగిరి నియోజకవర్గంలోని వైసీపీ నేత గంజి చిరంజీవి జనసేనలో చేరడాన్ని ఒక మంత్రి ప్రస్తావించారు. దీనిపై తనకు ముందుగానే సమాచారం ఇచ్చారని లోకేశ్ చెప్పారు. 'రాజకీయాల్లో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి చేరికలు సహజం. అయితే ఎక్కడైనా ఇటువంటి చేరికల వల్ల సమస్య ఉందని అనిపిస్తే ముందుగా నా దృష్టికి తీసుకురండి' అని అన్నారు.

'ఆప్కాబ్' రేసులో గన్ని వీరాంజనేయులు

రాష్ట్ర సహకార బ్యాంక్ ఆప్కాబ్ ఛైర్మన్ పదవి రేసులోకి ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు వచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. నామినేటెడ్ పదవుల పంపకంలో ఏలూరు జిల్లాకు తక్కువ అవకాశాలు వచ్చాయని, అక్కడి సామాజిక సమీకరణల దృష్ట్యా ఈ పదవిని గన్నికి ఇస్తే సముచితంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. పరిశీలిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

క్రిమినల్స్ కన్నా మెరుగ్గా ఆలోచించాలి

- ట్రైనీ ఏఎస్పీలు, డీఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'సైబర్ నేరాలు సవాల్ విసురుతున్నాయి.. క్రిమినల్స్ కన్నా పోలీసులు మెరుగ్గా ఆలోచిస్తేనే నేరాలు కట్టడి అవుతాయి.. నేరస్తులకు అవకాశం ఇవ్వొద్దు' అని సీఎం చంద్రబాబు యువ ఐపీఎస్‌లు, డీఎస్పీలకు సూచించారు. ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని పోలీసు శాఖలోకి అడుగుపెట్టిన పలువురు ఏఎస్పీలు, డీఎస్పీలు గురువారం రాష్ట్ర సచివాలయంలో చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం వారికి కీలక సూచనలు చేశారు. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. 'మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసింగ్ ఉండాలి.. ఫ్రెండ్లీ పోలీసింగ్.. అధునాతన టెక్నాలజీకి ప్రాధాన్యమిస్తూనే నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి' అని సూచించారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా రాష్ట్రంగా ఏపీకి అపఖ్యాతి వచ్చిందని, మత్తు పదార్థాలు కట్టడిచేసి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణ కోసం కాకుండా పగ తీర్చుకోవడానికి గత ప్రభుత్వానికి ఆయుధాలుగా మారారని సీఎం అన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎస్పీలు, డీఎస్పీల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

బాబును తిట్టు.. అయినా పోస్టు పట్టు!

(మొదటి పేజీ తరువాయి)

ఆయనకు ప్రాధాన్యం ఇస్తూనే ఉన్నారు. కానీ ఆయన మాత్రం ఏనాడూ కృతజ్ఞత చూపలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కోడ్ వచ్చాక కరువు పరిస్థితులపై సమీక్ష చేయడానికి అధికారులను సమావేశానికి ఆహ్వానించారు. అప్పుడు కొందరు అధికారులు నోవాటెల్ హోటల్‌లో సమావేశమై ముఖ్యమంత్రి సమీక్షకు ఎవరూ వెళ్లకూడదని నిర్ణయించారు. ఇది ఒకరకంగా చంద్రబాబుపై తిరుగుబాటు ప్రకటించడమే. ఈ సమావేశంలో కీలక పాత్ర రాజశేఖర్‌దే. అలాగే 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సచివాలయంలో నాలుగో బ్లాక్ ముందు మీడియా సమక్షంలోనే.. 'ఏ నిర్ణయం పడితే ఆ నిర్ణయం తీసుకుంటే డబ్బులు చంద్రబాబు ఇస్తాడా? మీడియా ఇస్తుందా?' అంటూ సీఎంపైనే బహిరంగంగా మండిపడ్డారు. రాజశేఖర్ శాఖల్లో సాధించిన ఘనతలు పెద్దగా లేవు కానీ చంద్రబాబుపై నోరు పారేసుకోవడం ద్వారా మాత్రమే మీడియాలో హైలైట్ అయ్యారు. జగన్ సీఎం అయ్యాక ఆయనకు వీరవిధేయుడిగా మారిపోయారు.

ఏడాదిలో 'కొరత' తీరుతుందా?

అధికారుల కొరత ఉందంటూ రాజశేఖర్ ఏడాది పాటు పదవిలో కొనసాగే అవకాశం కల్పించారు. అయితే ఏడాది తర్వాత కూడా అధికారుల కొరత సమస్య తీరదు. అధికారుల కొరత సమస్య నుంచి బయట పడాలంటే అదనపు అధికారులను కేటాయించాలని కేంద్రాన్ని కోరాలి. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయిన తర్వాత కేంద్రాన్ని కోరి అదనపు అధికారులను తెచ్చుకున్నారు. కానీ చంద్రబాబు ఇలా చేయలేదు. అధికారుల కొరత ఉందని చెబుతున్నప్పుడు రాజశేఖర్‌తో పాటు అదేరోజు రిటైరయిన మరో ఐఏఎస్ పోలా భాస్కర్ సర్వీస్ కాలం ఎందుకు పొడిగించలేదో? జలవనరులు, విద్యుత్, ఆర్థికం లాంటి ప్రత్యేక శాఖల్లో టెక్నికల్ అంశాలు అర్థం చేసుకోవడం కష్టం. అందరు అధికారులూ ఈ శాఖలు చేయలేరు. కానీ వ్యవసాయ శాఖ సాధారణ సబ్జెక్టు. ఏ అధికారైనా అవలీలగా చేయగలరు. రాజశేఖర్ 2014-19 సమయంలో నాలుగేళ్ల పాటు వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా చేశారు. ఇప్పుడు కూడా అదే శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా రిటైరయ్యారు. రీఅపాయింట్‌మెంట్ తర్వాత కూడా అదే శాఖలో అదే హోదాలో కొనసాగుతున్నారు.

నిబంధనలకు విరుద్ధం: అఖిల భారత సర్వీసు అధికారులకు పదవీ విరమణ తర్వాత సర్వీసు పొడిగింపు కుదరదని డీవోపీటీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. రిటైరయిన అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగ్ ఇచ్చినా సలహాదారుగానో, కన్సల్టెంట్‌గానో, ఓఎస్‌డీగానో తీసుకోవచ్చు. అంతేకానీ సంతకాలు పెట్టి జీవోలు ఇచ్చే అధికారం ఇవ్వడం డీవోపీటీ నిబంధనలకు విరుద్ధం. పదవీకాలం పొడిగింపు తీసుకుని సర్వీసులో కొనసాగే సౌకర్యం ఒక్క చీఫ్ సెక్రటరీకి మాత్రమే ఉంది. అందుకు కూడా కేంద్రం అనుమతించాలి. రిటైరయిన స్పెషల్ సీఎస్‌ను రీఅపాయింట్‌మెంట్ పేరుతో అదే పోస్టులో నియమించే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే, సీఎస్ పదవీకాలం పొడిగింపు కోసం డీవోపీటీ అనుమతి ఎందుకు కోరుతుంది? ఏడాది పాటు సర్వీసు పొడిగింపు ఇచ్చారంటే కాంట్రాక్టు విధానంలో ప్రభుత్వంలోకి తీసుకున్నట్టు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవోలు ఇచ్చే అధికారం ఉండదు.

No. 26012/6/2002-Estt. (A)
Government of India
Ministry of Personnel, P.G. & Pensions
(Department of Personnel & Training)

New Delhi, dated 9th December, 2002

9. **Re-employment:** No proposal for employing a government servant beyond the age of superannuation of 60 years shall be considered. It is also clarified that no person can be appointed/re-appointed to Central Government service after the age of superannuation of 60 years through contract.

రిటైర్ అయిన అధికారులకు సర్వీసు పొడిగింపు కుదరదని స్పష్టం చేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఇచ్చిన ఆదేశాలు

ఒక్కటే తేడా

గతంలో జగన్ హయాంలో తనకు అనుకూలంగా పనిచేసే అధికారులు రిటైరయ్యాక రీఅపాయింట్‌మెంట్ పేరుతో ఇలా ఏడాది పాటు సర్వీసు పొడిగించారు. ఐఏఎస్‌లు ఉషారాణి, కరికల్ వలవన్, విజయ్ కుమార్‌కు రీఅపాయింట్‌మెంట్ ఇచ్చారు. తనకు కావాల్సిన ఫైళ్లపై సంతకాలు పెట్టించుకున్నారు. అప్పుడు జగన్ చేసింది తప్పు. నిబంధనలకు విరుద్ధం. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే పంథాలో నడుస్తున్నారు. అప్పుడు, ఇప్పుడు ఒక్క తేడా ఏంటంటే... జగన్ తన అనుకూల అధికారులకు సర్వీసు పొడిగించి వాడుకోగా, చంద్రబాబు మాత్రం తనను ఏనాడూ లెక్కచేయని ఓ అధికారికి సర్వీసు పొడిగించి అందలమెక్కించారు.

అమరావతి ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పు!

- **ఫేజ్-2 డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ కోసం టెండర్లు**

విజయవాడ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) ఫేజ్-2 సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు కన్సల్టెన్సీ నియామకం కోసం సీఆర్డీఏ గురువారం టెండర్లు పిలిచింది. ఎన్టీఆర్ జిల్లా మీదుగా సాగే ఫేజ్-2కు డీపీఆర్ పిలవటంతో ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మారుతోందని తెలుస్తోంది. గతంలో సీఆర్డీఏ రూపొందించిన ఫేజ్-2 (28.68 కి.మీ.) అలైన్‌మెంట్ విజయవాడ వెస్ట్ బైపాస్‌కు అతి సమీపంలో ఉండటంతో దీన్ని మార్చాలని నిర్ణయించినట్టు సమాచారం. గతంలో ఈ బైపాస్ పనులు జరగక ముందు ఫేజ్-2ను వెదురుపావులూరు నుంచి కేతనకొండ వరకు ప్రతిపాదించారు. ఈ అలైన్‌మెంట్‌లో కొండపల్లి అభయారణ్యం కూడా ఉంది. టన్నెళ్లు ఉన్నదున దీన్ని రెండో దశలో చేపడతారని భావిస్తున్న తరుణంలో డీపీఆర్ పిలవడం ఆసక్తిని రేపుతోంది. విజయవాడ తూర్పు బైపాస్ అలైన్‌మెంట్ కృష్ణాజిల్లాలో ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లకు అత్యంత దగ్గరగా, సమాంతరంగా వెళుతోంది. దీని అలైన్‌మెంట్ మార్చాలన్న వాదనలు వస్తున్నాయి. ఫేజ్-1లో కృష్ణాజిల్లా పరిధిలోకి వచ్చే కొంత భాగానికి కూడా డీపీఆర్ మార్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అమరావతి ఐఆర్ఆర్‌ను ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలను కలుపుతూ రాజధాని నగరానికి వలయాకారంగా 96.16 కిలోమీటర్ల పొడవు, 75 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తం 35 గ్రామాల మీదుగా ఐఆర్ఆర్ సాగుతుంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం మొత్తం 3,556.17 ఎకరాల భూములు సేకరించాలని నిర్ణయించారు. ఐఆర్ఆర్ మొదటి దశ 67.57 కిలోమీటర్లు, రెండో దశ 28.68 కిలోమీటర్లుగా నిర్దేశించారు. వెదురుపావులూరు, రామచంద్రాపురం, నున్న, పాతపాడు, తాడేపల్లి, కొత్తూరు, వెలగలేరు, కవులూరు, కొండపల్లి, ఇబ్రహీంపట్నం, జూపూడి, త్రిలోచనాపురం, నవీ పోతవరం, జమీ మాచవరం, కేతనకొండ (పార్ట్)ల మీదుగా రెండో దశ సాగుతుంది. ఈ గ్రామాల్లో వెదురుపావులూరు నుంచి రామచంద్రాపురం, నున్న, పాతపాడు, తాడేపల్లి, కొత్తూరు మీదుగా విజయవాడ వెస్ట్ బైపాస్ వెళుతోంది. ఐఆర్ఆర్ కూడా పై ఆరు గ్రామాల్లో విజయవాడ వెస్ట్ బైపాస్‌కు అత్యంత సమీపంలో సమాంతరంగా వెళుతుంది. ఈ నేపథ్యంలో ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను స్వల్పంగా మార్చే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, అమరావతి ఐఆర్ఆర్‌కు సంబంధించి అత్యుత్తమమైన ల్యాండ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని నిర్ణయించేందుకు కన్సల్టెంట్ కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్(ఆర్ఎఫ్‌పీ)ను సీఆర్డీఏ గురువారం విడుదల చేసింది.




విజయవాడలో గురువారం రాత్రి ప్రారంభమైన పుస్తక మహోత్సవంలో స్టాళ్ల వద్ద పుస్తకప్రియుల సందడి

తెలుగు మహోన్నతం

(మొదటి పేజీ తరువాయి)

35వ పుస్తక మహోత్సవాన్ని ఆయన గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాతృభాష పరిరక్షణకు పుస్తక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విజయవాడ రచయితలకు పుట్టినిల్లు అని కొనియాడారు. ప్రముఖ రచయితలు రచనలు చేసిన ప్రదేశాలను, వారు నివసించిన ఇళ్లను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. అటువంటి వారి చిహ్నాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న గ్రంథాలయాలను సాహితీ కేంద్రాలుగా మార్చాలని పవన్ అభిప్రాయపడ్డారు. ఇక్కడ సాహితీవేత్తలు కూర్చునేలా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, ఇదొక ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. సాహిత్యంపై పట్టున్న బలమైన సమాజాన్ని ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. పఠనం మాటెలా ఉన్నా, వాక్య నిర్మాణం చేసేటప్పుడు తప్పులు లేకుండా రాయాలంటే చాలా కష్టపడాలన్నారు. పుస్తక పఠనం వల్ల రచయితల ఆలోచనా విధానం, దృక్కోణం అర్థమవుతాయని చెప్పారు. తెలుగులో అద్భుతమైన సాహిత్యం ఉందని, దాన్ని చదివినప్పుడు మనస్సు, మేధస్సు ఎంతో వికసిస్తాయని పవన్ తెలిపారు. పద ప్రయోగంపై పట్టు ఉండాలని స్పష్టం చేశారు. జ్ఞానం ఉన్న వాళ్లు ఎక్కువగా మాట్లాడరని, అటువంటి వారి వద్దకు వెళ్తే అనేక విషయాలు తెలుస్తాయని అన్నారు. సనాతన ధర్మంపై తిరుపతిలో ప్రసంగం రాసుకోవడానికి ఏడు గంటల సమయం పట్టిందని వెల్లడించారు. శ్రీశ్రీ వేదన నుంచి 'మహాప్రస్థానం', బాలగంగాధర తిలక్ జ్వలించడంతో 'అమృతం కురిసిన రాత్రి' వెలువడ్డాయని చెప్పారు.

అందుకు ఇప్పటికీ బాధపడుతున్నా..

తాను తెలుగు భాషను సరిగా నేర్చుకోలేదని, దానికి ఇప్పటికీ బాధపడుతున్నానని డిప్యూటీ సీఎం పవన్ విచారం వ్యక్తం చేశారు. తెలుగు అధ్యాపకులను సరిగా అర్థం చేసుకోలేకపోయాయని బాధపడ్డారు. ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేయడం ఇష్టం లేక కాదని, తాను కోరుకున్న చదువు పుస్తకాల్లో లేకపోవడంతోనేనని వివరించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తితో సొంతంగా తెలుగు నేర్చుకున్నానని తెలిపారు. పుస్తకాలు చదవడం వల్ల మానసిక శక్తి బలోపేతం అవుతుందన్నారు. విశ్వనాథ సత్యనారాయణ పత్రికల్లో నడిపిన హాహాహూహూ ధారావాహికం చదివినప్పుడు సంస్కృతిలోని గొప్పదనం తెలిసిందన్నారు. వనవాసి నవల ప్రకృతిని పరిచయం చేసిందన్నారు. క్లాసికల్ తాను ఎవరికైనా రూ.కోటి ఇవ్వడానికి ఆలోచించబోనని, పుస్తకాలు ఇవ్వడానికి మాత్రం ఆలోచిస్తానని తెలిపారు.

మూడో వంతు నేను భరిస్తా

సూర్యరాయాంధ్ర నిఘంటువు పునః ప్రచురణకయ్యే ఖర్చులో మూడో వంతు తాను భరిస్తానని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ నిఘంటువును పునః ప్రచురించడానికి రూ.1.70 కోట్లు అవసరమవుతుందన్నారు. ఈ ఖర్చులో మూడో వంతు తాను భరిస్తానని మిగిలిన నిధులను కేంద్ర సాహిత్య అకాడమీ గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు.

'పీవీ' ఠీవి కోసం పోరాటం చేయాలి

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఢిల్లీలో తగిన గుర్తింపు వచ్చే వరకు తెలుగు వారంతా పోరాటం చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధి ఎ.కృష్ణారావు రాసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు-పాములపర్తి వెంకట నరసింహారావు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

నాకు పుస్తకాలంటే ప్రాణం

పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తుండగా ఆయనఅభిమానులు ఓజీ... ఓజీ... అంటూ నినాదాలు చేశారు. దీనికి ఆయన నవ్వుతూ ఓజీ... ఓజీ...అనడం కంటే శ్రీశ్రీ అనడం తనకు ఇష్టమని చెప్పారు. "నాకు పుస్తకాలు ప్రాణం. నేను ఈ స్థాయికి వచ్చానంటే దానికి పుస్తకాలు కారణం." అని తెలిపారు. ప్రసంగాలను తానే రాసుకుంటానని, భగవంతుడు ఆశీస్సులు అందజేస్తే తప్పకుండా పుస్తకం రాస్తానని చెప్పారు. టీవీలు, సోషల్ మీడియాతో గడపకుండా పుస్తకాలను చదవాలని సూచించారు. తొలిప్రేమ చిత్రానికి తనకు రూ.15 లక్షలు రెమ్యునరేషన్ ఇస్తే అందులో రూ.1 లక్షతో పుస్తకాలు కొనుగోలు చేశానని తెలిపారు. ఒక మనిషి జీవితకాలంలో 10 వేల పుస్తకాలను చదవగలడని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.